www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 24-4-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 8 | హైదరాబాద్ సిటీ*

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళ పక్షం; తిథి: ఏకాదశి మ.2.33 తదుపరి ద్వాదశి; నక్షత్రం: శతభిషం ఉ.10.49 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: సా.4.42-6.10; దుర్ముహూర్తం: ఉ.10.07-10.58, మ.3.09-3.59; అమృతఘడియలు: రా.1.31-2.59; రాహుకాలం: మ.1.30-మ.3.00; సూర్యోదయం: 5.56; సూర్యాస్తమయం: 6.29

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

LAUNCHING CASAGRAND GS INFINITY ATTAPUR

LAUNCHING CASAGRAND GS INFINITY ATTAPUR

TS RERA: P02500009503 | www.rera.telangana.gov.in

*T&C apply excluding GST & Registration

విలాసవంతమైన సముదాయ సమాహారం

సెంట్రల్ హైదరాబాద్‌లో

మెహిదీపట్నం నుండి 5 నిమిషాలు | ఓఆర్ఆర్ నుండి 10 నిమిషాలు



LAUNCHING CASAGRAND GS INFINITY

అత్తాపూర్ వద్ద 3 & 4 BHK మన్‌హాట్టన్-శైలి అపార్ట్‌మెంట్లు & 5 BHK ఫ్లోర్ విల్లాలు మెయిడ్ రూమ్‌తో ₹1.85 Cr - ₹3.15 Cr* నుండి

405 వెల్-డిజైన్డ్ అపార్ట్‌మెంట్స్ | 4.8 ఎకరాల కమ్యూనిటీ | G+35 హై-రైజ్ స్కైస్క్రేపర్ | 80% ఖాళీ ఏరియా | 41,000sft. గ్రాండ్ క్లబ్‌హౌస్ | 100+ ప్రపంచ-స్థాయి సౌకర్యాలు

CREDAI

FOR BOOKING CALL: 80155 08602 | Exclusive site visit available. Visit model house at site.

CASAGRAND building aspirations

LAUNCHING

CASAGRAND GS INFINITY

అత్తాపూర్ వద్ద 3 & 4 BHK మన్‌హాటన్-శైలి అపార్ట్‌మెంట్లు & 5 BHK ఫ్లోర్ విల్లాలు మెయిడ్ రూమ్‌తో

మెహిదీపట్నం నుండి 5 నిమిషాలు | ఓఆర్ఆర్ నుండి 10 నిమిషాలు

₹1.85 Cr* Onwards

INCREDIBLY PRICED

Type	Size (Sft.)	Market Price	Launch Price	Early Bird Price (*For the first 1 - 25 bookings only)
3 BHK	2386	~~₹2.28Cr~~	~~₹1.95Cr~~	₹1.85Cr
4 BHK	2961	~~₹2.85Cr~~	~~₹2.55Cr~~	₹2.40Cr
5 BHK Floor Villas	3917	~~₹3.70Cr~~	~~₹3.35Cr~~	₹3.15Cr

Total Units: **405** | Phase 1 Units: **270** | Available Units: **212** | **Handover in 36 months** | Price after 25 bookings - ₹**1.95**cr - ₹**3.35**cr*

100+ ప్రపంచ-స్థాయి సౌకర్యాలు



అవుట్‌డోర్ సౌకర్యాలు

ఫీచర్లు & ఎంటర్‌టైన్‌మెంట్

1. ఎంట్రీ డ్రాప్-ఆఫ్ జోన్
2. వాకింగ్/జాగింగ్ ట్రాక్
3. గణిత గుర్తులతో పిల్లల జాగింగ్ ట్రాక్
4. అప్‌గ్రేడ్ చేసిన పార్కింగ్ ఫీచర్‌లతో సైకిల్ పార్కింగ్ జోన్
5. సైకిళ్లతో సైక్లింగ్ ట్రాక్
6. వాల్ బార్బిక్యూ
7. హ్యాంగ్అవుట్ స్పేస్
8. పెట్స్ పార్కు
9. పెట్ వాషింగ్ స్టేషన్
10. హెర్బ్ మరియు స్పైస్ గార్డెన్
11. ఈవీ కార్ ఛార్జింగ్ స్టేషన్
12. సెల్ఫీ స్పాట్
13. బర్డ్ ఫీడర్
14. అవుట్‌డోర్ ఏరియాలో దోమల మాగ్నెట్
15. అవుట్‌డోర్ ఫ్యాన్
16. పైప్డ్ మ్యూజిక్ సిస్టమ్‌తో బొల్లార్డులు
17. గ్రానైట్ చెస్ టేబుళ్లు
18. కొరియర్/ పార్శిల్ కోసం లాకర్లు
19. పనిమనిషి/ డ్రైవర్లు & ఎఫ్ఎం బృందం కోసం ప్రత్యేక పార్కింగ్

కిడ్స్ జోన్

20. అవుట్‌డోర్ ప్లేబోర్డ్
21. ఎడ్యుకేషనల్ ప్లేగ్రౌండ్
22. కిడ్స్ మ్యూజిక్ పార్క్
23. కిడ్స్‌ప్లే ఏరియాలో రబ్బర్ మౌండ్
24. అడల్ట్ నెక్ట్ స్వింగ్
25. సీ-సా
26. సీటింగ్‌తో గ్రానైట్ స్నేక్ & ల్యాడర్
27. పేరెంట్ & కిడ్స్ స్వింగ్
28. ఇన్-గ్రౌండ్ ట్రామ్పోలిన్
29. కర్ల్ స్వింగ్
30. ఇంటరాక్టివ్ ఫ్లోర్ గేమ్ - జెయింట్ స్నేక్ & ల్యాడర్
31. కిడ్స్‌ప్లే ఏరియాలో జెయింట్ అబాకస్
32. కిడ్స్ వర్టికల్ ప్లే గ్రౌండ్
33. పల్స్ ఇంటరాక్టివ్ గేమ్స్
34. కిడ్స్ ఏరియాలో సైకిల్ పార్కింగ్ స్పేస్
35. టోట్ లాట్
36. పిల్లల కోసం బాస్కెట్‌బాల్ హూప్

స్పోర్ట్స్ & ఫిట్‌నెస్ వెల్‌బీయింగ్

37. ఫిట్‌నెస్ కోర్ట్
38. గ్రానైట్ టేబుల్ టెన్నిస్ - అవుట్‌డోర్
39. ఇంటిగ్రేటెడ్ టార్గెట్ వర్క్అవుట్స్ & మంకీ బార్ - ఫ్లోర్ మార్కింగ్స్
40. మల్టీపర్పస్ స్పోర్ట్స్ కోర్ట్
41. వాలీబాల్ క్రాస్ నెట్
42. పికిల్‌బాల్ కోర్ట్
43. సెల్ఫ్ టెన్నిస్ (అవుట్‌డోర్)
44. మినీ గోల్ఫ్ కోర్స్
45. స్కేటింగ్ రింక్
46. మల్టీ-హూప్ బాస్కెట్‌బాల్ కోర్ట్
47. అవుట్‌డోర్ క్రాస్‌ఫిట్ కోర్ట్

క్లబ్‌హౌస్ సౌకర్యాలు

ఆరోగ్యం & సంక్షేమం

48. మెడిటేషన్ లాన్
49. జెన్ గార్డెన్
50. మెడిసినల్ ప్లాంట్ గార్డెన్
51. నేచర్ వాక్‌వే
52. మ్యూజికల్ ఇంటరాక్టివ్ స్కల్ప్‌చర్
53. లీజర్ ల్యాండ్‌స్కేప్ కోర్ట్ (బయోఫిలిక్ యాంఫిథియేటర్)
54. రిఫ్లెక్సాలజీ మొజాయిక్ గార్డెన్

ఫీచర్స్ & ఎంటర్టైన్మెంట్

55. కన్వీనియన్స్ స్టోర్
56. బాంకెట్ హాల్ - సెపరేట్ డైనింగ్ ఏరియా
57. క్రెచ్
58. మినీ థియేటర్
59. క్యారొకి ఫ్లోర్
60. రూఫ్‌టాప్ డైనింగ్ & కేఫ్
61. వీడియో గేమ్‌లతో కూడిన ఏవీ రూమ్
62. కిడ్స్ రూమ్‌లో ఆర్ట్స్ & క్రాఫ్ట్స్ స్పేస్
63. గెస్ట్ రూమ్
64. అసోసియేషన్ రూమ్
65. అమినిటీస్ మేనేజ్‌మెంట్ యాప్

స్పా మరియు సెలూన్

66. సెలూన్
67. స్పాలో ఫ్లష్డ్ జాకుజీ
68. స్టీమ్/సౌనా
69. మసాజ్ రూమ్

స్పోర్ట్స్ & ఫిట్‌నెస్ వెల్‌బీయింగ్

70. బ్యాడ్మింటన్ కోర్ట్
71. గోల్ఫ్ సిమ్యులేటర్ రూమ్
72. ఏఆర్ స్క్వాష్ కోర్ట్
73. ఆటోమేటెడ్ బీఎంఐ మెషీన్
74. ఆక్సిజన్ డిఫ్యూజర్
75. జిమ్
76. యోగా/ ఏరోబిక్స్

కో-వర్కింగ్ స్పేస్

77. కాన్ఫరెన్స్ రూమ్
78. క్లబ్‌హౌస్‌లో కాఫీ స్టేషన్
79. రీడింగ్ పాడ్స్

టెర్రస్ సౌకర్యాలు

80. స్కై సినిమా
81. టెర్రస్‌పై ఆర్ట్స్ & క్రాఫ్ట్స్ ఏరియాతో కిడ్స్ జోన్
82. స్టార్ గేజింగ్ డెక్
83. టెర్రస్‌లో పిక్నిక్ లాన్
84. టెర్రస్‌లలో ఓపెన్ జిమ్
85. అబ్జర్వేటరీ డెక్స్

ఇండోర్ గేమ్స్

86. బోర్డ్ గేమ్స్
87. డార్ట్ బోర్డ్
88. ఆర్కేడ్ గేమ్స్
89. కిడ్స్ సైక్లింగ్ ఇంటరాక్టివ్ వాల్
90. పిల్లల కోసం వెల్క్రో వాల్
91. ఎయిర్ హాకీ
92. ఫూస్‌బాల్
93. పూల్ టేబుల్
94. మినీ హాకీ
95. లెగో వాల్
96. టేబుల్ టెన్నిస్
97. వీడియో గేమ్ రూమ్

క్లబ్‌హౌస్ టెర్రేస్ సౌకర్యాలు

98. టెర్రస్ సౌకర్యాల కోసం టెర్రస్ వద్ద లాబీ
99. స్టార్ గేజింగ్ డెక్‌లోకి విస్తరించే అంతస్తు
100. గ్రిల్లింగ్ పెవిలియన్ (బీబీక్యూ కౌంటర్)

స్విమ్మింగ్ పూల్ సౌకర్యాలు

101. ఇన్ఫినిటీ స్విమ్మింగ్ పూల్ (క్లోరిన్‌ఫ్రీ)
102. డెక్ సీటర్లతో కూడిన కిడ్స్ పూల్
103. ఇంటరాక్టివ్ కిడ్స్‌ప్లే తో కూడిన వాటర్ స్కల్ప్‌చర్
104. హైడ్రోథెరపీ పూల్











Know more about Casagrand

Scan to experience luxury like never before

TS RERA: P02500009503 | www.rera.telangana.gov.in | *T & C Apply.

WHY CASAGRAND

20 years of real estate excellence	**160+** landmark projects	**55,000+** happy families	**2023** rigorous quality checks	**87%** on-time delivery	**7 cities** Chennai, Bengaluru, Hyderabad, Coimbatore, Pune, Delhi & Dubai
2 months of rental assurance	**6 months** of resale support	**8 Year** warranty & 10-year community maintenance	**75%** open area for 2x more light & ventilation	**0%** space wastage for carpet area efficiency	**23** global brands used in fittings and finishing materials

CREDAI

FOR BOOKING CALL: **80155 08602** | Exclusive site visit available. Visit model house at site.

CASAGRAND building aspirations

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

తుపాకీ లాక్కోబోయి.. తూటాలకు బలైపోయి..


ఆదిల్ హుస్సేన్ షా అంతిమ యాత్రలో ప్రజలు; (ఇన్‌సెట్) ఆదిల్

పర్యాటకులపై దాడిని
అడ్డుకోబోయిన కశ్మీరీ యువకుడు
ఆ క్రమంలో కాల్చి చంపిన ఉగ్రవాదులు
పర్యాటకులను గుర్రంపై తీసుకెళ్తూ
ఆదిల్ హుస్సేన్ షా ఉపాధి
మృతితో రోడ్డునపడ్డ కుటుంబం 13

గురువారం | 24-4-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 8 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, చైత్రమాసం, బహుళ పక్షం; తిథి: ఏకాదశి మ.2.33 తదుపరి ద్వాదశి; నక్షత్రం: శతభిషం ఉ.10.49 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: సా.4.42-6.10; దుర్ముహూర్తం: ఉ.10.07-10.58, మ.3.09-3.59; అమృతఘడియలు: రా.1.31-2.59; రాహుకాలం: మ.1.30-మ.3.00; సూర్యోదయం: 5.56; సూర్యాస్తమయం: 6.29 | హైదరాబాద్ సిటీ*
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పోలీసులు విడుదల చేసిన పహల్గాం దాడి ఉగ్రవాదుల ఊహా చిత్రాలు



వాళ్లు పాకిస్థానీలే..!

పహల్గాం దాడి ఉగ్రవాదుల్లో ఐదుగురు ఆ దేశస్థులే.. వారి భాష ఆధారంగా గుర్తింపు

దాడిలో పాల్గొన్నది మొత్తం ఏడుగురు.. అందులో ఇద్దరు స్థానికులు

దర్యాప్తు బృందాల వెల్లడి.. ఉగ్రవాదుల ఊహాచిత్రాలను విడుదల చేసిన పోలీసులు

నిఘా వర్గాలు హెచ్చరించినా.. భద్రతా దళాల వైఫల్యం వల్లే ఉగ్రదాడి?

సైనికుల దుస్తుల్లో వచ్చి 70 రౌండ్ల కాల్పులు.. ప్రాథమిక దర్యాప్తులో వెల్లడి

కశ్మీర్‌లో 56 మంది విదేశీ ఉగ్రవాదులు.. అత్యధికులు లష్కర్ ముష్కరులే!

పహల్గాం, ఏప్రిల్ 23: జమ్మూకశ్మీరులోని పహల్గాంలో పర్యాటకులపై దాడి పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాదుల పనేనని దర్యాప్తు సంస్థలు తేల్చాయి. దాడి సమయంలో ఉగ్రవాదులు మాట్లాడిన భాష, వారి యాస ఆధారంగా ఈ నిర్ణయానికి వచ్చాయి. ఈ దాడిలో మొత్తం ఏడుగురు ఉగ్రవాదులు పాల్గొనగా వారిలో ఐదుగురు పాకిస్థానీలు, ఇద్దరు స్థానికులు(కశ్మీరు వాళ్లు) ఉన్నట్టు గుర్తించాయి. ఉగ్రదాడి నుంచి తప్పించుకున్న వారు, ప్రత్యక్ష సాక్షులతో మాట్లాడిన దర్యాప్తు అధికారులు.. ఉగ్రవాదులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించారు. ఈ క్రమంలో దాడి సమయంలో ఉగ్రవాదుల్లో కొందరు మాట్లాడిన భాష, యాస.. పాకిస్థాన్‌లో మాత్రమే మాట్లాడేవిగా గుర్తించారు. దీంతో ఉగ్రదాడిలో పాకిస్థానీల పాత్రను నిర్ధారించారు. అయితే, ఉగ్రవాదులకు సహకరించిన స్థానికుల గుర్తింపు వివరాలు తెలియాల్సి ఉంది. కాగా, దాడిలో పాల్గొన్న ఉగ్రవాదుల ఫొటో, ఊహాచిత్రాలను దర్యాప్తు సంస్థలు బుధవారం విడుదల చేశాయి. దర్యాప్తు సంస్థలు విడుదల చేసిన ఫొటోలో సాయుధులైన నలుగురు వ్యక్తులు ఉన్నారు. అలాగే, ఆసిఫ్ ఫౌజి, సులేమాన్ షా, అబు తాలా అనే ముగ్గురి ఊహాచిత్రాలను కూడా విడుదల

మిగతా 12వ పేజీలో...

ఖాళీ అవుతున్న కశ్మీరం!

కశ్మీర్‌ను వీడుతున్న పర్యాటకులు

దాడికి నిరసనగా జమ్మూకశ్మీర్‌లో బంద్

మొదటి పేజీలను నలుపు రంగుతో ప్రచురించిన స్థానిక పత్రికలు 13

మరో ఉగ్రదాడి జరిగే ప్రమాదం

నిఘావర్గాల సమాచారం 12

రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం

దాడితో సంబంధం లేదు: పాక్

సరిహద్దులకు సైన్యం తరలింపు 13

కరాచీ నుంచి 2 మిలటరీ విమానాలు

భారత్ ప్రతీకారదాడులపై భయం

పాక్‌పై జల ఖడ్గం

సింధు జలాలు బంద్



1960 నాటి సింధు జలాల ఒప్పందం అమలును నిలిపేసిన భారత్

వాఘా-అట్టారీ సరిహద్దు చెక్ పోస్ట్ తక్షణ మూసివేత

సార్క్ వీసా మినహాయింపు కింద పాకిస్థానీలకు భారత్‌లోకి ప్రవేశం నిషిద్ధం.. ఇప్పటికే అలా వచ్చినవారి వీసాల రద్దు

ఈ వీసాపై వచ్చిన పాకిస్థానీలు 48 గంటల్లోగా వెళ్లిపోవాలి

భారత్‌లోని పాక్ హైకమిషన్‌లో సలహాదారుల గుర్తింపు రద్దు

వారంతా వారంలోగా తమ దేశానికి వెళ్లిపోవాలని ఆదేశం

2 దేశాల్లోని హైకమిషన్ల సిబ్బంది 55 నుంచి 30కి కుదింపు

ఉగ్రదాడి నేపథ్యంలో ప్రధాని మోదీ నేతృత్వంలో సీసీఎస్ భేటీ

దాయాది దేశంతో సంబంధాలపై అత్యంత కఠిన నిర్ణయాలు

నేడు అఖిల పక్ష సమావేశం నిర్వహించాలని భేటీలో నిర్ణయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదులు పహల్గాంలో దాడి చేసి 26 మంది పర్యాటకుల ప్రాణాలను పొట్టనపెట్టుకోవడాన్ని తీవ్రంగా పరిగణించిన భారత ప్రభుత్వం.. ఆ దాడి వెనుక ఉన్న దాయాది దేశం (పాక్)తో సంబంధాలపై అత్యంత కఠిన నిర్ణయాలు తీసుకుంది. పాకిస్థాన్ దాహార్తిని తీర్చే సింధు జలాల ఒప్పందం రద్దు, వాఘా-అట్టారీ సరిహద్దు మూసివేత, పాక్ జాతీయులకు భారత్‌లోకి ప్రవేశాన్ని నిషేధించడం వంటివి అందులో ఉన్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ఆయన నివాసంలో బుధవారం సాయంత్రం సమావేశమైన 'భద్రతపై క్యాబినెట్ కమిటీ (సీసీఎస్)'.. ఉగ్రదాడిని తీవ్రపదజాలంతో ఖండించింది. ఈ దాడిలో మృతి చెందినవారి కుటుంబాలకు సానుభూతి తెలిపింది. గాయపడ్డవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. పహల్గాంలో పర్యటించి

మిగతా 12వ పేజీలో...

పహల్గాంలో ఘటనా స్థలాన్ని పరిశీలించిన షా

ఉగ్రదాడి మృతులకు నివాళులు

అనంతనాగ్ ఆస్పత్రిలో బాధితులకు పరామర్శ 12

ఉగ్రదాడి బాధ్యులను వదిలిపెట్టబోమని హెచ్చరిక

త్వరలోనే బదులిస్తాం

త్రివిధ దళాధిపతులతో భేటీ

అనంతరం రక్షణ మంత్రి రాజ్‌నాథ్

కశ్మీర్‌లో 80 మంది తెలంగాణ టూరిస్టులు

వెనక్కు రావడానికి యత్నం

ఆంక్షలతో ఇబ్బందులు 13

ఉగ్రదాడిలో ఇద్దరు ఏపీ వాసుల మృతి

కలలు కల్లలు


వినయ్ నర్వాల్‌కు కన్నీటి వీడ్కోలు పలుకుతున్న ఆయన భార్య

నిండు నూరేళ్ల జీవితాన్ని సంతోషంగా గడిపేందుకు కోటి ఆశలతో ఒక్కటైన రెండు జంటలు.. ఒకరికొకరు తోడుగా ప్రకృతి అందాలను వీక్షిస్తూ మైమరిచిపోయిన సమయంలో ఉగ్రవాదులు వారిని విడదీశారు. రెండు జంటల్లోని నవ వరుల తలకు తుపాకి గురిపెట్టి ప్రాణాలు తీశారు. మృతుల్లో ఒకరు నౌకాదళంలో లెఫ్టినెంట్‌గా పనిచేస్తున్న వినయ్ నర్వాల్ (26), మరొకరు వ్యాపారవేత్త శుభమ్ ద్వివేదీ (30).

చైనాపై సుంకాలు గణనీయంగా

తగ్గుతాయ్

కానీ సున్నాకు మాత్రం చేరవు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 13


తాజ్‌మహల్ ముందు పిల్లలతో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఉషా దంపతులు

భారత్‌కు ఎఫ్-35లు అందిస్తాం

వాటితో వాయుసేనకు అదనపు బలం

అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్

ప్రపంచ సుందరి పోటీలు వేదికగా..

పర్యాటక పెట్టుబడుల సదస్సు

మే 28న నిర్వహించనున్న సర్కారు

ఇప్పటికే పలు కంపెనీలకు ఆహ్వానాలు

వచ్చే ఐదేళ్లలో రూ.15 వేల కోట్ల పెట్టుబడులు లక్ష్యంగా అడుగులు

దిగ్గజ కంపెనీల హోటళ్లు, రిసార్టుల్లో తెలంగాణ వారికి 25 శాతం చొప్పున రాయితీ! 3

మే 22 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ 14

జూన్ 3 నుంచి 6 వరకు ప్రాక్టికల్స్

షెడ్యూల్ ప్రకటించిన ఇంటర్ బోర్డు



మేడిగడ్డ పునరుద్ధరణ ఎప్పుడు?

బ్యారేజీ కుంగి 18 నెలలు

కేంద్ర జలవనరుల సంఘం వద్ద నివేదిక

అది జలశక్తి శాఖకు చేరేదెప్పుడు?

నివేదిక సత్వరం ఇవ్వాలని పలుమార్లు కోరిన రాష్ట్ర సర్కారు

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ వ్యవహారం కొలిక్కి రాలేదు. 2023 అక్టోబరు 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాకు కుంగింది. దాదాపు 18 నెలలు పూర్తవుతున్నా, బ్యారేజీ మరమ్మతులు/పునరుద్ధరణ అంతుచిక్కని అంశంగా మారింది. సుందిళ్ల, అన్నారం బ్యారేజీల్లోనూ భారీగా సీపేజీలు బయటపడ్డాయి. ఈ రెండు బ్యారేజీలకు తాత్కాలికంగా మరమ్మతులు చేసినప్పటికీ నీటి నిల్వకు అవకాశం లేకుండా పోయింది. ఈ బ్యారేజీల్లో నీటి నిల్వ శ్రేయస్కరం కాదని జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ

మిగతా 2వ పేజీలో...

వడదెబ్బకు 11 మంది

మృత్యువాత

తెలంగాణలో భానుడి ఉగ్రరూపం

నిర్మల్ జిల్లా కుభీర్‌లో 45.2 డిగ్రీలు

ఈ సీజన్‌లో ఇదే అత్యధికం..

ములుగు జిల్లాలో వర్ష బీభత్సం

నేడు, రేపు వడగాలులు, వానలు!

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

భానుడి భగభగలతో రాష్ట్రం నిప్పుల కుంపటిలా మారింది. రోజురోజుకు ఎండల తీవ్రత అధికమవుతోంది. వడదెబ్బకు జనం పిట్టల్లా రాలిపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 24 గంటల వ్యవధిలో ఏకంగా 11 మంది ప్రాణాలు కోల్పోయారు. అందులో ముగ్గురు ఖమ్మం జిల్లాకు చెందిన వారున్నారు. బుధవారం నిర్మల్ జిల్లాలోని కుభీర్‌లో అత్యధికంగా 45.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో ఇదే అత్యధికం.. అదే జిల్లా దస్తూరాబాద్, పెంబి, నర్సాపూర్(జి), కడెం, మంచిర్యాల జిల్లా కోటపల్లి, భీమినిలో 45 డిగ్రీల చొప్పున రికార్డయింది. దీంతో

మిగతా 14వ పేజీలో...


శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు

16 నెలల్లో.. ₹2,44,962 కోట్లు

రాష్ట్ర ప్రభుత్వం సాధించిన పెట్టుబడులివి

ఈ ఒప్పందాలతో 80,500 ఉద్యోగాలు

తాజాగా సీఎం రేవంత్ జపాన్ పర్యటనలో 12,600 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు

జపాన్ నుంచి హైదరాబాద్ చేరుకున్న సీఎం

హైదరాబాద్/శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 16 నెలల్లో దాదాపు రూ.2,44,962 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఈ మేరకు వివిధ దేశాలకు చెందిన కంపెనీలు

మిగతా 2వ పేజీలో...

పీఎస్ఆర్‌కు రిమాండ్


విజయవాడలోని సీఐడీ రీజినల్ ఆఫీసు వద్ద పీఎస్సార్ ఆంజనేయులు

విజయవాడ జైలుకు తరలింపు

కోర్టులో హోరాహోరీగా సాగిన వాదనలు

జత్వానీ కేసులో ఆయన సూత్రధారి

విచారణకు సహకరించలేదు: ప్రాసిక్యూషన్

ఇతర నిందితులకు హైకోర్టు బెయిలిచ్చింది

అరెస్టు అసంబద్ధం: పీఎస్ఆర్ లాయరు

మీరంతా దొంగలంటూ పీఎస్ఆర్ రుసరుస

విచారణాధికారికి ఎదురు ప్రశ్నలు

మే 7 వరకు రిమాండ్ విధించిన కోర్టు

విజయవాడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు కటకటాలపాలయ్యారు. ముంబై నటి కాదంబరి జత్వాని కేసులో ఆయనకు న్యాయస్థానం రిమాండ్ విధించింది. ఈ కేసులో పీఎస్ఆర్‌ను సీఐడీ అధికారులు హైదరాబాద్‌లో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆయనను విజయవాడ సీఐడీ ప్రాంతీయ కార్యాలయం నుంచి వైద్య పరీక్షల నిమిత్తం బుధవారం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మూడో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. ప్రాసిక్యూషన్, డిఫెన్స్ న్యాయవాదుల వాదనలను విన్న తర్వాత పీఎస్ఆర్‌కు న్యాయాధికారి పి.తిరుమలరావు మే ఏడో తేదీ వరకు రిమాండ్ విధించారు. అనంతరం విజయవాడలోని జిల్లా జైలుకు తరలించారు. పీఎస్ఆర్‌ను 24 గంటల్లోపు కోర్టులో హాజరుపరచాల్సి ఉన్నందున

మిగతా 3వ పేజీలో...


పోలింగ్ సందర్భంగా జీహెచ్ఎంసీ ఆఫీసులో ఓటు వేయడానికి వచ్చిన ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కరచాలనం 14

ముగిసిన 'హైదరాబాద్' ఎమ్మెల్సీ ఎన్నికలు..

78 శాతం పోలింగ్

112 మందికి గాను ఓటేసిన 88 మంది.. రేపు ఓట్ల లెక్కింపు

ఓటింగ్‌లో పాల్గొనని బీఆర్ఎస్.. బరిలో బీజేపీ, మజ్లిస్ అభ్యర్థులు

25, 26 తేదీల్లో

'భారత్ సదస్సు'

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహణ

100కు పైగా దేశాల నుంచి ప్రతినిధులు

రాహుల్‌గాంధీ, ఖర్గే కీలకోపన్యాసం

రేపు హైదరాబాద్ డిక్లరేషన్ ఆవిష్కరణ

రాష్ట్రంలో పెట్టుబడులపై వివరిస్తాం: భట్టి

సదస్సు ఏర్పాట్లపై నేడు సీఎం సమీక్ష

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 తేదీల్లో అంతర్జాతీయ స్థాయి 'భారత్ సదస్సు-2025' జరగనుంది. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్(హెచ్ఐసీసీ)లోని నోవాటెల్ హోటల్‌లో ఈ సదస్సును నిర్వహించనున్నారు. దీనికి 100కు పైగా దేశాల నుంచి 450కు పైగా ప్రతినిధులు హాజరుకానున్నారు. 100 వరకు ప్రగతిశీల రాజకీయ పార్టీలు, 40-50 మంది వరకు మంత్రులు, మరో 50 మంది వరకు ఎంపీలు, సెనేటర్లు రానున్నారు. రాజకీయ పార్టీలకు చెందిన అంతర్జాతీయ ప్రముఖులు, నిపుణులు

మిగతా 2వ పేజీలో...

జగ్గారెడ్డి కుమార్తె నిశ్చితార్థ వేడుకలో సీఎం

- సంగారెడ్డిలో కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు దామోదర, కోమటిరెడ్డి, సురేఖ, ఉత్తమ్ కూడా..
- అతిథులకు జగ్గారెడ్డి దంపతుల ఆత్మీయ స్వాగతం

సంగారెడ్డి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కుమార్తె జయారెడ్డి, గుణచైతన్యరెడ్డిల వివాహ నిశ్చితార్థ వేడుక బుధవారం సంగారెడ్డిలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. జపాన్ పర్యటన ముగించుకొని బుధవారం రాత్రి హైదరాబాద్ వచ్చిన ఆయన, నేరుగా సంగారెడ్డిలోని రామ్‌నగర్ బస్తీకి వచ్చారు. రామ్‌మందిర్‌లో పూజలు చేసిన అనంతరం కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. నిశ్చితార్థ వేడుకకు స్పీకర్ గడ్డం ప్రసాద్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ సురేశ్‌శెట్కార్, రాహుల్ గాంధీ వ్యక్తిగత కార్యదర్శి జేజు, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథ్, కాంగ్రెస్ సీనియర్ నేతలు వీహెచ్, కుసుమకుమార్, సంపత్‌కుమార్, వంశీచంద్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. తమ కూతురు నిశ్చితార్థ వేడుకకు వచ్చిన అతిథులకు జగ్గారెడ్డి, ఆయన సతీమణి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల స్వయంగా స్వాగతం పలికారు.



జగ్గారెడ్డి కూతురు జయారెడ్డి నిశ్చితార్థ వేడుకకు హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

లోకం తీరు



హైడ్రాకు కొత్త లోగో!

- హెచ్ ఆకారం.. పైన నీటి చుక్కతో డిజైన్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)కి కొత్త లోగో వచ్చింది. చెరువులు, కుంటలు, నాలాల పరిరక్షణ, వాటి పునరుద్ధరణ, విపత్తుల నిర్వహణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ లక్ష్యంగా పని చేస్తున్న సంస్థ.. దాన్ని ప్రతిబింబించేలా నూతన లోగోను రూపొందించింది. హైదరాబాద్ నగరాన్ని సూచిస్తూ హెచ్ ఆకారం, అందులో ఆంగ్ల అక్షరాల్లో హైడ్రా.. పైన నీటి చుక్కతో లోగో డిజైన్ చేశారు. అంతకుముందు జీహెచ్‌ఎంసీలో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ డిజాస్టర్ మెనేజ్‌మెంట్ (ఈవీడీఎం)గా ఉన్న విభాగాన్ని ప్రత్యేక సంస్థ హైడ్రాగా ఏర్పాటు చేస్తూ 2024 జూలై 19న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్‌లను జీహెచ్‌ఎంసీ పరిధిలోకి తీసుకొచ్చారు. ఈవీడీఎం.. దాని విధులను ప్రతిబింబించేలా పాత లోగో ఉండడంతో.. నూతనంగా ఏర్పడిన హైడ్రా విధులు, లక్ష్యాలకు అనుగుణంగా కొత్త లోగోను రూపొందించినట్టు సంస్థ వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వ ఆమోదంతోనే నూతన లోగోను ఎంపిక చేసినట్టు తెలిసింది.

నాపై బీజేపీ పెట్టిన కేసు కొట్టేయండి

- హైకోర్టులో సీఎం రేవంత్‌రెడ్డి క్వాష్ పిటిషన్

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీజేపీ ప్రతిష్ఠలకు భంగం కలిగేలా తాను వ్యాఖ్యలు చేసినట్లు నాంపల్లి కోర్టులో నమోదై విచారణలో ఉన్న ప్రైవేట్ కేసును కొట్టేయాలని పేర్కొంటూ సీఎం రేవంత్‌రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. 2024 మే 5న కొత్తగూడెంలో నిర్వహించిన జన జాతర సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు తొలగిస్తుందని తప్పుడు ఆరోపణలు చేశారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో ప్రైవేట్ ఫిర్యాదు చేశారు. రేవంత్‌రెడ్డి బీజేపీ నేత అమిత్ షా మార్ఫింగ్ వీడియోను ప్రచారం చేశారని.. రిజర్వేషన్లు తొలగిస్తామని స్వయంగా అమిత్ షా చెప్పినట్లు తప్పుడు ఆరోపణలు చేశారని.. తద్వారా బీజేపీ పరువు, ప్రతిష్ఠలకు భంగం కలిగించడంతోపాటు ఎన్నికల కోడ్‌కు వ్యతిరేకంగా వ్యవహరించారని ఫిర్యాదులో ఆరోపించారు. ఈ ప్రైవేటు ఫిర్యాదును విచారణకు స్వీకరించిన దిగువ కోర్టు.. వాంగ్మూలాలను నమోదు చేస్తోంది. కాగా, ఈ కేసును కొట్టేయాలని.. హైకోర్టులో తాను దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌లో తుది తీర్పు వెలువడే వరకు దిగువ కోర్టు ఎదుట హాజరు నుంచి మినహాయింపు ఇవ్వడం సహా అన్ని ప్రొసీడింగ్స్‌పై స్టే ఇవ్వాలని రేవంత్‌రెడ్డి కోరారు.

రాష్ట్రంలో పంటల బీమా పథకం!

- ఏయే పంటలకు వర్తింపజేయాలో ప్రతిపాదనలు రూపొందించండి
- అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం



రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. వానాకాలం, యాసంగి సీజన్లలో ఏయే పంటలకు బీమా వర్తింపజేయాలనే అంశంపై అధికారులు ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. సచివాలయంలో బుధవారం వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. వానాకాలంలో రైతులు సుమారు 128 లక్షల ఎకరాల్లో పంటలు వేస్తారని, ప్రకృతి విపత్తులతో నష్టం కలిగే సంభావ్యత ఆధారంగా రాష్ట్రాన్ని 11 క్లస్టర్లుగా విభజించినట్టు ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారులు మంత్రికి తెలిపారు. దిగుబడి ఆధారిత బీమా పథకంలో వరి, మొక్కజొన్న, కంది, మినుము, సోయాబీన్, వేరుశనగ, శనగ, నువ్వులు తదితర పంటలు.. వాతావరణ ఆధారిత బీమా పథకంలో పత్తి, మిరప, మావిడి, పామాయిల్, టమాట, బత్తాయి పంటలకు బీమా వర్తింపజేసే అవకాశం ఉన్న నేపథ్యంలో... రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పథకానికి రూపకల్పన చేయాలని తుమ్మల ఆదేశించారు.

మజ్దూర్లకు జనరల్ అసిస్టెంట్లుగా గుర్తింపు

సింగరేణి భవన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో క్యాటగిరి - 1 లో పనిచేస్తున్న జనరల్ మజ్దూర్లకు జనరల్ అసిస్టెంట్లుగా గుర్తింపు వచ్చింది. ఈ మేరకు బుధవారం సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన జాతీయస్థాయి వేజ్ బోర్డు ఒప్పందంలో భాగంగా ఈ పేరు మార్పునకు సంబంధించి తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే అమలు చేయాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరాం ఆదేశించడంతో సంబంధిత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సింగరేణిలో పనిచేస్తున్న 14 వేల మంది జనరల్ మజ్దూర్లతో పాటు కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మజ్దూర్ అంటే హిందీలో కార్మికుడు, కూలి అని అర్థం. వీరి వృత్తికి సముచిత గౌరవం ఇవ్వాలన్న ఉద్దేశంతో జనరల్ మజ్దూర్ అనే పేరును తొలగించి జనరల్ అసిస్టెంట్‌గా పేరు మార్పు చేశారు.

కొడుకును చూపిస్తామని తీసుకెళ్లి... విజయవాడలో వృద్ధురాలి హత్య

- మెదక్ జిల్లాలో ఇద్దరిని అరెస్టు చేసిన ఏపీ పోలీసులు

మెదక్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా హవేళీఘనాపూర్ మండలం గంగాపూర్‌కు చెందిన ఓ వృద్ధురాలి హత్య కేసులో అదే గ్రామానికి చెందిన ఇద్దరిని ఏపీలోని విజయవాడ పోలీసులు బుధవారం అరెస్టు చేసి తీసుకెళ్లారు. అరెస్టయిన వారిలో ఓ మహిళ, యువకుడు ఉన్నారు. గంగాపూర్‌కు చెందిన మహేశ్(35) దాదాపు 25 రోజులుగా కనిపించడం లేదు. మహేశ్ అదృశ్యంపై అతని భార్య శశికళ.. హవేళీఘనపురం పోలీసులకు ఫిర్యాదు కూడా చేసింది. అయితే, మహేశ్ తల్లి పోచమ్మ కొడుకు ఆచూకీ కోసం ఆందోళనలో ఉంది. విజయవాడలో ఓ వృద్ధురాలి మృతదేహాన్ని గుర్తించిన అక్కడి పోలీసులు పోచమ్మగా నిర్ధారించారు. సీసీ కెమెరాల ఫుటేజీలు, సెల్‌ఫోన్ నెట్‌వర్క్ ఆధారంగా గంగాపూర్‌కు చెందిన ఓ మహిళ, మరో యువకుడిని ఈ కేసులో అనుమానితులుగా గుర్తించారు. వారిద్దరూ పోచమ్మతో కలిసి విజయవాడలోని పలు వీధుల్లో తిరగడం సీసీ కెమెరాల్లో రికార్డయింది. నగల కోసమే పోచమ్మను హత్య చేసి ఉంటారని భావిస్తున్న పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కొడుకు మహేశ్ ఆచూకీ చూపిస్తామంటూ తీసుకెళ్లి నిందితులు పోచమ్మను హత్య చేసినట్టు భావిస్తున్నారు. కాగా, పోచమ్మ కొడుకు మహేశ్‌ను తామే హత్య చేసినట్టు నిందితులు పోలీసుల ఎదుట అంగీకరించనట్టు తెలిసింది.

పార్టీ నిర్మాణంలో సామాజిక న్యాయం

తద్వారా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుద్దాం..

- బీజేపీ, ఆరెస్సెస్‌లా సిద్ధాంతానికి ప్రాధాన్యం ఇవ్వాలి
- కాంగ్రెస్‌తో నిమ్న వర్గాలకు న్యాయం: మీనాక్షీ నటరాజన్
- గాంధీభవన్‌లో పీసీసీ పరిశీలకులు, డీసీసీ అధ్యక్షులతో భేటీ



గాంధీభవన్‌లో మాట్లాడుతున్న మీనాక్షీ నటరాజన్, చిత్రంలో మహేశ్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): క్షేత్ర స్థాయి నుంచీ పార్టీ నిర్మాణంలో సామాజిక న్యాయం పాటించడం ద్వారా ఇతర రాష్ట్రాలకూ ఆదర్శంగా నిలుద్దామని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ అన్నారు. సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణే.. కాంగ్రెస్ సిద్ధాంతమని, దీన్నే ఆయుధంగా మార్చుకోవాలని అభిప్రాయపడ్డారు. గ్రామ, మండల, బ్లాకు కమిటీల కూర్పు కోసం నియమితులైన 70 మంది పరిశీలకులు, సహ పరిశీలకులతోపాటు డీసీసీ అధ్యక్షులతో బుధవారం గాంధీ భవన్‌లో మీనాక్షీ నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మీనాక్షీ నటరాజన్ మాట్లాడుతూ రాష్ట్రంలో చేపట్టిన కులగణను కాంగ్రెస్ పార్టీ నమూనాగా దేశానికి చూపుతున్నామని చెప్పారు. గ్రామ స్థాయి నుంచి కమిటీల నిర్మాణంలో సామాజిక న్యాయాన్ని అమలు చేయాలని.. అహ్మదాబాద్ సీడబ్ల్యూసీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేశారు. ఈ నిర్ణయాన్ని తెలంగాణలోనే మొదటగా అమలు చేసి ఆదర్శంగా నిలుద్దామన్నారు. బీజేపీ, ఆరెస్సెస్ సిద్ధాంతాలు ఉన్నత వర్గాలకు ప్రయోజనాన్ని కలిగించేవైతే.. కాంగ్రెస్ సిద్ధాంతం నిమ్న వర్గాలకు న్యాయం చేస్తుందన్నారు. అయితే, ఈ విషయాన్ని ఆయా వర్గాలకు అర్థమయ్యేట్లు చెప్పలేకపోతున్నామన్నారు. గ్రామ స్థాయి నుంచే కమిటీ నిర్మాణంలో సామాజిక న్యాయాన్ని అమలు చేసి.. ఆయా వర్గాల అభిమానం చూరగొనాలన్నది రాహుల్ ఉద్దేశమన్నారు. బీజేపీ, ఆరెస్సెస్ మాదిరిగానే కాంగ్రెస్ సైతం సిద్ధాంతానికి ప్రాధాన్యం ఇచ్చి ప్రజల్లోకి వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సిద్ధాంత పోరాటానికి పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పదవుల దగ్గరి నుంచి వనరుల వరకు అన్ని వర్గాల వారికీ భాగస్వామ్యం కల్పించినప్పుడే పార్టీ, ప్రభుత్వం బలంగా నిలబడతాయన్నారు. పార్టీ, ప్రభుత్వ పదవుల్లో సీనియర్లకు ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పీసీసీ పరిశీలకులు ఏయే అంశాలపై సమీక్షలు నిర్వహించాలన్నది వివరించారు. కాగా, సమావేశానికి నలుగురైదుగురు పరిశీలకులు హాజరు కాకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత కీలక సమావేశానికి రాలేనంత కారణాలు ఏం ఉంటాయని ప్రశ్నించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ ప్రక్షాళనలో పీసీసీ పరిశీలకుల బాధ్యత అత్యంత కీలకమైందన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే స్థానిక ఎన్నికలు జరగబోతున్నాయని, వేలాది మంది కార్యకర్తలకు పదవులు దక్కే అవకాశం ఉందన్నారు. కాగా, టీపీసీసీ కార్యవర్గం, డీసీసీ అధ్యక్షుల పేర్లు ఇవేనంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం.. నిజం కాదని మహేశ్‌గౌడ్ ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. అనంతరం కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ నేతలతో మీనాక్షి సమావేశమయ్యారు. అక్కడ పార్టీ ఓటమి గల కారణాలేంటి? అనే వివరాలను నేతలను అడిగి తెలుసుకున్నారు.

మీనాక్షితో ఎమ్మెల్యే రాజ్‌గోపాల్‌రెడ్డి భేటీ

స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని మీనాక్షి నటరాజన్ సూచించినట్లు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి తెలిపారు. గతంలో ఎంపీగా ఆమెతో కలిసి పని చేశానని, పార్టీ ఇన్‌చార్జిగా నియమితులైన అనంతరం ఆమెను మొదటిసారి కలిసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా ఇన్‌చార్జిలు, పార్టీ నిర్మాణంపై చర్చించినట్టు వివరించారు. మంత్రి వర్గంలో చోటు ఆశిస్తున్న రాజ్‌గోపాల్ రెడ్డి.. పార్టీ ఇన్‌చార్జిను కలవడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు.. పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యం కల్పించడం ద్వారా నియోజకవర్గ స్థాయి ప్రణాళిక, అభివృద్ధి పనుల్లో వారు క్రియాశీలంగా పాల్గొనేందుకు అవకాశం ఏర్పడుతుందని కాంగ్రెస్ ఎంపీలు మల్లురవి, సురేశ్‌షెట్కార్, రఘురామిరెడ్డి, కావ్య, అనిల్‌కుమార్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు వారు మీనాక్షికి వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల హామీలను అమలు చేస్తుండడంతో కాంగ్రెస్ పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని వివరించారు.



శంషాబాద్‌లో సీఎంకు స్వాగతం పలుకుతున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు

16 నెలల్లో రూ.2,44,962 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాయి. ఆ ఒప్పందాలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా కలిపి సుమారు 80,500 ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి రానున్నాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. రాష్ట్రంలో ఉన్న అవకాశాలు, పారిశ్రామిక అనుకూల పరిస్థితులపై సీఎం రేవంత్ దిగ్గజ కంపెనీలకు వివరిస్తున్నారు. గత ఏడాది జనవరిలో స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో రాష్ట్ర ప్రభుత్వం రూ.40 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించగా.. ఈ ఏడాది దావోస్ సదస్సులో గతంకంటే మూడు రెట్లు అధికంగా రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయి. తద్వారా 50 వేల ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. అమెరికా, దక్షిణ కొరియా, సింగపూర్ పర్యటనల్లో భాగంగా రూ.14,900 కోట్ల మేర పెట్టుబడులను సాధించారు. తాజాగా జపాన్ పర్యటనలో రూ.12,600 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకోగా 30,500 ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కాగా, సీఎం రేవంత్ జపాన్ పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకుని బుధవారం రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, వీర్లపల్లి శంకర్, టీ రామ్మోహన్‌రెడ్డి తదితరులు సీఎంకు స్వాగతం పలికారు.

25, 26 తేదీల్లో 'భారత్ సదస్సు'

(మొదటిపేజీ తరువాయి)

సదస్సులో పాల్గొననున్నారు. సదస్సులో అంతర్జాతీయ న్యాయం, సమానత్వం, ప్రగతిశీల సహకారం వంటి అంశాలపై ఉన్నత స్థాయి ద్వైపాక్షిక, సైద్ధాంతిక చర్చలు జరుగుతాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు ప్యానెల్ డిస్కషన్స్ ఉంటాయి. 25వ తేదీన 'హైదరాబాద్ డిక్లరేషన్'ను ఆవిష్కరించనున్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కీలకోపన్యాసం చేయనున్నారు. ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా ప్రసంగిస్తారు. అర్జెంటినా విదేశాంగ మాజీ మంత్రి జోర్జ్ టయానా, కొలంబియా కార్మిక శాఖ మాజీ మంత్రి, సెనెటర్ క్లారా లోపెజ్ ఓబ్రెగాన్, స్వీడన్ విదేశాంగ మాజీ మంత్రి అన్ లిండె, క్యూబా కమ్యూనిస్టు పార్టీ అంతర్జాతీయ వ్యవహారాల హెడ్ ఎమిలియో లొజాడా, మలేషియా న్యాయ శాఖ మంత్రి ఎం.కులసేగరన్‌లతో పాటు దేశంలోని ప్రముఖ రాజకీయ పార్టీ నాయకులు దిగ్విజయ్ సింగ్, పవన్ ఖేరా, సుప్రియా శ్రీనాటె, సల్మాన్ ఖుర్షీద్, జ్యోతిమణి తదితరులు సదస్సుకు హాజరు కానున్నారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించి 140 సంవత్సరాలు కావడం, అలీన ఉద్యమానికి బీజాలు వేసిన బాండుంగ్ సదస్సు 70వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ రెండు రోజుల భారత్ సదస్సును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించబోతోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. తమ నాయకుడు రాహుల్‌గాంధీ స్వప్నమైన 'న్యాయ్'ను ప్రతిబింబించేలా ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలపై చర్చలు ఉంటాయని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి నిర్దేశించిన 'తెలంగాణ రైజింగ్'పై కూడా చర్చిస్తామని పేర్కొన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టడంపై అంతర్జాతీయ ఇన్వెస్టర్లు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వివరిస్తామని తెలిపారు. కాగా.. సదస్సు ఏర్పాట్లపై గురువారం పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి.. మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్షించనున్నారు.

నీటిపారుదల శాఖ ఈఎన్‌సీగా అనిల్ కుమార్

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖలో కొంతకాలంగా ఖాళీగా ఉన్న ఇంజనీర్-ఇన్-చీఫ్ (ఈఎన్‌సీ) పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. ఈఎన్‌సీ(అడ్మిన్)గా ఉంటూ ఈఎన్‌సీ(జనరల్)గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న గుమ్మడి అనిల్ కుమార్‌ను ఈఎన్‌సీ(జనరల్)గా పూర్తి స్థాయిలో నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అలాగే, చీఫ్ ఇంజనీర్(ఎంక్వయిరీస్)గా పని చేస్తున్న మహ్మద్ అంజద్ హుస్సేన్‌కు ఈఎన్‌సీ(అడ్మిన్)గా, ఆదిలాబాద్ చీఫ్ ఇంజనీర్(సీఈ) టి.శ్రీనివాస్‌కు ఈఎన్‌సీ(ఓఅండ్‌ఎం, క్వాలిటీ కంట్రోల్)గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. వీరి నియామకాలకు సంబంధించిన ఫైలుపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బుధవారం సంతకం చేశారు. ఆ వెంటనే నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్‌బొజ్జా నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

మేడిగడ్డ పునరుద్ధరణ ఎప్పుడు?

(మొదటిపేజీ తరువాయి)




హెచ్చరించింది. దాంతో ఈ బ్యారేజీల పునరుద్ధరణ, మరమ్మతులు చేపట్టడానికి వీలుగా వాటి నిర్మాణం, లోపాలపై అధ్యయనం చేయాలని కోరుతూ 2024 ఫిబ్రవరి 13వ తేదీన జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) చైర్మన్‌కు తెలంగాణ నీటి పారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా లేఖ రాయగా 2024 మార్చి 2న కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ జె.చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో ఆరుగురితో ప్రభుత్వం కమిటీ వేసింది. ఇది జరిగి ఏడాది పూర్తవుతోంది.. గత ఫిబ్రవరి మొదటివారంలో ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ తన నివేదికను కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీకి అందించారు. ఆ నివేదిక ప్రస్తుతం కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ ముకేశ్ కుమార్ సిన్హా వద్దకు చేరింది. నివేదిక సరిగ్గా లేదని గుర్తించిన ఆయన.. పలు సూచనలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఆయన సూచనలు చేశాక మళ్లీ నివేదిక జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ)కు చేరితే... ఆ తర్వాతే తెలంగాణకు అందనుంది. నివేదిక సత్వరం ఇవ్వాలంటూ ఇప్పటికే పలుమార్లు తెలంగాణ సర్కారు కోరింది. మరోవైపు గోదావరికి ఏటా జూలైలోనే వరదలు ప్రారంభమవుతాయి. ఈ ఏడాదికి మేడిగడ్డపై పూర్తిగా ఆశలు వదులుకున్నట్లేనని తెలుస్తోంది. మేడిగడ్డ బ్యారేజీ మొత్తం 8 బ్లాకులుగా కట్టగా ఒక్కో బ్లాకులో 10-11 దాకా పియర్లు ఉన్నాయి. బ్యారేజీకి మొత్తం 85పియర్లు ఉండగా ఏ ఒక్క పియర్‌లో సమస్యలు తలెత్తినా, ఆ బ్లాకులోని మొత్తం పియర్లను తొలగించాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. సుందిళ్ల బ్యారేజీలపై ఏ నిర్ణయం తీసుకోవాలన్నా ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ నివేదికను ప్రామాణికంగా చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నివేదిక రావడానికి మరో రెండు వారాల దాకా సమయం పట్టే అవకాశం ఉంది. ఆ తర్వాత పనులు చేపట్టినా... ఈ సీజన్‌కు మేడిగడ్డను అందుబాటులోకి తెచ్చే అవకాశాలుండవు. మేడిగడ్డను పునరుద్ధరించడం లేదా... మేడిగడ్డ ఎగువన రబ్బర్‌డ్యామ్ లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తేనే కన్నెపల్లి (మేడిగడ్డ) పంప్‌హౌస్ నుంచి నీటిని పంపింగ్ చేసి, అన్నారంలోకి, ఆ తర్వాత సిరిపురం (అన్నారం) పంప్‌హౌస్ నుంచి సుందిళ్ల బ్యారేజీలోకి నీటిని పంపింగ్ చేయాల్సి ఉంటుంది. దాంతో ఏడాదిన్నర కిందటే కన్నెపల్లి ఎగువన రబ్బర్ డ్యామ్ కట్టాలనే ప్రతిపాదన వచ్చింది. దీనికి సంబంధించిన డిజైన్లు/డ్రాయింగ్‌లు ఇవ్వాలని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో)కు లేఖ రాయగా తొలుత ఎన్‌డీఎస్‌ఏ నుంచి అనుమతి తీసుకోవాలని ఆ విభాగం మెలిక పెట్టింది.

నెలాఖరున తేలనున్న నివేదిక

ఈనెల 30వ తేదీన జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) చైర్మన్ అనిల్‌జైన్ హైదరాబాద్‌కు రానున్నారు. ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్‌ను కలిసి, కాళేశ్వరం బ్యారేజీలపై నివేదిక అందించాలని కోరనున్నట్లు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. దాంతో నెలాఖరున భేటీ తర్వాతే నివేదికపై స్పష్టత రానుంది. ప్రస్తుతం సీడబ్ల్యూసీ చైర్మన్ వద్ద నివేదిక ఉంది. మరోవైపు కాళేశ్వరం బ్యారేజీలపై ఇప్పటికే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం విచారణ పూర్తిచేసి, నివేదికను ప్రభుత్వానికి, కాళేశ్వరం విచారణ కమిషన్‌కు అందించింది. కాళేశ్వరం విచారణ కమిషన్ కూడా మే నెల రెండో వారంలో నివేదిక సమర్పించే అవకాశం ఉంది. ఆ నివేదికలో కూడా కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ/మరమ్మతులపై ప్రభుత్వానికి తగిన సూచనలు అందించాలని జస్టిస్ పీసీ ఘోష్ ఇదివరకే స్పష్టం చేశారు.

యూజీసీ మార్గదర్శకాలపై తక్షణమే స్టే ఇవ్వలేం

- మా తుది తీర్పునకు లోబడే డీమ్డ్ యూనివర్సిటీ హోదా
- హోదా ఇచ్చే ముందే కొత్త డీమ్డ్ వర్సిటీలకు యూజీసీ ఈ విషయం చెప్పాలి: హైకోర్టు
- దుకాణాలు, షెడ్లలో కాలేజీలు పెట్టి.. డీమ్డ్ హోదా అడుగుతున్నారు
- కోర్టులో రాష్ట్ర ప్రభుత్వ వాదనలు
- విచారణ జులై 30కి వాయిదా



హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): డీమ్డ్ యూనివర్సిటీలకు సంబంధించి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కొత్త మార్గదర్శకాలపై తక్షణమే స్టే ఇవ్వలేమని హైకోర్టు పేర్కొంది. అయితే ఈ మార్గదర్శకాల మేరకు ఇప్పటికే అనుమతి పొందిన, భవిష్యత్తులో అనుమతి ఇచ్చే కాలేజీలకు.. డీమ్డ్ హోదా అనేది తాము ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటుందని స్పష్టం చేసింది. కొత్తగా డీమ్డ్ యూనివర్సిటీ హోదా ఇచ్చే ముందే ఈ విషయాన్ని ఆయా కాలేజీలకు యూజీసీ స్పష్టంగా చెప్పాలని ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది.

ఆ నిబంధనలు రాజ్యాంగ వ్యతిరేకమంటూ..

ప్రైవేటు కాలేజీలకు డీమ్డ్ యూనివర్సిటీలుగా అనుమతి ఇచ్చేందుకు ఉద్దేశించిన పలు నిబంధనల్లో యూజీసీ ఏడాదిన్నర క్రితం పలు మార్పులు చేసింది. ఈ మేరకు మార్గదర్శకాలు (ఇనిస్టిట్యూషన్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీస్ రెగ్యులేషన్స్-2013) జారీ చేసింది. అయితే ఇందులోని 2 (15), 6, 7, 8, 29, 30 నిబంధనలు రాజ్యాంగ వ్యతిరేకమని, వాటిని కొట్టివేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 11న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను దెబ్బకొట్టేలా, రాష్ట్ర ప్రభుత్వ పాత్ర లేకుండా చేసేలా నూతన మార్గదర్శకాలు ఉన్నాయని పేర్కొన్నారు. 60 రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ అనుమతి రాకపోతే.. అనుమతి వచ్చినట్లే భావించాలనడం అక్రమమని స్పష్టం చేశారు. రాజ్యాంగం ప్రకారం 'విద్య' అనేది రాష్ట్ర జాబితాలోని అంశమని, ఇలా మార్గదర్శకాలు జారీ చేసే అర్హత యూజీసీకి లేదని పేర్కొన్నారు. చిన్న చిన్న దుకాణాలు, షెడ్లలో కాలేజీలు పెట్టి డీమ్డ్ హోదా కోసం ప్రయత్నిస్తున్నారని కోర్టుకు వివరించారు. ఇప్పటికే డీమ్డ్ హోదా పొందిన ఓ విద్యాసంస్థ న్యాక్ ఉత్తమ ర్యాంకు కోసం మోసానికి పాల్పడటంపై సీబీఐ విచారణ ఎదుర్కొంటోందని గుర్తుచేశారు. అలాంటి డీమ్డ్ యూనివర్సిటీలు భవిష్యత్తులో మూతపడితే విద్యార్థుల భవిష్యత్తుకు ఎవరు జవాబుదారీ అని ప్రశ్నించారు. యూజీసీ మార్గదర్శకాలపై స్టే ఇవ్వాలని కోరారు. ఇక కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ నర్సింహశర్మ వాదిస్తూ.. యూజీసీ కొత్త మార్గదర్శకాలకు చట్టబద్ధమైన హోదా ఉందని పేర్కొన్నారు. అవి న్యాయ విరుద్ధమని తుది తీర్పు ద్వారా ప్రకటిస్తే తప్ప అమలును అడ్డుకోలేమని వివరించారు. వాదనలు విన్న ధర్మాసనం.. తక్షణమే స్టే ఇవ్వడానికి నిరాకరించింది. తదుపరి విచారణను జూలై 30కి వాయిదా వేసింది.

ఇద్దరు బంగ్లాదేశీయుల అరెస్టు

- నాలుగేళ్లపాటు కోల్‌కతాలో నివాసం
- వారిలో ఒకరికి మలక్‌పేట మహిళతో వివాహం.. 8 నెలల క్రితం హైదరాబాద్‌కు
- ఆటకట్టించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు


పోలీసులు అరెస్టు చేసిన ఇద్దరు బంగ్లాదేశీయులు

హైదరాబాద్ సిటీ/చాదర్‌ఘాట్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా దేశంలోని వేర్వేరు ప్రాంతా ల్లో అక్రమంగా ఉంటున్న ఇద్దరు బంగ్లాదేశీయులను హైదరాబాద్‌లో టాస్క్‌ఫోర్స్, మలక్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. వీరికి నకిలీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డుల జారీలో సహకరించిన మునిసిపల్ ఉద్యోగితోపాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంగ్లాదేశ్‌లోని ఢాకాకు చెందిన మహ్మద్ హసీబుల్ (25), రోమన్ సాహ(21) నాలుగేళ్ల క్రితం అక్రమ రవాణాదారులకు రూ. 25వేలు చెల్లించి గుట్టుగా బంగ్లాదేశ్ నుంచి పశ్చిమబెంగాల్‌కు అక్రమంగా వచ్చారు. కోల్‌కతాలోని సౌత్‌హరాలో ఉంటూ హసిబుల్ తన పేరును జోవన్ చౌదరిగా మార్చుకొని కరాటే శిక్షకుడిగా పని చేశాడు. మరో యువకుడు రోమన్ తన పేరును రహన్‌గా మార్చుకొని కూలీగా పని చేశాడు. ఈ క్రమంలో ఫేస్‌బుక్‌లో పరిచయమైన మలక్‌పేట మహిళతో ప్రేమాయణం సాగించిన హసీబుల్.. 8 నెలల క్రితం ఆమెను పెళ్లి చేసుకున్నాడు. ఆ వెంటనే హైదరాబాద్‌కు మకాం మార్చాడు. ఆన్‌లైన్ ఫుడ్ యాప్‌ల్లో డెలివరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. స్థానికంగా ఉండే పాన్‌షాప్ యజమాని మహ్మద్ ముఖీద్‌తో పరిచయం పెంచుకున్న హసీబుల్.. తనకు స్థానికత విషయంలో ఇబ్బంది రాకుండా నకిలీ పత్రాలు కావాలని కోరాడు. ముఖీద్ స్నేహితులైన చాదర్‌ఘాట్ నివాసి తేమురసాయి కిరణ్ (50), చంచల్‌గూడ నివాసి గడ్డమీది రజినీకాంత్ (46) ఓ ముఠాగా ఏర్పడ్డారు. నార్సింగి మున్సిపాలిటీలో శానిటేషన్ సెక్షన్ కంప్యూటర్ ఆపరేటర్ దుడ్డు సుధీర్‌కుమార్ (27) ద్వారా నకిలీ బర్త్ సర్టిఫికెట్ పొందారు. దాని ఆధారంగా నకిలీ ఆధార్‌కార్డు, నకిలీ ఓటర్ ఐడీకి దరఖాస్తు చేసుకున్నాడు. మరోవైపు కోల్‌కతాలో ఉన్న హబీబుల్ స్నేహితుడు రోమన్ సాహ కూడా గతనెలలో హైదరాబాద్‌కు వచ్చాడు. హబీబుల్‌తో పాటే మలక్‌పేటలో ఉంటున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి నకిలీ ఆధార్ కార్డులు, బంగ్లాదేశ్ పాస్‌పోర్టు జిరాక్స్, ఏడు సెల్‌ఫోన్లు, ల్యాప్ టాప్ స్వాధీనం చేసుకున్నారు. కాగా, నకిలీ సర్టిఫికెట్ జారీ చేసి అరెస్టయిన కంప్యూటర్ ఆపరేటర్ సుధీర్‌కుమార్ జారీ చేసిన సర్టిఫికెట్లన్నీ రద్దు చేస్తున్నట్లు నార్సింగ్ మునిసిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు.

చూడమని చెప్పానంతే!

వారితో నేను తప్పులు చేయించినట్లా?

- విచారణ సమయంలో పీఎస్ఆర్ తీరు
- 'మహానుభావా' అంటూ వ్యాఖ్యలు
- మీరంతా దొంగలు అంటూ రుసరుసలు

విజయవాడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): 'కుక్కల విద్యాసాగర్ అనే వ్యక్తి వచ్చి.. తనకు సహాయం చేయాలని అడిగాడు. ఆ కేసు ఏదో చూడాలని అప్పటి విజయవాడ నగర కమిషనర్ కాంతిరాణాకు చెప్పాను. వాళ్ల తప్పులు చేస్తే.. నేనే చేయించినట్లా?"... అని ముంబై నటి కాదంబరి జత్వానీ కేసులో అరెస్టయిన సీనియర్ ఐపీఎస్ అధికారి, ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్సార్ ఆంజనేయులు విచారణ అధికారులను దబాయించినట్లు తెలిసింది. అదే సమయంలో... ఈ కేసులో నిందితుడైన ఆయన తానే 'బాస్' అన్నట్లుగా ప్రవర్తించినట్లు సమాచారం. పీఎస్సార్‌ను మంగళవారం హైదరాబాద్‌లో అరెస్టు చేసిన అనంతరం... విజయవాడలోని సీఐడీ కార్యాలయంలో ఆయనను ప్రశ్నించారు. కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, విజయవాడ సీఐడీ ఆర్‌వో ప్రసాద్ కలిసి విచారణ జరిపారు. ఈ సందర్భంగా పీఎస్సార్ విచారణ అధికారులపై రుసరుసలాడుతూ, 'మహానుభావా' అని వ్యంగ్య వ్యాఖ్యలు చేస్తూ, పేరుతో పిలుస్తూ వింతగా వ్యవహరించినట్లు సమాచారం. విచారణ సమయంలో... 'తర్వాతి ప్రశ్న ఏమిటో త్వర గా అడుగు ప్రవీణ్' అని రెట్టించినట్లు తెలిసింది. విచారణలో ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా రిమాండ్ రిపోర్టును తయారు చేసి పీఎస్ఆర్ చేతిలో పెట్టినప్పుడు... చదువుకుని 'మీరంతా దొంగలు..' అని నిందిస్తూ సంతకం చేసినట్టు తెలిసింది. పీఎస్సార్‌ను అడిగిన ప్రశ్నలు, దానికి ఆయన ఇచ్చిన సమాధానాలు ఇవి...

జత్వాని కేసు విషయంలో కాంతిరాణా, విశాల్‌గున్నీపై ఎందుకు ఒత్తిడి చేశారు?

చూడు ప్రవీణ్ (డీఐజీ).... నీ దగ్గరికి ఎవరో ఒకరు వచ్చి సహాయం చేయమని అడిగితే ఏం చేస్తావు? సమస్యలో న్యాయం ఉంటే సహాయం చేయాలని ఏ పోలీస్ అధికారికో, ఎస్‌హెచ్‌వోకో ఫోన్ చేసి చెబుతావు. అంత మాత్రాన కింది స్థాయి అధికారులు చేసిన తప్పులు నువ్వు చేయించినట్టా? విద్యాసాగర్ నా దగ్గరికి వచ్చి ఒక మాటగా చెప్పమని అడిగారు. ఆ కేసు ఏవిఏటో చూడమని చెప్పాను. దానికి నేనెలా బాధ్యుడ్ని అవుతాను. మీరంతా దొంగలు.

కాంతిరాణా, విశాల్‌గున్నీని సీఎంవోకు ఎందుకు పిలిపించారు?

నిఘా విభాగం అధిపతి హోదాలో ఏ విషయాన్నయినా సీఎంతో పంచుకునేవాడిని. ఇంతకుముందు ఇంటెలిజెన్స్ చీఫ్‌లుగా పనిచేసిన వారూ ఇదే చేశారు. అక్కడికి కాంతిరాణా, విశాల్‌గున్నీ యాదృచ్ఛికంగా వచ్చి ఉంటారు.

కాంతిరాణా,గున్నీలపై ఎందుకు ఒత్తిడి తెచ్చారు?

కుక్కల విద్యాసాగర్ తన ఇబ్బంది చెప్పి సహాయం కోరారు. ఆయన కేసు ఏమిటో చూడాలని కాంతిరాణాకు సూచించాను.

ముంబై పోలీసులకు కూడా ఫోన్‌చేసి సహకరించాలని అడిగారు కాదా?

జత్వానిని అరెస్టు చేయాల్సి ఉందని కాంతిరాణా, విశాల్‌గున్నీ నాకు తెలిపారు. వారికి సహకరించాలని ముంబై పోలీసులకు చెప్పాను.

మీరు ఉపయోగించిన ట్యాబ్ ఎక్కడ?

సర్వీసులో ఉన్నంత వరకు సెల్‌ఫోన్ తప్ప ట్యాబ్, ల్యాప్‌టాప్ ఉపయోగించలేదు. (మళ్లీ అదే ప్రశ్న అధికారి వేయగా) చెప్పాను కదా మహానుభావా! ఐదేళ్లపాటు నా వద్ద పనిచేసిన గన్‌మెన్, సీసీలను విచారిస్తే నేను ట్యాబ్ ఉపయోగించానో లేదో తెలుస్తుంది.

పీఎస్ఆర్‌కు రిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం ఎనిమిది గంటలకే పోలీసులు కోర్టుకు తరలించారు. న్యాయాధికారి తిరుమలరావు ఇరువర్గాల న్యాయవాదులను చాంబర్‌కు పిలిపించుకున్నారు. తాము కోర్టు హాలులో వాదనలు వినిపిస్తామని, బెంచ్‌పైకి రావాలని న్యాయాధికారిని పీఎస్ఆర్ తరఫు న్యాయవాదులు కోరారు. కోర్టు సమయం కాకుండా బెంచ్‌పైకి రాలేనని ఆయన బదులిచ్చారు. ఆ సమయం వరకు తాము వేచి ఉంటామని న్యాయవాదులు చెప్పారు. దానిప్రకారం చూస్తే నిందితుడ్ని కోర్టులో ప్రవేశపెట్టాల్సిన 24 గంటల సమయం దాటిపోతుందని న్యాయాధికారి వారికి స్పష్టం చేశారు. దీంతో న్యాయాధికారి చాంబర్‌లో వాదనలు ప్రారంభమయ్యాయి. ప్రాసిక్యూషన్ తరఫున జేడీ రాజేంద్రప్రసాద్, హైకోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాయిరోహిత్ వాదనలు వినిపించారు. "కాదంబరి జత్వానిపై కేసు నమోదు చేయడం దగ్గర నుంచి ఆమె కుటుంబాన్ని అరెస్టు చేయడం వరకు మొత్తం ప్రక్రియను పీఎస్ఆర్ ఆంజనేయులు పర్యవేక్షించారు. ఇదే విషయాన్ని అప్పటి డీసీపీగా ఉన్న విశాల్‌గున్నీ తన వాంగ్మూలంలో తెలిపారు. విశాల్ గున్నీకి డీఐజీ పదోన్నతి ఇచ్చి విశాఖ రేంజ్‌కు బదిలీ చేయగా, జత్వాని కేసులో అరెస్టులు పూర్తయ్యే వరకు రిలీవ్ చేయబోమని పీఎస్ఆర్ ఆయనను బెదిరించారు. పీఎస్ఆర్‌కు సీఆర్పీసీ 47, 48 ప్రకారం అరెస్టుకు సంబంధించిన సమాచారాన్ని సీఐడీ అధికారులు అందజేశారు." అని తెలిపారు. పీఎస్ఆర్ తరఫున నగేశ్‌రెడ్డి వాదనలు వినిపించారు. "జత్వాని కేసులో ఉన్న ఇతర నిందితులకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో ఏ నిందితుడ్నీ విచారణకు పిలవడం లేదని స్వయంగా ఏజీ కోర్టుకు వివరించారు. అటువంటి పరిస్థితుల్లో పీఎస్ఆర్ అరెస్టు సరికాదు. హైకోర్టు ఇచ్చిన బెయిల్ తీర్పులను అనుసరించి రిమాండ్‌ను తిరస్కరించా"లని అభ్యర్థించారు.


పీఎస్ఆర్‌ను జైలుకు తరలిస్తున్న పోలీసులు

వాదనలు వినిపించిన పీఎస్ఆర్

కాదంబరి జత్వాని కేసులో నిందితుడిగా న్యాయాధికారి ముందు నిలబడిన పీఎస్ఆర్.. తన తరఫున న్యాయవాదులు హాజరై వాదనలు వినిపించినా మధ్యమధ్యలో స్వయంగా వాదనలు వినిపించుకున్నారు. 10-15 నిమిషాలపాటు ఆయన చెప్పదలచిన విషయాలను న్యాయాధికారికి వివరించారు. "నేను విచారణకు సహకరించడం లేదన్న వాదనల్లో వాస్తవం లేదు. జత్వాని ఫిర్యాదుపై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో నాపై క్రైం నంబరు 469/2024తో కేసు నమోదు చేశారు. దీనికి ముందు కుక్కల విద్యాసాగర్ ఇచ్చిన ఫిర్యాదుపై క్రైం నంబరు 90/2024తో ఒక కేసు నమోదు చేశారు. నన్ను 90/2024 కేసులోనే విచారణకు పిలిచారు. ఆ కేసులో నా పేరు నిందితుడిగా గానీ, సాక్షిగా గానీ లేదు. అందువల్లే విచారణకు ఎందుకు హాజరుకావాలో చెబితే వస్తానని విచారణాధికారులకు తెలియజేశాను. జత్వాని కేసును నేను ఏస్థాయిలోనూ పర్యవేక్షించలేదు. కేసు నమోదు చేసిన తర్వాత నా ప్రమేయంతోనే జత్వానిపై కేసు నమోదు చేసినట్టు వాంగ్మూలం ఇవ్వాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నట్టు విశాల్‌గున్నీ ఫోన్ చేశారు. అలా చేయ డం తప్పని, ఆవిధంగా వాంగ్మూలం ఇవ్వొద్దని విశాల్‌గున్నీకి చెప్పాను. శాఖాపరంగా జరిగిన విచారణను ఆధారం చేసుకుని నన్ను అరెస్టు చేయడం అసంబద్ధం" అని పీఎస్ఆర్ వాదించారు.

ప్రపంచ సుందరి పోటీలు వేదికగా..
పర్యాటక పెట్టుబడుల సదస్సు

మే 28న నిర్వహించనున్న సర్కారు.. ఇప్పటికే పలు దిగ్గజ కంపెనీలకు ఆహ్వానాలు

- మహీంద్రా, తాజ్, ఒబెరాయ్, మే ఫెయిర్ సహా.. కొన్ని కంపెనీలతో అధికారుల చర్చలు
- రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశాల వివరణ
- ఐదేళ్లలో 15 వేల కోట్ల పెట్టుబడుల లక్ష్యం
- యువతకు ఉద్యోగాలే లక్ష్యంగా అడుగులు

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే నెలలో జరగనున్న ప్రపంచ సుందరి (మిస్ వరల్డ్) పోటీలు వేదికగా.. తెలంగాణకు పెట్టుబడులను రప్పించేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. అందాల పోటీల బాధ్యతలను చూస్తున్న పర్యాటక శాఖ ఆధ్వర్యంలో.. రాష్ట్రంలో పర్యాటకం, ఆతిథ్య రంగాల్లో పెట్టుబడులు పెట్టేలా దిగ్గజ కంపెనీలతో చర్చలు జరపనుంది. ఈ మేరకు ప్రపంచ సుందరి పోటీల సమయంలోనే మే 28న 'పర్యాటక పెట్టుబడుల సదస్సు (టూరిజం ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్)' నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సదస్సులో పాల్గొనాలంటూ దేశవిదేశాల కంపెనీలకు ఇప్పటికే ఆహ్వానాలు కూడా పంపింది. పర్యాటక, ఆతిథ్య రంగంలో పేరుగాంచిన మహీంద్రా, తాజ్, ఒబెరాయ్, మే ఫెయిర్‌తోపాటు మరికొన్ని కంపెనీలతో పర్యాటక శాఖ అధికారులు చర్చలు జరుపుతున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకున్న అవకాశాలను, అందుబాటులో ఉన్న వనరులను వివరిస్తున్నారు. ఇక్కడి పర్యాటక ప్రాంతాలు, ప్రముఖ స్థలాలు, ఆలయాలు, క్షేత్రాలు తదితర వివరాలను వారికి అందజేస్తున్నారు. పర్యాటక అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిస్తున్నారు. మొత్తంగా వచ్చే ఐదేళ్లలో రూ.15 వేల కోట్ల పెట్టుబడులు, లక్షల సంఖ్యలో యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పన లక్ష్యంగా పర్యాటక శాఖ చర్యలు చేపడుతోంది.



ప్రత్యేకంగా రాయితీలు అందిస్తూ..

కేంద్ర పర్యాటక శాఖ 2022 నివేదిక ప్రకారం 6.07 కోట్ల మంది దేశీయ పర్యాటకులు, 68,400 మంది విదేశీ పర్యాటకులు తెలంగాణలో పర్యటించారు. భవిష్యత్‌లో దేశంలో టాప్ 5 పర్యాటక రాష్ట్రాల్లో తెలంగాణను ఒకటిగా నిలపాలని.. రాష్ట్ర జీడీపీలో 10 శాతానికిపైగా పర్యాటకం నుంచే సమకూరేలా ప్రణాళికలను అమలు చేయాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే రాష్ట్ర పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టే కంపెనీలకు పలు రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించింది. పెట్టుబడుల మొత్తం, జరిగే వ్యాపార అంచనాలను బట్టి రాయితీలను వర్తింపజేయనుంది. ఆయా ప్రాజెక్టులకు అవసరమైన భూములను తక్కువ ధరకే లీజుకు ఇవ్వనుంది. కాగా, పెట్టుబడులను ఆకర్షించేందుకు, అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను గుర్తించింది. అందులో 9 ప్రాంతాలను తొలుత అభివృద్ధి చేయాలని ప్రాథమికంగా నిర్ణయించింది. దిగ్గజ కంపెనీల ఆసక్తి, వనరులు, పెట్టుబడులకు అనుగుణంగా ప్రాంతాల ఎంపిక మారే అవకాశం ఉందని అధికారికవర్గాలు చెబుతున్నాయి.

హోటళ్లు, రిసార్టుల్లో తెలంగాణ వారికి 25 శాతం రాయితీ

సాధారణంగా స్టార్ హోటల్స్‌లో పెద్దగా రాయితీలు ఇవ్వరు. సౌకర్యాలను బట్టి భారీగా చార్జీలు వసూలు చేస్తారు. అయితే దేశ విదేశాలకు చెందిన పెద్ద కంపెనీలు రాష్ట్రంలో ఈ వ్యాపారాలు చేస్తున్న నేపథ్యంలో... వాటిలో తెలంగాణ వారికి 25శాతం మేర రాయితీ ఇప్పించాలని పర్యాటక శాఖ భావిస్తున్నట్టు తెలిసింది. నిర్ణీత తేదీలు, రోజుల్లో ఈ రాయితీ ఇచ్చే అవకాశం ఉంటుంది. ఆయా హోటళ్లు, రిసార్టులకు వెళ్లి తెలంగాణ పౌరుడిగా ఉన్న గుర్తింపు కార్డును చూపించి రాయితీ పొందేలా ఏర్పాటు చేయనున్నట్టు తెలిసింది.


చేవెళ్ల ప్రభుత్వాసుపత్రిలో అఘోరీ

చంచల్‌గూడ జైలుకు అఘోరీ

- హైదర్‌షాకోట్‌లోని కస్తూర్బా గాంధీ హోంకు అఘోరీ భార్య తరలింపు

శంకర్‌పల్లి, కంది, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఓ మహిళా సినీ నిర్మాతను మోసగించిన కేసులో అఘోరీని మోకిల పోలీసులు అరెస్టు చేశారు. భార్య శ్రీవర్షితో కలిసి అఘోరీ కారులో హరిద్వార్ వెళ్తుండగా పోలీసులు ఉత్తరప్రదేశ్‌లో అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. అఘోరీని ఏసీపీ రమణగౌడ్ ఆధ్వర్యంలో రెండు గంటలపాటు విచారించాక చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం చేవెళ్ల కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరుపరుచగా, న్యాయమూర్తి 14రోజుల రిమాండ్ విధించడంతో సంగారెడ్డి జిల్లా కంది సబ్‌జైలుకు తరలించారు. అంతకుముందు అఘోరీని ఏ బ్యారక్‌లో ఉంచాలో తేల్చుకోలేక కంది జైలు అధికారులు తలలు పట్టుకున్నారు. మహిళా ఖైదీలు ఉండే బ్యారెక్‌లో ఉంచాలా.. లేక పురుష ఖైదీలు ఉండే బ్యారక్‌లో ఉంచాలా అనే విషయంపై తేల్చుకోలేక తిరిగి పోలీసులకు అప్పగించారు. దీంతో పోలీసులు చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించి లింగనిర్ధారణ పరీక్షలు చేయించారు. వైద్యుల పరీక్షల్లో అఘోరీ ట్రాన్స్‌జెండర్ అని తేలడంతో కోర్టు సూచన మేరకు చంచల్‌గూడ జైలుకు తరలించారు. అఘోరీ భార్య శ్రీవర్షి తల్లిదండ్రులతో వెళ్లేందుకు నిరాకరించడంతో ఆమెను హైదర్‌షాకోట్‌లో గల కస్తూర్బా గాంధీ హోంకు తరలించారు. అయితే తన భార్య శ్రీవర్షిని తనతోపాటే జైలులో ఉండాలని, విచారణలో పోలీసులకు సహకరిస్తామని అఘోరీ చెప్పడం గమనార్హం.

ముగ్గురు ఇంటర్ విద్యార్థినుల ఆత్మహత్య

పరీక్షల్లో ఫెయిలైనందుకే..

లక్షెట్టిపేట, భిక్కనూరు, మహదేవపూర్ రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఇంటర్‌మీడియట్ పరీక్షల్లో ఫెయిలైన ముగ్గురు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్నారు. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట పట్టణంలోని గోదావరి రోడ్డుకు చెందిన పందిరి అశ్విత(17) ఓ సబ్జెక్టులో ఫెయిల్ అయినట్లు తెలియడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అలాగే, కామారెడ్డి జిల్లా భిక్కనూరు గ్రామానికి చెందిన పూజ(17) బుధవారం తెల్లవారుజామున ఇంట్లో కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకొని బలవన్మరణానికి పాల్పడింది. మరో ఘటనలో.. భూపాలపల్లి జిలా పలిమెల మండల కేంద్రంలోని అప్పాజీపేటకు చెందిన జాడి సంజన(16) ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ప్రాణాలు తీసుకుంది.

కృష్ణా జలాల పునఃపంపిణీపై గెజిట్‌ను రద్దు చేయండి

- బ్రిజేశ్ ట్రైబ్యునల్‌కు అదనంగా ఇచ్చిన టీవోఆర్ చెల్లదు
- సుప్రీంకోర్టులో ఏపీ వాదనలు
- నేడు కూడా కొనసాగనున్న విచారణ

న్యూఢిల్లీ/అమరావతి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల మధ్య నీటి పంపకానికి బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్‌కు కేంద్రం జారీ చేసిన నూతన అదనపు మార్గదర్శకాలు (టెర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్-టీవోఆర్) సరికాదని ఆంధ్రప్రదేశ్ తెలిపింది. అంతర్రాష్ట్ర నదీ జలాల చట్టం-1956లోని సెక్షన్-3 ప్రకారం కృష్ణా జలాల పంపిణీ చేపడితే తనకు తీరని నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తంచేసింది. సదరు టీవోఆర్‌ను రద్దు చేయాలని సుప్రీంకోర్టును కోరింది. నదీ పరివాహక ప్రాంతం, ప్రస్తుత నీటివాడకం లెక్కల ఆధారంగానే గతంలో నీటి కేటాయింపులు చేశారని, ఇప్పుడు పునఃపంపకాల కోసం ట్రైబ్యునల్‌కు విధివిధానాలు ఖరారు చేయడం వల్ల తమకు అన్యాయం జరుగుతుందని తెలిపింది. కేంద్రం తెచ్చిన టీవోఆర్‌ను రద్దు చేయాలని కోరింది. ఈ మేరకు ఏపీ దాఖలుచేసిన పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌తో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ఆంధ్ర తరఫున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా వాదనలు వినిపించారు. కేంద్ర నిర్ణయం ఆమోదయోగ్యం కాదని, నదీ జలవివాద చట్టం ప్రకారం బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్‌కు ఇలా అదనపు అంశాలు పరిశీలించే అధికారం లేదని తెలిపారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం నీటి కేటాయింపులకు రక్షణ ఉందని, ఇప్పటికే సెక్షన్ 89ఏ, బీ కింద ట్రైబ్యునల్ రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నీటిని ప్రాజెక్టుల వారీ కేటాయింపులపై పరిశీలిస్తుండగా.. కొత్త నియమ నిబంధనలు చేర్చడం తగదన్నారు. ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర మధ్య కృష్ణా జలాల పంపిణీలో భాగంగా ఉమ్మడి రాష్ట్రానికి గతంలో 811 టీఎంసీలు కేటాయించారని గుర్తుచేశారు. రాష్ట్ర విభజన తర్వాత అందులో ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలు కేటాయించారని.. పరివాహక ప్రాంతం, ప్రస్తుత నీటి వాడకం లెక్కలను బట్టి ఆ కేటాయింపులు చేశారని వెల్లడించారు. ఇప్పుడు వీటిని మళ్లీ మొదటి నుంచి పరిశీలించేలా విధివిధానాలు ఖరారు చేయడం తగదని, దీనివల్ల ఏపీకి తీవ్రంగా అన్యాయం జరుగుతుందని తెలిపారు. కోర్టు సమయం ముగియడంతో తదుపరి వాదనలు గురువారం వింటామని.. సమయం సరిపోదనుకుంటే ఇంకో రోజు కూడా వింటామని ధర్మాసనం స్పష్టం చేసింది. గురువారం సమగ్ర సమాచారం ఇస్తామని గుప్తా తెలిపారు.



దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ లిమిటెడ్
ఆపరేషన్: వికారాబాద్ సర్కిల్ :: టెండరు ప్రకటన నం: 01/25-26

గమనిక: కొన్ని అనివార్య కారణాల వలన, సాక్షి తెలుగు దినపత్రిక & ది హిందూ ఇండియాలో తేది 25.02.2025న ప్రచురితమైనట్టి Sl.No.09 టెండరు ప్రకటన నం.11/24-25, తేది 25.02.2025 మరియు ఆంధ్రజ్యోతి & ది హిందూ ఇండియాలో ప్రచురితమైనట్టి Sl.No.06 టెండరు ప్రకటన నం.12/24-25 తేది 13.03.2025 ఇందుమూలంగా రద్దు చేయబడినవి. తాజా అర్హత గల బిడ్డర్ల నుండి టెండరు బిడ్లు కోరబడుతున్నవి: 1) ... 33/11KV ... నుండి 2KM నూతన 11KV ఫీడర్ స్థాపన. 2) ... 33KV ... 132/33KV ... EHT SS వద్ద 33KV VCB ఏర్పాటు. 3) ... CL 500 KW ... VLF ... CMD 500KVA కొరకు HT Cat-VII కొరకు తాత్కాలిక సరఫరా పొడిగింపు. ఫోన్ నం.8331019368 లేదా 7901093660, ఇమెయిల్: detcvkb@gmail.com, www.tgsouthernpower.com
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్, TGSPDCL, వికారాబాద్ సర్కిల్
DIPR RO.No.697-PP/CL/ADVT/1/2025-26, Dt: 22.04.2025

తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ లిమిటెడ్
టూరిజం హౌస్,3-5-891, హిమాయత్‌నగర్, హైదరాబాద్-29
ఫోన్: 040-2326 2151 to 57, ఫ్యాక్స్: 040-2326 1801
TGTDC/MNTC/M1/10/2025 **టెండరు ప్రకటన** తేది:23.04.2025
తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ లిమిటెడ్ వారు దిగువ పేర్కొన్న విధంగా వివిధ హరిత హోటళ్ళు మరియు రిసార్ట్‌లలో వ్యక్తిగతంగా దిగువ ఐటంల కొరకు 24 నుండి 26 ఏప్రిల్ 2025 వరకు అనగా మూడు రోజుల స్వల్పకాలిక టెండర్లు కోరుచున్నారు.
(క్ర.సం.1) ఐటమ్: కర్టెన్ మెటీరియల్స్, 2) బెడ్ లినెన్ & బాత్ లినెన్, 3) పరుపులు & దిండ్లు టెండరు డాక్యుమెంట్ల సేకరణ కొరకు మరియు మరిన్ని వివరాల కొరకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (హోటళ్ళు), TGTDC, హైదరాబాద్ (సెల్ నం:9246288917) & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, TGTDC, హైదరాబాద్ (సెల్ నం:9948818822)ను సంప్రదించగలరు.
DIPR RO No.725-PP/CL/ADVT/1/2025-26, Dt.23.04.2025 సం/- మేనేజింగ్ డైరెక్టర్

సదాశివపేట పురపాలక సంఘ కార్యాలయం : సంగారెడ్డి జిల్లా- తెలంగాణ
"ఇ" ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
టెండరు ప్రకటన నం.E1/429/SSPT/e-proc/2025-26, తేది:23.04.2025
వివిధ గ్రాంట్ల క్రింద పట్టణంలో కొన్ని అభివృద్ధి నిర్వహణ పనుల కోసం టెండర్లకు పిలుపునిచ్చారు. వివరాలు దిగువ ఇవ్వబడినవి **ఆన్‌లైన్‌లో బిడ్‌లు దాఖలుకు ప్రారంభ తేది / సమయం:** 24.04.2025న ఉ.10.30 గం.ల నుండి. **ఆన్‌లైన్‌లో బిడ్‌లు దాఖలుకు ముగింపు తేదీ/సమయం:** 28.04.2025న ఉ.10.30 గం.ల వరకు, **బిడ్లు తెరుచుట:** 28.04.2025న ఉ.11.00 గం.లకు. **సంప్రదింపు వివరాలు::** మునిసిపల్ కమీషనర్, సదాశివపేట పురపాలక సంఘం సెల్.నం.9849905918 (కమీషనర్), ఇంజనీర్: 7331123024 **ఇమెయిల్:** mc.sadasivpet@yahoo.com. తదుపరి వివరాలను ఈ "ఇ" ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tender.telangana.gov.inలో చూడవచ్చు. పనుల డౌన్‌లోడింగ్ ప్రారంభం: 24.04.2025న, ఉ.10.30 గం.ల నుండి. **సం/- కమీషనర్, సదాశివపేట పురపాలక సంఘం**
DIPR RO No.724-PP/CL/ADVT/1/2025-26, Dt.23.04.2025

RAJIV GANDHI UNIVERSITY OF KNOWLEDGE TECHNOLOGIES : ANDHRA PRADESH
(Established through Act No.18 of 2008 by the Govt. of Andhra Pradesh and recognized as per Section 2(f), 12(B) of UGC Act. 1956)
Admission Notification for Integrated Under Graduate Programs - 2025-26
No.1/RGUKT-AP/UG/Admissions/2025, Date:24-04-2025 Online applications are invited from eligible candidates for Admission into the Six Year Integrated B.Tech Programme in RGUKT AP campuses at Nuzvid, RK Valley (Idupulapaya), Ongole, and Srikakulam for the academic year 2025-26. Interested candidates can apply for admission online through University website **www.rgukt.in/** AP online center. Candidates can submit their online applications from 10:00 AM on 27.04.2025. The last date for submission is 20.05.2025, upto 5:00PM. For more details, visit the university website at **www.rgukt.in**
Sd/- Convener
DIPR RO No.4060PP/CL/ADVT/1/1/2021-22, Dt: 23.04.2025

తెలంగాణ ప్రభుత్వం
సూపరింటెండెంట్ కార్యాలయం, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, సంగారెడ్డి
Lr.No.1970/CGH-SRD/2025 తేది: 22.04.2025
టెండరు ప్రకటన
సంగారెడ్డి, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో CCTV కెమెరాల స్థాపన కొరకు సీల్డ్ టెండర్లు కోరబడుతున్నవి. టెండరు ఫారాల అమ్మకం **28.04.2025** నుండి పనిదినములలో **03.05.2025** వరకు అన్ని పనిరోజుల్లో **ఉ.11.00 గం.నుండి సా.4.00** గం.వరకు ఉంటుంది. 02. టెండరు ఫారాల అమ్మకం ఆఖరి తేది **04.05.2025న మ.2.00** గం.వరకు. సూపరింటెండెంట్ చాంబర్స్, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సంగారెడ్డిలో సీల్డ్ టెండర్ బాక్స్‌లో వేయవలెను. బయానా లేని టెండర్ ఫారాలు తిరస్కరించబడతాయి. 03. టెండరు ఫారాలు, నియమనిబంధనలు మరియు కాంట్రాక్టు అర్హత వివరాలు మరియు తదుపరి వివరాలు కార్యాలయం నుండి పొందవచ్చును. టెండరు ఫారం ధర **రూ.5000/- (రూపాయలు ఐదు వేలు మాత్రమే)** లను హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ, సూపరింటెండెంట్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, సంగారెడ్డి పేరున డి.డి. రూపంలో చెల్లించవలెను. ఇవి వాపసురావు.04. బయానా మొత్తం **రూ.50,000/-** (రూపాయలు యాభై వేలు మాత్రమే)లను హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ, సూపరింటెండెంట్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, సంగారెడ్డి పేరున డి.డి. రూపంలో చెల్లించవలెను.ఇవి గెలుపొందని బిడ్డర్లకు తిరిగి ఇవ్వబడతాయి. 05. పై టెండరును రద్దు చేయుటకు పూర్తి హక్కులు సూపరింటెండెంట్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, సంగారెడ్డి వారికి పూర్తి హక్కులు కలవు.
సం/- సూపరింటెండెంట్, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, సంగారెడ్డి.
DIPR RO No.733-PP/CL/ADVT/1/2025-26 తేది: 23.04.2025

TELANGANA POWER GENERATION CORPORATION LIMITED VIDYUT SOUDHA :: HYDERABAD-82

T.No.e-02/CE/Civil/Thermal/TGGENCO/2025-26
BTPS - Construction of RCC patrolling road along inside periphery at Bhadradri Thermal Power Station, Manuguru, Bhadradri Kothagudem Dist. Value of the works Rs.14,34,73,195/- Scheduled Open & Closing Date: **24.04.2025 at 17:00 Hrs & 08.05.2025 at 17:00 Hrs.**

T.No.e-03/CE/Civil/Thermal/TGGENCO/2025-26
BTPS - Construction of RCC road over existing WBM on raw water reservoir embankment at Bhadradri Thermal Power Station, Manuguru, Bhadradri Kothagudem Dist. Value of the works **Rs.2,11,06,575/-** Scheduled Open & Closing Date: **25.04.2025 at 17:00 Hrs & 13.05.2025 at 17:00 Hrs.**

T.No.e-23/CE/O&M/KTPS-VII/DE/Pur/TGGENCO/2025-26
KTPS-VII - Procurement of Engine Spares to BD-155 & BD-355 BEML Dozers at Kothagudem Thermal Power Station Stage VII, Paloncha, Bhadradri Kothagudem Dist. Value of the works **Rs.23,48,139/-** Scheduled Open & Closing Date: **16.04.2025 at 17:00 Hrs & 02.05.2025 at 15:30 Hrs.**

T.No.e-01/CE/O&M/SE/Civil/KTPS-VII/TGGENCO/2025-26
KTPS-VII - Laying RCC pedestals from the Northern Ash Pond-I to Northern Ash Pond-II for extension of Ash disposal pipe lines at Kothagudem Thermal Power Station Stage VII, Paloncha, Bhadradri Kothagudem Dist. Value of the works **Rs.31,74,805/-** Scheduled Open & Closing Date: **22.04.2025 at 19:00 Hrs & 02.05.2025 at 13:00 Hrs.**

T.No.e-03/CE/O&M/KTPS-VII/DE/Pur/TGGENCO/2025-26
KTPS-VII - Procurement of LED lighting Fixtures at Kothagudem Thermal Power Station Stage VII, Paloncha, Bhadradri Kothagudem Dist. Value of the works **Rs.16,00,000/-** Scheduled Open & Closing Date: **07.04.2025 at 15:00 Hrs & 30.04.2025 at 15:30 Hrs.**

T.No.e-05/CE/(C&C)/SE(C&C)/DE(C)/TGGENCO/2024-25
YTPS - Supply of 18,900 KL of Light Diesel Oil (LDO) to Stage-2 (Units 3 & 4) at Yadadri Thermal Power Station, Veerlapalem (V), Dameracherla (Mdl), Nalagonda Dist. by Road mode on Delivered Basis for the year 2024-25 - **Schedule Extended upto: 28.04.2025 at 12:30 Hrs.**
DIPR RO.No: 743-PP/CL/ADVT/1/2025-26, Dt: 23.04.2025

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)
Lenin Center, Governorpet, Vijayawada - 520 002 (A.P.)

E-PROCUREMENT SHORT TENDER NOTICE

S.No	NIT No	Name of the Work
1	NIT No. 18/PROC/MAU61-OPOM0COMM/16/2025-JDC, Dt. 23.04.2025	APCRDA-"Request for Proposal (RfP) for Appointment of Agency for Branding, Communications, and Digital Outreach Strategy for Amaravati"

The bid can be downloaded on AP e-procurement portal from **24.04.2025 to 01.05.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid is **01.05.2025 up to 15.00 Hrs**, Technical bid opening **01.05.2025 @ 16.00 Hrs**

E-PROCUREMENT TENDER NOTICE

S.No	NIT No	Name of the Work
2	NIT No. MAU61-ADMN0SD(VI)/19/2025-HB, Dt. 23.04.2025.	Supply and fixing of split air conditioners of four numbers in APCRDA thullur unit office"- **Estimate Amount: Rs. 3.60 Lakhs.**
3	NIT No. MAU61-ADMN0SD(VI)/16/2025-HB, Dt. 23.04.2025.	"Construction of Horticulture Nursery cum training centre (HNTC) at UD Palem in CRDA Region"- **Estimate Amount: Rs. 96.00 Lakhs.**

(Item 2:) The bid can be downloaded on AP e-procurement portal from **24.04.2025 to 08.05.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid **08.05.2025 up to 15.00 Hrs**, Technical bid opening **08.05.2025 @16.00 Hrs**.

(Item 3:) The bid can be downloaded on AP e-procurement portal from **24.04.2025 to 09.05.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid **09.05.2025 up to 15.00 Hrs**, Technical bid opening **09.05.2025 @16.00 Hrs.**

For further details Please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in.**
Sd/- Commissioner, APCRDA, Vijayawada.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పోప్ ఫ్రాన్సిస్

సంస్కర్త హృదయమున్న ఆధ్యాత్మిక పుణ్యమూర్తి పోప్ ఫ్రాన్సిస్. మొన్న సోమవారంనాడు మరణించిన ఈ పోప్ ప్రపంచ వ్యాప్తంగా 140 కోట్లకు పైగా ఉన్న రోమన్ కేథలిక్ మతస్తులకు వహించిన మార్గదర్శకత్వం విప్లవాత్మకమైనది. ఆయన పేదల పక్షపాతి. ధరిత్రికి ముంచుకొస్తున్న ముప్పును గుర్తించి వాతావరణ మార్పు వైపరీత్యాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వాలు, ప్రజలకు ప్రేరణ కల్పించిన కార్యాచరణ ద్రష్ట.

లాటిన్ అమెరికా నుంచి, ఆ మాటకొస్తే ఉభయ అమెరికా ఖండాల నుంచి క్రైస్తవ మత అత్యున్నత పీఠాన్ని అధిష్ఠించిన తొలివ్యక్తి పోప్ ఫ్రాన్సిస్. జార్జి మారియో బెర్ గొగ్లియోగా 1936లో అర్జెంటీనాలో జన్మించిన ఫ్రాన్సిస్, పోప్‌గా ఎన్నికైన తొలి జెసూట్స్ క్రైస్తవుడు కూడా కావడం ఒక విశేషం. వర్తమాన క్రైస్తవ, క్రైస్తవేతర మత, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక నాయకులలో ఆయన ఒక విలక్షణ వ్యక్తి. పోప్‌గా ఎన్నికైన తరువాత, తాను ఎంతగానో అభిమానించే పర్యావరణం, జంతువుల రక్షక ఋషిగా చిరంజీవి అయిన 13వ శతాబ్ది క్రైస్తవ సాధు పురుషుడు సెయింట్ ఫ్రాన్సిస్ పేరును ఆయన స్వీకరించారు. పేదరికం నిర్మూలనకు, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడం ద్వారా ఆ పేరును సార్థకం చేశారు.

పోప్‌గా నిరాడంబర జీవనం గడిపిన ఫ్రాన్సిస్ ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక అసమానతలు అమానుష స్థాయిలో పెరిగిపోవడాన్ని నిరసించారు. పేదల సంక్షేమం పట్ల ఉదాసీనత ప్రపంచీకరణ కావడాన్ని, సంపన్న దేశాలలో 'ఆధ్యాత్మిక దుర్భిక్షాన్ని' నిక్కచ్చిగా విమర్శించేందుకు ఆయన వెనుకాడేవారు కాదు. అర్జెంటీనాకు వలస వెళ్లిన ఇటాలియన్ వలసకారుల కుటుంబంలో జన్మించిన ఫ్రాన్సిస్ శరణార్థుల, నిరాశ్రయుల, మరీ ముఖ్యంగా వలసజీవుల శ్రేయస్సుకు స్వయంగా చొరవ తీసుకున్నారు. డోనాల్డ్ ట్రంప్ తన మొదటి పదవీ కాలంలో వలసకారులను అడ్డుకునేందుకు అమెరికా–మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మించడాన్ని ఫ్రాన్సిస్ హర్షించలేదు. ఆ చర్య క్రైస్తవ ధర్మానికి విరుద్ధమని స్పష్టం చేశారు. రెండోసారి అమెరికా అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత అక్రమ వలసకారులు అంటూ ట్రంప్ ఎంతో మందిని మానవతా విలువలు పాటించకుండా బలవంతంగా అమెరికా నుంచి పంపించివేయడాన్ని ఫ్రాన్సిస్ ఆమోదించలేదు. ట్రంప్ చర్యను గట్టిగా వ్యతిరేకించాలని అమెరికాలోని బిషప్‌లకు రాసిన లేఖలో ఆయన కోరారు. కేథలిక్ చర్చ్‌ల్లో మహిళలకు పురోహిత బాధ్యతలు అప్పగించేందుకు పూర్వ పోప్‌ల వలే ఫ్రాన్సిస్ కూడా సమ్మతించలేదు. అయితే వాటికన్ ప్రభుత్వ వ్యవస్థలో మహిళలను మున్నెన్నడు లేని విధంగా అత్యున్నత స్థానాలలో ఆయన తొలిసారిగా నియమించారు. అలాగే స్వలింగ సంపర్కాన్ని నిరసించినప్పటికీ అటువంటి వారి మధ్య వివాహాలకు మతపరమైన ఆమోదాన్ని తెలుపాలని పోప్ ఫ్రాన్సిస్ ఆదేశించారు. కెనడాలోని ప్రథమ జాతుల (మూల వాసులు) వారికి క్రైస్తవ మతాధికారుల మూలంగా వాటిల్లిన కష్ట నష్టాలకు పోప్ ఫ్రాన్సిస్ 2022లో క్షమాపణలు చెప్పారు. ఇంకా ఇలా ఉదారవాద దృక్పథంలో పలు నిర్ణయాలు తీసుకోవడం ద్వారా రోమన్ కేథలిక్ క్రైస్తవ మత వ్యవస్థలో గుణాత్మక విప్లవాత్మక మార్పులకు ఆయన దోహదం చేశారు.

ప్రపంచ పర్యావరణ ఉద్యమాన్ని పోప్ ఫ్రాన్సిస్ పలు విధాలుగా ప్రభావితం చేశారు. ధరిత్రిని 'మానవాళి ఉమ్మడి నివాసం'గా ఫ్రాన్సిస్ అభివర్ణించారు. ధరిత్రికి వాటిల్లుతున్న హానిని ప్రపంచ సమాజాలు సమష్టిగా ఎదుర్కోవాలని ఉద్బోధించారు. ఏటా జరిగే కాప్ సదస్సులలో చర్చలను ఆయన ప్రభావితం చేసేవారు. అమెజాన్ అరణ్యాల విధ్వంసాన్ని స్వయంగా చూసిన ఫ్రాన్సిస్ హరిత ధాత్రిని కాపాడుకునే విషయంలో మూలవాసుల అభిప్రాయాలకు విశేష ప్రాధాన్యమిచ్చారు.

మతాల మధ్య సదవగాహనను పెంపొందించడానికి పోప్ ఫ్రాన్సిస్ కృషి చేశారు. ఈ కృషికి పరాకాష్ఠగా 2019లో అబుధాబిలో 'మానవ సౌభ్రాతృత్వం' సదస్సు జరిగింది. ఆ సందర్భంగా అల్ అఝర్ (ఈజిప్ట్) లోని గ్రాండ్ ఇమామ్ అహ్మద్ అల్ తయ్యెబ్‌తో కలిసి ఆయన ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఆ సదస్సు సందర్భంగా తనతో సమావేశమైన భారతీయ ప్రతినిధులకు భారత్ ఆధ్యాత్మిక సంస్కృతి పట్ల తనకెంతో గౌరవం ఉందని ఫ్రాన్సిస్ అన్నారు. వ్యక్తిగా, మతవేత్తగా ఆయన నిండు మానవతావాది. సమాజ జీవనంలో మానవత పరిపూర్ణంగా విలసిల్లేందుకు ఆయన అచంచలమైన అంకితభావంతో పాటుపడ్డారు. ఆయన ధర్మ ప్రవచనాలు క్రైస్తవులకే కాక క్రైస్తవేతరులకూ స్ఫూర్తిదాయకమైనవి. రాజకీయ సంబంధిత భావావేశాలతో మత ధర్మాలను తప్పుగా అర్థం చేసుకుంటున్న మన సమాజంలో పోప్ ఫ్రాన్సిస్ విశాల భావాలను పరివ్యాప్తం చేయవలసిన అవసరమున్నది.

'వక్ఫ్'పై వాట్సాప్ వర్సిటీ పరిజ్ఞానం!

మాజీ ఎంపీ, ప్రస్తుత బీజేపీ నాయకులు బూర నర్సయ్య గౌడ్ ఏప్రిల్ 9న ఆంధ్రజ్యోతిలో 'ముస్లిం సంక్షేమానికే వక్ఫ్ సవరణలు' పేరుతో వ్యాసం రాశారు. ఈ వ్యాసంలోని విషయాలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయి. వాట్సాప్ యూనివర్సిటీలో మోదీ భక్తులు చేసే ప్రచారాలతో ప్రభావితమై రాసినట్లు ఉంది.

భారతదేశంలో రక్షణ రంగం, రైల్వేల తర్వాత అత్యధిక ఆస్తులు వక్ఫ్ సంపదే అని రాశారు. ఇది అవాస్తవం. తమిళనాడు, ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఈ నాలుగు రాష్ట్రాలలోనే 14 లక్షల ఎకరాల ఎండోమెంట్ భూములు ఉంటే దేశవ్యాప్తంగా ఎన్ని లక్షల ఎకరాలు ఉండొచ్చు? రాజ్యసభ సభ్యులు కపిల్ సిబల్ ఇదే విషయాన్ని సభలో ప్రస్తావించిన విషయం మనం చూశాం. వాస్తవాలు ఇలా ఉంటే మోదీ అనుకూల మీడియాలో సాగుతున్న తప్పుడు ప్రచారాన్నే నర్సయ్య గౌడ్ కూడా కొనసాగించారు. 2013లో కాంగ్రెస్ ప్రభుత్వం వక్ఫ్ చట్టానికి సవరణ చేసి సెక్షన్ 40 తీసుకువచ్చిందని, ఈ సెక్షన్ ప్రకారం ఏ భూమినైనా వక్ఫ్ ఆస్తిగా ప్రకటించే అవకాశం ఉందని, ఇలా దేశవ్యాప్తంగా 36 లక్షల ఎకరాల భూమిని వక్ఫ్ ఆస్తిగా ప్రకటించారని బూర నర్సయ్య గౌడ్ అన్నారు. ఏ కోర్టుకు కూడా ఈ చర్యలను సమీక్షించే అవకాశం లేదన్నారు. ఇది కూడా వాట్సాప్ యూనివర్సిటీ చేసే అబద్ధ ప్రచారమే. ప్రస్తుతం దేశంలోని వక్ఫ్ బోర్డుల పరిధిలో 9 లక్షల ఎకరాల భూమి ఉందని కేంద్ర ప్రభుత్వం బిల్లుపై చర్చలో ప్రకటించింది. మరి ఈ 36 లక్షల ఎకరాల భూమి ఎక్కడి నుండి వచ్చింది?



ఒక్క ముస్లిం వ్యక్తికి కూడా అసెంబ్లీ, పార్లమెంటు టికెట్ ఇవ్వని, ప్రతీ అంశంలో హిందూ–ముస్లిం విభజన తేవడానికి ప్రయత్నించే పార్టీ బీజేపీ. ఈ వక్ఫ్ సవరణలతో ముస్లింలలోని వెనుకబడిన వర్గాలకు న్యాయం చేస్తామని ఆ పార్టీ ప్రకటించినంత మాత్రాన ముస్లింలు ఎలా నమ్ముతారో బూర నర్సయ్య గౌడ్ చెప్పాలి.

ఇక వక్ఫ్ చట్టం 1995 సెక్షన్ 40 గురించి వాస్తవం చూద్దాం. ఈ సెక్షన్ ప్రకారం ఏదేని ఆస్తి వక్ఫ్‌దా కాదా? అన్న వివాదం వచ్చినప్పుడు విచారణ జరిపి నిర్ణయం తీసుకునే అధికారం వక్ఫ్ బోర్డుకు ఉంటుంది. బోర్డు నిర్ణయంపై ఎవరికైనా అభ్యంతరం ఉంటే వక్ఫ్ ట్రిబ్యునల్‌ని ఆశ్రయించవచ్చు. ట్రిబ్యునల్ తీర్పుపై కూడా అభ్యంతరం ఉంటే హైకోర్టును, ఆ తర్వాత సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించవచ్చు. అంటే, ఏదైనా ఆస్తిని వక్ఫ్ బోర్డు తనదని క్లెయిమ్ చేసుకుంటే, దానిని న్యాయస్థానాలలో సవాలు చేయవచ్చు. కానీ ఆ అవకాశం లేదంటూ తీవ్ర దుష్ప్రచారం చేసి ప్రస్తుత సవరణ చట్టంలో సెక్షన్ 40ని తొలగించారు. వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టకముందే, తనదైన శైలిలో బీజేపీ వాట్సాప్ యూనివర్సిటీ ద్వారా వక్ఫ్ ఆస్తులపై, వక్ఫ్ బోర్డులపై తీవ్రమైన దుష్ప్రచారం చేసింది. జనబాహుళ్యంలో వక్ఫ్ బోర్డు అంటే ఒక భూ మాఫియా సంస్థగా, హిందువుల ఆస్తులను, దేశ ఆస్తులను కబళించే ఒక సంస్థగా చిత్రీకరించింది.

నూతన సవరణ చట్టం ప్రకారం వక్ఫ్ బోర్డులో ముస్లింలలోని షియా, ఆఘఖాని, బోరా, ఇస్మాయిలి వర్గాలకు ప్రాతినిధ్యం లభిస్తుందని నర్సయ్య గౌడ్ అన్నారు. కానీ వాస్తవం ఏంటంటే ప్రస్తుతం ఉన్న వక్ఫ్ బోర్డులను విభజించి 'ఆగాఖాని వక్ఫ్ బోర్డు', 'జొహరా'ల కొరకు ప్రత్యేక వక్ఫ్ బోర్డులను ఏర్పాటు చేయడం అన్నది ముస్లిం సమాజంలో చీలిక తేవడానికి ఉద్దేశించినది. ఇది 'విభజించి పాలించు' సూత్రానికి పరాకాష్ఠ. 1995 వక్ఫ్ చట్టం 14 ప్రకారం ప్రభుత్వం ఒక సున్నీ, ఒక షియా, ఒక ముస్లిం మహిళను రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు నామినేట్ చేస్తుంది. నూతన సవరణలతో కేంద్ర ప్రభుత్వం కొత్తగా ముస్లింలలోని వర్గాలకు చేసే న్యాయం ఏమిటో నర్సయ్య గౌడ్‌కే తెలియాలి.

ఒక్క ముస్లిం వ్యక్తికి కూడా అసెంబ్లీకి గాని, పార్లమెంటుకు గాని టికెట్ ఇవ్వని, ప్రతీ అంశంలో హిందూ ముస్లింల మధ్య విభజన తేవడానికి ప్రయత్నించే బీజేపీ.. ఈ వక్ఫ్ సవరణలతో ముస్లింలలోని వెనుకబడిన వర్గాలకు న్యాయం చేస్తామని ప్రకటించినంత మాత్రాన ముస్లింలు ఎలా నమ్ముతారో నర్సయ్య గౌడ్ చెప్పాలి. వెనుకబడిన ముస్లింలకు బోర్డులో ప్రాతినిధ్యం లభించడం ఏమో కానీ, ప్రస్తుత సవరణతో ఇద్దరు ముస్లిమేతరులను ప్రభుత్వం వక్ఫ్ బోర్డుకి నామినేట్ చేస్తోంది. ముస్లిం ధార్మిక సంస్థలో ఇతర మతస్తుల ప్రవేశం దేనిని సూచిస్తుంది? హిందూ ఎండోమెంట్ సంస్థలలో ముస్లింలకు ఇలా అవకాశం కల్పిస్తారా? హిందూ దేవాలయాల్లో స్వీపర్ పోస్టులో కూడా అన్యమతస్తులు ఉండకూడదని వాదించే బీజేపీకి చెందిన దీనికి బూర నర్సయ్య దీనిని ఎలా సమర్థించుకుంటారు? ప్రస్తుతం 75శాతం వక్ఫ్ భూములు కబ్జా అయ్యాయని, సవరణ చట్టంతో ఈ కబ్జాలను అరికడతామని ఆయన అన్నారు. కానీ ప్రస్తుత సవరణ చట్టం ద్వారా 1995 వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 107, 108, 108Aలు తొలగించడం వలన వక్ఫ్ ఆస్తుల ఆక్రమణదారులు లిమిటేషన్ యాక్ట్ 1963 ప్రకారం తమ కబ్జాలను శాశ్వతపరచుకొని, తద్వారా వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం కావడానికి పూర్తి అవకాశం కలుగుతుంది. సెక్షన్ 108Bను సవరించి వక్ఫ్ రూల్స్ తయారు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాల నుండి కేంద్రం గుంజుకోవడం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం. నూతన చట్టంతో వక్ఫ్ ఆస్తుల ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచి, పేద ముస్లింల సంక్షేమానికి మోదీ ప్రభుత్వం కృషి చేస్తుందని బూర నర్సయ్య అంటున్నారు. అదే నిజమైతే వక్ఫ్ బోర్డుకు వచ్చే కమర్షియల్ లీజ్ రెంటును 7 శాతం నుండి 5 శాతానికి ఎందుకు తగ్గించారు?

కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో వచ్చిన సచార్ కమిటీ తన నివేదికలో పేర్కొన్న వక్ఫ్ నిర్వహణకు సంబంధించిన విషయాలను కేంద్ర మైనారిటీ శాఖ మంత్రితో పాటు నర్సయ్యగౌడ్ వంటి నేతలు పదేపదే ప్రస్తావిస్తున్నారు. మరి, గత పదకొండేళ్ల మోదీ పాలనలో ఒక్కసారైనా సచార్ కమిటీ నివేదికను పరిశీలించారా, ఒక్క సూచననైనా అమలు చేశారా, కబ్జాకు గురైన ఒక్క ఎకరం వక్ఫ్ భూమినైనా స్వాధీనం చేసుకొని వక్ఫ్ బోర్డుకి అప్పగించారా? మచ్చుకైనా లేదు. మరి సచార్ కమిటీ గురించి వల్లె వేయడం రాజకీయాలలో భాగం కాదా?

'పేద ముస్లింల సంక్షేమం' అన్న అందమైన ముసుగు తొడిగిన ఈ నూతన సవరణ చట్టం వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో ముస్లింల పాత్రను తగ్గిస్తుంది. ముస్లిమేతరులు ముఖ్యంగా ప్రభుత్వ తాబేదార్ల ప్రమేయాన్ని పెంచి, లక్షల ఎకరాల వక్ఫ్ భూములను బడా వ్యాపారవేత్తలకు కట్టబెట్టడానికి మార్గం సుగమం చేశారు. దేశహితాన్ని, మత ఐక్యతను కోరేవారు ఎవరూ కూడా ఈ చట్టంలోని ఏ ఒక్క సవరణనూ అంగీకరించడం లేదు.

• సలీమ్ పాష
కన్వీనర్, తెలంగాణ ముస్లిం ఆర్గనైజేషన్స్ జేఏసీ

ఆవిష్కరణల్లో వెనకబడితే భవిష్యత్తులో చోటుండదు!

కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ ఇటీవల అన్న ఒక మాట పలు విమర్శలకు దారితీయటమే గాక, చర్చలకూ తావిచ్చింది. "ఇవాళ భారతదేశంలో గొప్ప స్టార్టప్‌లు ఏమున్నాయి? మన శ్రద్ధ అంతా ఫుడ్ డెలివరీ యాప్స్‌కే పరిమితం! నిరుద్యోగులను చవకగా దొరికే కూలీల్లా తయారు చేసి, వాళ్ళచేత ధనవంతులకు ఇంటిపట్టునే భోజనం అందేలా చేస్తున్నామంతే!"



కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ప్రస్తావించిన సాంకేతిక రంగంలోని ఆవిష్కరణల కొరతను తీర్చాలంటే ప్రభుత్వం చేస్తున్న విధాన ప్రకటనలు అర్థవంతంగా అమలయ్యేట్టు చూడాలి. అప్పుడే మన దేశం పెట్టుబడి ఆధారంగా నడిచే ఆర్థిక వ్యవస్థ నుంచి ఆవిష్కరణల ఆధారంగా నడిచే ఆర్థిక వ్యవస్థగా మారగలదు.

కేంద్రమంత్రి మాటలు వినటానికి కటువుగా ఉండొచ్చు. కానీ అవి మన దేశ స్టార్టప్ వ్యవస్థలో ఉన్న అతి పెద్ద లోపాన్ని ఎత్తిచూపుతున్నాయి. అది– భవిష్యత్తుకు అవసరమైన సాంకేతిక ఆవిష్కరణల కొరత. దేశంలో ఒకపక్క సౌకర్యాల్ని పెంచే స్టార్టప్‌లు పెరుగుతుంటే, మరోపక్క నూతన ఆవిష్కరణల దిశగా ప్రయత్నాలు తగ్గుతున్నాయి. స్టార్టప్ కంపెనీల విషయంలో మన దేశం అమెరికా, చైనాల తర్వాత ప్రపంచంలో మూడో స్థానంలో ఉంది. కానీ, ఈ స్టార్టప్ కంపెనీలు చాలావరకు వినియోగదారుడికి సౌకర్యాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తున్నాయే తప్ప, గొప్ప మార్పు తేగల సాంకేతిక ఆవిష్కరణల దిశగా దృష్టి పెట్టడం లేదు.

దీనికి ముఖ్య కారణం భారత ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా వినియోగం మీద ఆధారపడి నడవటమే. దీనివల్ల పారిశ్రామికవేత్తలందరూ ఎక్కువ స్థాయిలో వినిమయం జరిగే రంగాల వైపే ఆసక్తి చూపుతున్నారు. ఈ–కామర్స్, ఆహారమూ కిరాణా వస్తువుల డెలివరీ, చిరుతిళ్ళ ఉత్పత్తి.. తదితర రంగాలన్నీ ఇందులో భాగమే. ఈ రంగాల్లో పెట్టిన పెట్టుబడికి వెంటనే లాభాలు వస్తాయి కాబట్టి పారిశ్రామికవేత్తలు ఉత్సాహం చూపిస్తున్నారు. కానీ డీప్‌టెక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బయోటెక్నాలజీ, స్పేస్ టెక్నాలజీ.. మొదలైన ఆవిష్కరణలు అవసరమైన రంగాల్లో పెట్టే ప్రయత్నం సాకారం కావటానికి ఎక్కువ సమయం పడుతుంది కాబట్టి పారిశ్రామికవేత్తలు అంతగా అటువైపు వెళ్ళటం లేదు. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రభుత్వం అనేక విధానాలను ప్రకటిస్తున్నది. కానీ అసలైన సవాలు విధానాల రూపకల్పన కాదు, వాటి అమలు.

ఆవిష్కరణల కేంద్రంగా కొనసాగే ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం అనేక ముఖ్యమైన చర్యలు తీసుకున్నది. వీటిలో కొన్ని– నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎన్ఆర్ఎఫ్) స్థాపన, నేషనల్ ఏఐ మిషన్ ప్రారంభం, డీప్‌టెక్ స్టార్టప్‌లను (లోతైన సాంకేతిక ఆవిష్కరణలు అవసరమైన స్టార్టప్‌లను) ప్రోత్సహించేందుకు రూ.10వేల కోట్లతో 'ఫండ్ ఆఫ్ ఫండ్స్' ఏర్పాటు.. మొదలైనవి. అయితే విధాన ప్రకటనలకూ, వాటి అమలుకూ మధ్య పొంతన లేకపోవడమే అసలు సమస్య.

ఉదాహరణకు 2016లో భారత చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు ఆధ్వర్యంలో మొదలైన 'ఫండ్ ఆఫ్ ఫండ్స్' (ఎఫ్ఎఫ్ఎస్) విషయమే తీసుకుందాం. రూ.9,121కోట్లు ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్‌కు ఇస్తామని చెప్పి, ఏప్రిల్ 2023 నాటికి అందులో కేవలం రూ.3,931కోట్లు (43శాతం) మాత్రమే చెల్లించారు. 2018లో యుటిలైజేషన్ రేట్లు మరింతగా తగ్గటంతో ఇస్తామన్న రూ.920కోట్లలో కేవలం రూ.168 కోట్లు (18శాతం) మాత్రమే చెల్లించారు.

ఇదేవిధంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు మద్దతుగా 2020లో రూ.50వేల కోట్ల 'సెల్ఫ్ రిలయంట్ ఇండియా' (ఎస్ఆర్ఐ) ఫండ్‌ను ప్రకటించారు. కానీ దేశంలో నమోదైన దాదాపు 5.93 కోట్ల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో కేవలం 577 పరిశ్రమలు మాత్రమే దీని ద్వారా లబ్ధి పొందాయి. దీన్ని బట్టి లోపం ఎక్కడ ఉన్నదో స్పష్టంగానే తెలుస్తున్నది. సదుద్దేశ్యాలతో నిధుల కేటాయింపు జరుగుతున్నది. కానీ అమలులో వైఫల్యం వల్ల క్షేత్రస్థాయిలో వాటి ప్రభావం అంతంతమాత్రం.

ఇలాంటి సవాళ్ళే మన దేశంలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ రంగాన్నీ వెంటాడుతున్నాయి. 2021–22 కేంద్ర బడ్జెట్‌లో నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు ఐదేళ్ళ కాలానికి రూ.50వేల కోట్లు కేటాయించారు. కానీ 2024–25 నాటికి ఈ కేటాయింపును కేవలం రూ.200కోట్లకు కుదించారు. మరోపక్క రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ రంగంపై 2009–10 సంవత్సరంలో చేసిన మొత్తం వ్యయం జీడీపీలో 0.82శాతం కాగా అది 2020–21 నాటికి 0.64శాతానికి క్షీణించింది. దీనికి భిన్నంగా, చైనా తన జీడీపీలో 2.24శాతాన్ని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌కు కేటాయిస్తుండగా, జర్మనీ, అమెరికా దేశాలు తమ జీడీపీలో 3శాతానికి పైగా ఇందుకు కేటాయిస్తున్నాయి.

కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ప్రస్తావించిన సాంకేతిక రంగంలోని ఆవిష్కరణల కొరతను తీర్చాలంటే ప్రభుత్వం చేస్తున్న విధాన ప్రకటనలు అర్థవంతంగా అమలయ్యేట్టు చూడాలి. అప్పుడే మన దేశం పెట్టుబడి ఆధారంగా నడిచే ఆర్థిక వ్యవస్థ నుంచి ఆవిష్కరణల ఆధారంగా నడిచే ఆర్థిక వ్యవస్థగా మారగలదు.

మొదటగా– మన దేశం దీర్ఘకాలిక దృష్టిగల పెట్టుబడులను పెంచుకోవాలి. త్వరిత లాభాలను ఆశించని, ప్రయోగాలను తట్టుకునే ఇలాంటి పెట్టుబడి డీప్‌టెక్ స్టార్టప్‌లకు ఎంతో అవసరం. మన దేశపు అంతర్గత ఆస్తులు మొత్తం 11.1 ట్రిలియన్ డాలర్లని అంచనా. ఇందులో 65శాతం భౌతిక ఆస్తులుగా ఉన్నాయి. అంటే మన దగ్గర భారీ పెట్టుబడులు ఉన్నాయి గానీ వాటిని కొత్త సాంకేతికతల ఆవిష్కరణకు వినియోగించే ప్రయత్నాలు గానీ, ఆ దిశగా రిస్క్ చేసే తత్వం గానీ ఇక్కడ చాలా తక్కువ. అందుకే, స్థానికంగా పనిచేసే స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల స్థాపన, దీర్ఘకాలిక ఆర్థిక సాధనాలను అమల్లోకి తేవడం, ఏర్పాటు దశలోనే ఎక్కువ కాలం తీసుకునే రంగాలకు పెట్టుబడుల మరలింపును ప్రోత్సహించడం... ఇలాంటి చర్యలు మన దేశంలో ఆవిష్కరణల కొరతను తీర్చగలవు.



రెండోది– డీప్‌టెక్ స్టార్టప్‌ల కోసం కేటాయించిన రూ.10వేల కోట్ల నిధి విషయంలో దరఖాస్తు పద్ధతిని సరళీకరించడం, నిధుల కేటాయింపులో పారదర్శకత, ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్‌కూ స్టార్టప్‌లకూ మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడం చాలా ముఖ్యం.

మూడోది– డీప్‌టెక్ ఆవిష్కరణలలో ప్రైవేటు పెట్టుబడులను పెంచేందుకు పన్ను తగ్గింపు కీలకం. 2024లో చైనా ప్రభుత్వం అక్కడి సాంకేతిక సంస్థలపై 361 బిలియన్ డాలర్ల మేరకు పన్నుల, ఫీజుల తగ్గింపును ప్రకటించింది. ఇందులో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌కు 80.7 బిలియన్ డాలర్ల కేటాయింపు కూడా ఉంది. మరోపక్క, మన దేశం 2025–26 బడ్జెట్‌లో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌లో ప్రైవేటు పెట్టుబడుల ప్రోత్సాహం కోసం కేవలం రూ.20వేల కోట్లను కేటాయించింది. చైనా కేటాయింపుల్లో ఇది ఐదు శాతం కూడా కాదు.

మన దేశ స్టార్టప్ రంగంలో వినియోగదారుల సౌకర్యాన్ని పెంచే ప్రయత్నాలే ఎక్కువ భాగాన్ని ఆక్రమిస్తున్నాయి. వీటి ప్రాముఖ్యాన్ని కాదనలేం. కానీ సాంకేతిక రంగంలో ఇవి మాత్రమే మనల్ని అగ్రస్థానంలో నిలబెట్టలేవు. పైన ప్రస్తావించిన కొన్ని పరిష్కార మార్గాలను అనుసరిస్తే మన స్టార్టప్ వాతావరణం మారుతుంది. ఆవిష్కరణల కొరత తీరుతుంది. కాబట్టి కేంద్రమంత్రి వ్యాఖ్యలు కాస్త కటువుగానే ధ్వనించినా, అవి మరీ అంత సత్యదూరం కావని మనం గుర్తించాలి.

మారుతున్న ప్రపంచ రాజకీయ ఆర్థిక పరిణామాలు కొత్త ద్వారాలను తెరుస్తున్నాయి. ప్రపంచం మొత్తం ఆవిష్కరణలకు కొత్త కేంద్రాల కోసం వెతుకుతున్నది. మన దగ్గర ప్రతిభ ఉంది, మార్కెట్ ఉంది, పెట్టుబడులు ఉన్నాయి. ఇప్పుడు కావాల్సిందల్లా ప్రకటనలను అమలు చేయగల చిత్తశుద్ధి.

నేషనల్ డీప్‌టెక్ స్టార్టప్ పాలసీ ముసాయిదాను ఆమోదించి అమలు చేయటం ఈ దిశగా వేయాల్సిన మొదటి అడుగు. ఈ పాలసీకి సమర్థవంతమైన అమలు ప్రక్రియను కూడా జోడిస్తే మన దేశం నిరుద్యోగులను చవకగా దొరికే కూలీల్లా వాడుకునే దేశంగా మిగిలిపోదు. భవిష్యత్తుకు అవసరమైన సాంకేతికతలను సరఫరా చేసే యువత గల దేశంగా తయారవుతుంది

■ లావు శ్రీకృష్ణదేవరాయలు
నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు

శ్రామిక వర్గ కోణంలో 'సుంకాల యుద్ధం'

కొన్ని వారాలుగా, వార్తల్లో వినవస్తున్న మాటలు: 'సుంకాలు!', 'ప్రతీకార సుంకాలు!', 'సుంకాల యుద్ధం!'

'సుంకాలు' అంటే, తేలిక మాటల్లో, చెప్పాలంటే, ప్రభుత్వాలకు చెల్లించవలిసిన 'పన్నులే!' ఒక దేశం తన సరుకుల్ని ఇంకో దేశానికి ఎగుమతి చేస్తే, దానికోసం తన ప్రభుత్వానికి కొంత పన్ను కట్టాలి. అది ఎగుమతి సుంకం. ఆ సరుకుల్ని దిగుమతి చేసుకున్న వేరే దేశపు వ్యాపారి కూడా తన ప్రభుత్వానికి కొంత పన్ను కట్టాలి. అది దిగుమతి సుంకం. ఆ ఎగుమతి సుంకమూ, ఈ దిగుమతి సుంకమూ రెండూ కూడా, పెట్టుబడిదారీ విధానంలో, సరుకు ధరలో భాగాలే!

ఇప్పుడు 'సుంకాల యుద్ధం' అనే మాట ఎందుకు మొదలైందంటే, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇతర దేశాల నించీ అమెరికాకు వచ్చే సరుకుల మీద ఇప్పటికే వున్న దిగుమతి సుంకాల్ని బాగా పెంచేశాడు– అని! దానికి అతను చెప్పే కారణాలు ఏమిటంటే, 'ఇన్నాళ్ళూ ఇతర దేశాలు అమెరికా నించీ దిగుమతి చేసుకున్న సరుకుల మీద భారీ సుంకాలు విధిస్తున్నాయి. అమెరికా మాత్రం ఇన్నాళ్ళూ విదేశాల నించీ వచ్చే సరుకుల దిగుమతుల మీద భారీ సుంకాలు వెయ్యలేదు. దాని వల్ల, అమెరికాకు చాలా ఆదాయం రాకుండా పోతున్నది. పైగా ఆ ఇతర దేశాల సరుకుల దిగుమతి వల్ల, జనాలు దిగుమతుల మీదే ఆధారపడతారు. అమెరికాలో పరిశ్రమల అభివృద్ధి జరగదు. అమెరికా నించీ ఎగుమతులు తక్కువై, దిగుమతులు ఎక్కువైతే అమెరికాకు నష్టం కదా!' ఇవీ ట్రంపు మాటలు! ఈ రకపు వాదనల్ని, పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రం భాషలో, 'రక్షణ వాదం' అనీ, 'రక్షణ సుంకాలు' అనీ అంటారు. స్వదేశంలోనే పరిశ్రమల్ని అభివృద్ధిపరిచి, దేశ ప్రజలకి ఆ పరిశ్రమల్లోనే ఉద్యోగాలు కల్పిస్తానని, ట్రంప్ చెప్పే మాటలు మంచివిగానే కనపడతాయి. కానీ, ఈ 'మంచి' అనేక ఇతర విషయాల్ని బట్టి వుంటుంది.

నిజానికి పెట్టుబడిదారీ ఆర్థిక విధానానికి స్వతహాగా వున్న లక్షణం ఏమిటంటే, ఒక దేశంలో తయారయ్యే సరుకులు ఆ దేశ సరిహద్దులు దాటి, ప్రపంచమంతటా, ఎటువంటి నిబంధనలూ, అడ్డంకులూ లేకుండా అమ్మకాలు జరగాలి– అని! దీన్నే 'స్వేచ్ఛా వ్యాపారం' అంటారు. ఇందులో, సుంకాల సమస్య ఘర్షణగా వుండదు. ఏ ఖర్చు ఎంత అవసరం అయితే, అంతకు మించి చేరదు. కానీ, పెట్టుబడిదారీ విధానానికి పుట్టుకతో వున్న అసలు జబ్బు 'పోటీ'. ఈ పోటీలో నెగ్గుకు రావడానికి, కొన్ని దేశాలలోని పెట్టుబడిదారులు వేసే ఒక ఎత్తుగడ ఈ 'రక్షణ సుంకాలు'. ఇప్పుడు ట్రంప్ ప్రారంభించిన ఈ సుంకాల యుద్ధం కూడా అలాంటి ఎత్తుగడే!

పెట్టుబడిదారీ విధానానికి పుట్టుకతో వున్న అసలు జబ్బు 'పోటీ'. ఈ పోటీలో నెగ్గుకురావడానికి, కొన్ని దేశాలలోని పెట్టుబడిదారులు వేసే ఒక ఎత్తుగడ ఈ 'రక్షణ సుంకాలు'. ఇప్పుడు ట్రంప్ ప్రారంభించిన ఈ సుంకాల యుద్ధం కూడా అలాంటి ఎత్తుగడే! ఈ సుంకాల యుద్ధం అంతా అసలు వేరు వేరు దేశాల పెట్టుబడిదారుల మధ్య లాభాల పెంపు కోసం జరుగుతున్న పోటీ మాత్రమేననే సంగతిని పత్రికల్లోనూ, టీవీల్లోనూ, మేధావులు ఇప్పటికీ అర్థం చేసుకోలేకపోతున్నారు.

ఇప్పుడు, పత్రికల్లోనూ, టీవీల్లోనూ చర్చలన్నీ ట్రంప్ ప్రకటించిన దిగుమతి సుంకాల పెంపుల గురించే! దిగుమతి సుంకాలు ఎక్కువైతే, ధర పెరిగి, మిగిలే లాభం తక్కువ. సుంకాలు తక్కువ అయితే, ధర తగ్గి, మిగిలే లాభం ఎక్కువ! ట్రంపు పెంచిన సుంకాలు వేరు వేరు దేశాల మీద వేరు వేరు శాతాలుగా వున్నాయి గదా? వీటి వల్ల భారతదేశానికి ఎంత నష్టం, ఎంత లాభం? భారతదేశం కంటే, చైనా వంటి ఇతర దేశాల మీద ఎక్కువ సుంకాలు వెయ్యడం వల్ల, ఆ దేశాల్లో పరిశ్రమలు పెట్టిన పెట్టుబడిదారులు, ఆ పరిశ్రమల్ని అక్కణ్ణించీ తక్కువ సుంకాలు గల భారతదేశానికి తరలించే అవకాశాలు ఏ రంగంలో ఎక్కువ వుంటాయి? – ఇలాంటి చర్చలే జరుగుతున్నాయి. ఈ సుంకాల యుద్ధం అంతా అసలు వేరు వేరు దేశాల పెట్టుబడిదారుల మధ్య లాభాల పెంపుల కోసం జరుగుతున్న పోటీ మాత్రమేననే సంగతిని పత్రికల్లోనూ, టీవీల్లోనూ, మేధావులు ఇప్పటికీ అర్థం చేసుకోలేకపోతున్నారు.



మార్క్సు, ఎప్పుడో, 1847లో రాసిన, 'రక్షణ సుంకాలూ, స్వేచ్ఛా వ్యాపారమూ, కార్మికవర్గమూ' అనే వ్యాసంలో ఈ విషయాన్నే గ్రహించి చెప్పాడు, ఇలా: "రక్షణాత్మక సుంకాల వ్యవస్థ ఒక దేశంలో వున్న పెట్టుబడి చేతుల్లో, ఇతర దేశాల పెట్టుబడిని ప్రతిఘటించే, ఆయుధాలను ('వెపన్స్') పెడుతుంది; ఇది విదేశీ పెట్టుబడికి వ్యతిరేకంగా స్వదేశ పెట్టుబడి శక్తిని పెంచుతుంది." అయితే, రక్షణ సుంకాల సమర్థకుల వాదన ఎలా వుంటుందని మార్క్సు చెబుతాడంటే, 'విదేశీయుల సరుకులు కొనడం ద్వారా, వాళ్ళ చేతుల్లో దోపిడీకి గురి అవడం కంటే, స్వదేశస్తుల ('ఫెలో–కంట్రీమెన్') చేతుల్లో దోపిడీకి గురిఅవడం మేలు ('బెటర్')'– అని కార్మికులకు చెపుతారట, ఆ సమర్థకులు!

సుంకాల యుద్ధాలు వేరు వేరు దేశాల శ్రామిక ప్రజల్లో అక్కడి ప్రభుత్వాల పట్ల కొన్ని రాజకీయ భ్రమల్ని కూడా కలిగిస్తాయి. ఎలాగంటే, దిగుమతి సుంకాల్ని పెంచిన దేశాల్లో జనాలు ఇలా అనుకుంటారు: "మన ప్రభుత్వం, విదేశీ సరుకుల మీద ఎక్కువ సుంకాలు వెయ్యడమే మంచిది. దానివల్ల ఆ సరుకులకు ధరలు పెరిగి, వాటిని జనం కొనరు. క్రమంగా, దిగుమతులు తగ్గిపోతాయి. దానివల్ల, మన దేశంలోనే సరుకులు తయారై, మన పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయి. అంటే, మన నిరుద్యోగులకి ఎన్నో ఉద్యోగాలు వస్తాయి. కాబట్టి, మనం మన ప్రభుత్వ విధానాల్ని సమర్థించాలి" అనే అర్థాలకు వస్తారు. ఇతర దేశాలకు సరుకుల్ని ఎగుమతి చేసే దేశాలలోని కార్మికులేమో, "మన దేశం నించీ అక్కడికి వెళ్ళే సరుకులమీద దిగుమతి చేసుకునే ఆ దేశాలు భారీ సుంకాలు వేస్తే, అక్కడ మన సరుకులు కొనేవాళ్ళు తగ్గిపోతారు. అలా జరిగితే, ఇక్కడి పరిశ్రమల యజమానులు, తమ సరుకుల ఎగుమతులు ఎక్కువగా జరగవు గనక ఉత్పత్తులు తగ్గిస్తారు. అప్పుడు, మనలో చాలా మందికి ఉద్యోగాలు పోతాయి. కాబట్టి, మన ఎగుమతుల మీద అక్కడ దిగుమతి సుంకాలు ఎక్కువగా పడకుండా ప్రయత్నించే మన ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలి" అనుకుంటారు.

రక్షణ సుంకాల విధానంవల్ల, ప్రపంచ దేశాలలోని కార్మికులందరూ దేశాల వారీగా విడిపోయి వేరు వేరుగా ఆలోచిస్తారు. వారిలో ఐక్యతకు ఇది పెద్ద అడ్డు. సుంకాల నిజాల్ని అర్థమే చేసుకోరు.

విదేశీ వర్తకంలో రక్షణ సుంకాలకు భిన్నమైన వాదన కూడా ఒకటి వుంది. అదే, స్వేచ్ఛా వ్యాపారం! అంటే, 'వర్తకం అనేది, ఎటువంటి నిబంధనలూ లేకుండా, సుంకాల పెంపులు లేకుండా, దేశాల సరిహద్దులు దాటి స్వేచ్ఛగా జరగాలి' అన్నదే ఈ వాదన సారాంశం. శ్రామిక జనాల దృష్టితో చూస్తే, రక్షణ సుంకాల విధానాన్ని సమర్థించాలా, స్వేచ్ఛా వ్యాపారాన్ని సమర్థించాలా అన్న ప్రశ్న వచ్చినప్పుడు, రెంటినీ వ్యతిరేకించాలంటాడు ఎంగెల్సు. కాకపోతే, రెంటినీ పోల్చినప్పుడు, స్వేచ్ఛా వ్యాపార విధానం అనేది, 'జాతుల మధ్యా, దేశాల మధ్యా వున్న అడ్డంకుల్ని ('బారియర్స్'ని) బద్దలుకొట్టి, ప్రపంచ వ్యాప్తంగా శ్రామిక వర్గానికీ– పెట్టుబడిదారీ వర్గానికీ మధ్య వున్న వైరుధ్యాన్ని మరింతగా తీవ్రతరం ('పుషెస్ టు యాన్ ఎక్స్ట్రీమ్ పాయింట్') చేస్తుందనీ, ఆ రకంగా అది సామాజిక విప్లవాన్ని ఒక రకంగా త్వరితం చేసే అవకాశం వుంటుందనీ మార్క్సు అంటాడు. అంటే, వేరే మాటల్లో చెప్పాలంటే, అన్ని దేశాల పెట్టుబడులూ, అన్ని దేశాల కార్మికులనూ దోస్తున్నాయి అనే వర్గ చైతన్యం తీసుకురావడానికి అవకాశం వుంటుంది అని!


అసలు గ్రహించవలిసిన విషయం ఏమిటంటే, స్వదేశీ వర్తకమైనా, విదేశీ వర్తకమైనా, వర్తకుడికి వచ్చేది సరుకు ధరలో నించి 'కమిషను'! ఆ కమిషను, ఆ వర్తకం ఏ సరుకుతో జరుగుతుందో ఆ సరుకులో వుండే కార్మికుల 'అదనపు విలువ'లో భాగమే తప్ప ఇంకెక్కడినించో రాదు. అంటే, శ్రమ దోపిడీ నించీ అన్నమాట! స్వదేశీ సరుకుల ద్వారా సంపాదించే కమిషను, స్వదేశీ కార్మికుల అదనపు విలువ అయితే, విదేశీ సరుకుల ద్వారా సంపాదించే కమిషను, విదేశీ కార్మికుల అదనపు విలువ. 'వర్తకం' అనేది– స్వదేశీ వర్తకమైనా, విదేశీ వర్తకమైనా; మొత్తం అన్ని దేశాల వర్తకాల్నీ కలిపి చూస్తే, 'ప్రపంచ వర్తక లాభాలన్నీ', ప్రపంచ కార్మికుల అదనపు విలువలలో భాగమే. అందుకే, 'ప్రపంచ కార్మికులారా ఏకం కండి!' అనే నినాదం పుట్టింది!



ఏ సమస్యని అయినా, పెట్టుబడిదారీ కోణంలో కాదు, శ్రామికవర్గ కోణంలో చూస్తేనే, అసలు నిజం కనపడుతుంది!

కానీ, మన మేధావులు ఇంకా మేల్కొవడం లేదు!

■ రంగనాయకమ్మ



చూసావా

చూసావా
చిగురుటాకులా వణుకుతున్న
జనజీవన దృశ్యం
అమాయకప్రాణాలే
కుంచెలై గీసిన రక్తవర్ణచిత్రం
నాగరిక సమాజానికి
తగిలిన పెనుగాయం
గణతంత్ర వ్యవస్థ పాడిన
మహా విషాద గేయం

చూసావా
సర్వోన్నత జాతికి హేయం
స్వేచ్ఛగా యథేచ్ఛగా
గుండాలు గుద్దులిమిన
హింసాకాండ నిర్వహణలో
నేరజ్వాల రగిల్చిన
భయానక మృత్యురవళి

చూసావా
ఎడతెగని హింస
క్షతగాత్రమైన శాంతిహంస
కుల మత వర్గ వర్ణ తెగ కాంక్ష
విశ్వశ్రేయాన్ని బలిపెడితే
కుత్తుకలు తెగిపడి రక్తాలు ధారకట్టి
అశాంతి చెలరేగితే
కంటక రహదారికి దారి చూపేది
లౌకిక భువన భవన
నిర్మాణానికి రాళ్లెత్తేకూలీలు
విశాల భారత నందన వనమాలీలు

– కోటం చంద్రశేఖర్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి,
ప్లాట్–76, అశ్వినీ లే ఔట్,
హుడా హైట్స్, రోడ్ నంబరు–70,
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్:
editpage@andhrajyothy.com



బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 39.2 కనిష్ఠం 27.2


సీవర్ క్రోక్ యంత్రం పనితీరును పరిశీలిస్తున్న ఇలంబరిది, రంగనాథ్



పాసయ్యామా.. ఫెయిలయ్యామా..!

- మూడు నెలలైనా మొదటి సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల చేయని జేఎన్‌టీయూ
- అటానమస్ కాలేజీల విద్యార్థుల ఆందోళన

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అటానమస్ ఇంజనీరింగ్ కాలేజీల్లో సెమిస్టర్ ఫలితాల ఆలస్యం విద్యార్థులను, తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది. జనవరిలో జరిగిన మొదటి సెమిస్టర్ పరీక్షలు ముగిశాయి. పరీక్షలు జరిగి మూడునెలలైనా ఇప్పటి వరకు ఫలితాలు విడుదల చేయకపోవడం, మరో రెండు రోజుల్లో రెండో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం అవుతుండడంతో ఫలితాలపై విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. సాధారణంగా పరీక్షలు ముగిసిన 40 రోజుల్లో ఫలితాలు ప్రకటించే వారు. ఈసారి 80 రోజులు దాటినా జేఎన్‌టీయూ అధికారులు, అటానమస్ కాలేజీల సిబ్బంది ఫలితాల ఊసెత్తకపోవడంతో తల్లిదండ్రులు హైరానా పడుతున్నారు. రెండవ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ రావడంతో మొదటి సెమిస్టర్‌లో తమ పిల్లలు పాసైనట్టా, ఫెయిలైనట్టా అని అయోమయానికి గురవుతున్నారు. జేఎన్‌టీయూ పరీక్షల విభాగం సకాలంలో ఫలితాలను ఇవ్వలేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జేఎన్‌టీయూకు అఫిలియేషన్ కలిగిన 140 ఇంజనీరింగ్ కాలేజీల్లో దాదాపు 80 కళాశాలలకు అటానమస్ హోదా ఉంది.

అటానమస్ కాలేజీలపై అనుమానాలు

అటానమస్ కాలేజీలపై కొత్తగా వచ్చిన వైస్‌చాన్స్‌లర్, డైరెక్టర్లు లేనిపోని అనుమానాలు, అపోహలు వ్యక్తం చేస్తున్నారని కొన్ని కళాశాలల యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. సెమిస్టర్ పరీక్షలు పూర్తయి, ఫలితాలను సిద్ధం చేశాక, వాటిని తాము అంగీకరించం అంటూ మోకాలడ్డుతున్నారని ప్రిన్సిపాల్స్ సైతం వాపోతున్నారు. అటానమస్ హోదా ఇచ్చి ఫలితాలను నిలిపేస్తే కళాశాల పరువు, ప్రతిష్ఠలకు భంగం వాటిల్లుతుందని చెబుతున్నారు. తప్పు చేసిన వాటిపై చర్యలు తీసుకోవాలని, అటానమస్ కాలేజీలను యూనివర్సిటీ వర్గాలు అలుసుగా చూడడం సబబు కాదంటున్నారు.

లక్షమంది విద్యార్థులపై ప్రభావం

జేఎన్‌టీయూ నుంచి అటానమస్ హోదా పొందిన కాలేజీల్లో సుమారు లక్షమంది విద్యార్థులు చదువుతున్నారు. బాచుపల్లిలోని

మిగతా 6వ పేజీలో..

గంజాయి నై.. హాషిష్ ఆయిల్ హై!

రూటు మారుస్తున్న స్మగ్లర్లు

- హాషిష్ ఆయిల్ విక్రయానికి ఆసక్తి
- రవాణా సులభం కావడమే కారణం
- రైలు, బస్సు మార్గాల్లో నగరానికి
- కిలో రూ. 2లక్షలకు కొని రూ. 10 లక్షలకు విక్రయం



ఊబిలోకి విద్యార్థులు

గంజాయికి అలవాటుపడిన కొందరు విద్యార్థులు దాని స్థానంలో హాషిష్ ఆయిల్‌ను వ్యసనంగా మార్చుకుంటున్నారు. కొద్దిరోజుల తర్వాత విక్రయదారులతో పరిచయం పెంచుకొని స్మగ్లర్లుగా మారుతున్నారు. కళాశాలలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోనే హాషిష్ ఆయిల్ ముఠాలు ఇటీవల పట్టుబడుతుండడం గమనార్హం.

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో హాషిష్ ఆయిల్ మత్తు మాఫియా చాపకింద నీరులా విస్తరిస్తోంది. పోలీసులు దాడులు చేస్తూ డ్రగ్స్ గంజాయి మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతున్నా కొత్త కొత్త మార్గాల్లో స్మగ్లర్లు మత్తు దందాను విస్తరిస్తున్నారు. నెలకు రూ.100 కోట్లకు పైగా మత్తు మాఫియా వ్యాపారం నగరంలో జరుగుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. గతంలో ఈ సంఖ్య రూ.500 కోట్ల వరకు ఉండేది. ఇటీవల నార్కోటిక్, హెచ్ న్యూ, టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్‌వోటీ పోలీసులు ఆకస్మికదాడులతో మాదక ద్రవ్యాల సరఫరా కొంత తగ్గుముఖం పట్టింది. గతంలో గంజాయిని ఎక్కువగా సరఫరా చేసిన స్మగ్లర్లు ఇప్పుడు గంజాయి ఆయిల్(హాషిష్ ఆయిల్)ను సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దాన్ని వాటర్ బాటిల్, పాలిథిన్ కవర్లలో కిలోల చొప్పున నింపి బ్యాగుల్లో పెట్టుకొని సులభంగా బస్సులు, రైళ్లు, ప్రైవేట్ వాహనాల్లో రవాణా చేసే అవకాశం ఉండటంతో స్మగ్లర్స్ హాషిష్ ఆయిల్ రవాణాకు మొగ్గు చూపుతున్నారు. కిలో హాషిష్ ఆయిల్‌ను తయారు చేయడానికి సుమారు 50 కిలోల గంజాయి మరపట్టాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారు. అంటే ఒక కిలో హాషిష్ ఆయిల్ అర క్వింటాల్ గంజాయితో సమానం అన్నమాట. నగరంలో ఇటీవల పోలీసులకు చిక్కుతున్న ముఠాల్లో ఎక్కువగా హాషిష్ ఆయిల్‌ను విక్రయిస్తున్న స్మగ్లర్స్ ఉండటం గమనార్హం.

మచ్చుకు కొన్ని..

- బీఎస్సీ చదివిన యువకుడు ఈజీ మనీకి అలవాటు పడి గంజాయి స్మగ్లర్‌గా మారాడు. స్నేహితుడితో కలిసి ముఠాగా ఏర్పడి

మిగతా 6వ పేజీలో..

వరద నీటి కాలువల్లో సీవర్ క్రోక్‌తో వ్యర్థాల తొలగింపు

- రోబోటిక్ పరిజ్ఞానంతో పనిచేయనున్న యంత్రం
- పనితీరును పరిశీలించిన ఇలంబరిది, ఏవీ రంగనాథ్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వరద నీటి డ్రెయిన్లలో వ్యర్థాలను తొలగించేందుకు రోబోటిక్ పరిజ్ఞానం వినియోగాన్ని ప్రభుత్వ విభాగాలు పరిశీలిస్తున్నాయి. సీవర్ క్రోక్ రోబోటిక్ యంత్రం పనితీరును జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబరిది, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. సచివాలయం ఎదుట ఉన్న డ్రెయిన్లలో ప్రయోగాత్మకంగా యంత్రం పనితీరును పరీక్షించారు. రోబోటిక్, వాటర్ జెట్ శక్తితో నడిచే పరికరం.. పైపులైన్లు, డ్రెయిన్లలో మట్టిని తొలగిస్తుంది. వాటర్ జెట్ టర్బైన్‌ను తిప్పడంతో ముందుకు వెళ్లే యంత్రంలోని బ్లేళ్లు చెత్తను బయటకు తీసుకువస్తాయి. మ్యాన్ హోళ్లు, క్యాచ్‌పిట్లలో మనుషులు దిగే అవసరం లేకుండా వ్యర్థాలు తొలగించే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వర్షం పడితే రోడ్లు జలమయం కావడం.. పలు ప్రాంతాల్లో మురుగు నీరు పొంగి పొర్లుతుండడంతో పౌరులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వరద ప్రవాహం సాఫీగా సాగేలా వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని భావిస్తున్నారు. యంత్రాల ద్వారా ఈ ప్రక్రియను సులభంగా చేపట్టవచ్చన్నది అధికారుల ఆలోచన. వర్షాకాలం రానున్న నేపథ్యంలో బాక్స్ డ్రెయిన్లలో ఈ యంత్రంతో వ్యర్థాలు తొలగించడం సాధ్యమా..? అన్నది పరిశీలించి నిర్ణయం తీసుకోనున్నట్టు ఓ అధికారి తెలిపారు.

మైనర్ డ్రైవింగ్‌పై కొరడా

- 275 కేసులు నమోదు
- పట్టుబడిన 35 వాహనాల రిజిస్ట్రేషన్ రద్దు



6

'సుంకిశాల' పనుల్లో నిర్లక్ష్యం వద్దు

- రిటైనింగ్ వాల్ శిథిలాలను వేగంగా తొలగించండి
- వాటర్ బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి



6



మే 4 నుంచి జేఎన్‌టీయూకు సెలవులు





ఎమ్మెల్సీ ఓటింగ్

హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి బుధవారం ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో బీజేపీ, ఎంఐఎం అభ్యర్థులు పోటీలో నిలిచారు. జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో జరిగిన ఓటింగ్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతోపాటు పలువురు ప్రజా ప్రతినిధులు ఓటుహక్కు వినియోగించుకున్నారు.



పీపుల్స్ ప్లాజా వద్ద కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలుపుతున్న ప్రజలు

ఉగ్ర దాడికి నిరసన

జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ బుధవారం నగరంలో పలు ప్రాంతాల్లో ప్రజలు, నాయకులు, సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలుపుతూ కొవ్వొత్తుల ప్రదర్శనలు నిర్వహించారు. ఉగ్రవాదుల దిష్టిబొమ్మలను దహనం చేసి మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు.

పీహెచ్‌డీ సీట్ల అమ్మకాలపై విచారణ జరిపించండి

- ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డికి టీపీఎల్‌ఎఫ్ వినతి



6



భానుడి భగభగ

- పలు ప్రాంతాల్లో 42 డిగ్రీల నమోదు

6



ఫుల్ జోష్!



ఉప్పల్ స్టేడియంలో బుధవారం ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ పరాజయం పాలైంది. మ్యాచ్ ఫలితం ఎలావున్నా అభిమానులు మ్యాచ్ ఆసాంతం ఆస్వాదించారు. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి ఇరుజట్ల క్రీడాకారులు, స్టేడియంలోని వేలాది మంది ప్రేక్షకులు నివాళులర్పించారు.



ఆంధ్రజ్యోతి ద్వారా మిమ్ములను అభిమానించే వారికి, శ్రేయోభిలాషులకు, మిత్రులకు శుభాకాంక్షలు తెలియజేయండి
ADVERTISEMENTS
జన్మదిన వేడుకలు
విదేశీయాన శుభాకాంక్షలు
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు
వివాహ శుభాకాంక్షలు
స్వదేశాగమన శుభాకాంక్షలు
మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి.
ప్రతి ప్రకటనపై GST 5% వర్తిస్తుంది.

జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, సనత్‌నగర్	: 99854 00084
కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి	: 99854 11086
ముషీరాబాద్, అంబర్‌పేట	: 99859 21362
దిల్‌సుఖ్‌నగర్, ఎల్.బి.నగర్	: 99854 02786
కుత్బుల్లాపూర్	: 99859 21366
సికింద్రాబాద్	: 99859 21364
అబిడ్స్	: 99854 03628
మెహిదీపట్నం	: 97036 18721
చార్మినార్	: 99859 21389

రేపే బ్రహ్మాండమైన విడుదల



సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.15,2.30,6.15,9.30

రేపే బ్రహ్మాండమైన విడుదల
అన్ని థియేటర్లలో టికెట్ రేటు 112/- మాత్రమే



లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్ 11.15am
వెంకటేశ్వర 70 - గుమ్మడిదల 11.00,2.00,6.00,9.00
MEGANA FILMS 9246585220

రేపే బ్రహ్మాండమైన విడుదల



పీవీఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ 11.40am
శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 11.50am
మీరజ్ సినిమాస్ - చందానగర్ 11.50am
SRI SAI VISUAL HOUSE 9849153511/7013388396

రేపే బ్రహ్మాండమైన విడుదల




సప్తగిరి 70 - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.00,6.00,9.00
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND



సుదర్శన్ 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.15,6.00,9.15

రేపే బ్రహ్మాండమైన విడుదల




దేవి 70 - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.15,6.00,9.15
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
అంజలి 70 - సికింద్రాబాద్ 11.15,2.15,6.15,9.15
ONE FLAG ENTERTAINMENT 9849703118

నగరంలో భానుడి భగభగలు

● ఎండ తీవ్రతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): భానుడి భగ.భగలతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. గత రెండు రోజులుగా నగరంలో పగటిఉష్ణోగ్రతలు 42 డిగ్రీలు నమోదు కాగా, బుధవారం మలక్‌పేట ముసారాం బాగ్, బోయిన్‌పల్లి, ఉప్పల్ ప్రాంతాల్లో 42.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. మియాపూర్, అత్తాపూర్, నాచారం, వినాయకనగర్, బాలాజీనగర్ ప్రాంతాల్లో 42 డిగ్రీలు... అంబర్‌పేట, మెహిదీపట్నం, ముషీరాబాద్, న్యూమెట్టుగూడ ప్రాంతాల్లో 41.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మధ్యాహ్నం వడగాలులు వీచడంతో ప్రధాన రహదారులపై వాహనాల సంఖ్య సగానికిపై తగ్గిపోయింది. ఉదయం 9 గంటల నుంచే ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఏప్రిల్ 30 నాటికి ఉష్ణోగ్రతలు 1-2 డిగ్రీలు పెరిగే అవకాశముంటుందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. రాత్రి ఉష్ణోగ్రతలు 27.2 డిగ్రీల వరకు నమోదవుతుండటంతో వేడిగాలుల ప్రభావం రాత్రిళ్ల కొనసాగుతుంది. కాగా, గతేడాది ఏప్రిల్ 23న గ్రేటర్‌లోని పలు ప్రాంతాల్లో 43 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఈనెల 26న బ్రహ్మాండమైన విడుదల




లక్ష్మీకళ సినీప్లెక్స్ 70 ఎ/సి - మూసాపేట్
ఎ.ఎం.బి సినిమాస్ ఎ/సి - గచ్చిబౌలి
ఏషియన్ సత్యం ఎ/సి - అమీర్‌పేట్
DEEPA ARTS

రేపే బ్రహ్మాండమైన విడుదల



రేపే బ్రహ్మాండమైన విడుదల



GANESH BHARI 9296509333



దేవి 70 ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 6.00,9.15
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

పాసయ్యామా.. ఫెయిలయ్యామా..!

(5వ పేజీ తరువాయి)

పేరొందిన ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ ఫస్టియర్ నుంచి ఫైనలియర్ మొదటి సెమిస్టర్ వరకు ఏ ఒక్కరి ఫలితాలను జేఎన్‌టీయూ విడుదల చేయలేదు. సకాలంలో పరీక్షలు, నిక్కచ్చిగా మూల్యాంకనం చేస్తారనే పేరున్న నిజాంపేట్‌లోని మరో రెండు కాలేజీల్లోనూ ఫస్టియర్ ఫలితాలను జేఎన్టీయూ అధికారులు ఇవ్వలేదు. ఇబ్రహీంపట్నం, శంషాబాద్, మైసమ్మగూడ ప్రాంతాల్లోని మరికొన్ని కాలేజీల విద్యార్థుల ఫలితాలు కూడా రాకపోవడంతో ఆయా కాలేజీల ప్రిన్సిపాల్స్ జేఎన్‌టీయూ పరీక్షల విభాగం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గతంలో ఫలితాలు ఇచ్చేముందు సంబంధిత అధికారులు పేరున్న కాలేజీల్లో ఒకటో, రెండో మేనేజ్‌మెంట్ కోటా సీట్లు తమకు ఫ్రీగా కావాలని అడిగేవాళ్లని, ఈ దఫా అడిగినా అభ్యంతరం చెప్పేవాళ్లం కాదంటున్నారు. అయినప్పటికీ విద్యార్థుల ఉత్తీర్ణతాశాతాన్ని తగ్గించాలని ఒత్తిడి చేయడమేంటని ప్రశ్నిస్తున్నారు. పాసైన విద్యార్థులను ఫెయిల్ చేస్తే వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఈ విషయమై వర్సిటీ ఉన్నతాధికారి ఒకరు స్పందిస్తూ.. అటానమస్ కాలేజీల్లో సెమిస్టర్ ఫలితాల పరిశీలన నిమిత్తం అధికారులతో కమిటీ వేశామని, రోజుకు రెండు మూడు కాలేజీల ఫలితాలను మాత్రమే విడుదల చేస్తున్నామని చెప్పారు.

గంజాయి నై.. హాషిష్ ఆయిల్ హై!

(5వ పేజీ తరువాయి)

హైదరాబాద్ సహా పలు ప్రాంతాలకు హాషిష్ ఆయిల్ (గంజాయి నూనె) సరఫరా చేస్తున్నాడు. ఇటీవల రాచకొండ పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యారు. ఇద్దరు స్మగ్లర్స్‌ను అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి రూ. 80లక్షల విలువైన 4 కిలోల హాషిష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

- సీలేరు నుంచి హైదరాబాద్‌కు హాషిష్ ఆయిల్‌ను సరఫరా చేసి గుట్టుగా విక్రయిస్తున్న ముఠా ఆటకట్టించారు సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు. వారి నుంచి 500 గ్రాముల హాషిష్ ఆయిల్ స్వా ధీనం చేసుకున్నారు.
- ఏపీ అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సుల్లో హాషిష్ ఆయిల్ (గంజాయి నూనె) సరఫరా చేస్తున్న ఇద్దరు స్మగ్లర్స్‌ను రాచకొండ ఎస్‌వోటీ, పోచంపల్లి పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ. 1.52 కోట్ల విలువైన 10.2 కిల్లో హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. గోవిందరాజు, రాంబాబు అనే స్నేహితులు 10.2 కిలోల హాషిష్ ఆయిల్‌ను బ్యాగుల్లో పెట్టుకొని ఆర్టీసీ బస్సులో సిటీకి వచ్చారు. రాచకొండ శివారులో బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు.
- మరో కేసులో ఏవోబీ (ఆంధ్రా ఒడిశా బార్డర్) నుంచి బెంగళూరుకు గుట్టుగా హాష్ ఆయిల్ స్మగ్లింగ్ చేస్తున్న ఇద్దరు అన్నదమ్ముల ఆట కట్టించారు రాచకొండ పోలీసులు. వారి వద్ద నుంచి రూ.1.08 కోట్ల విలువైన 13.5 కిలోల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ బహిరంగ మార్కెట్లో రూ. 14 కోట్లు ఉంటుందని పోలీసులు వెల్లడించారు.



ఇటీవల రాచకొండ ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్న హాషిష్ ఆయిల్ డబ్బాలు

గంజాయిని మరపట్టి..

విశాఖ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, అరకు, ఒడిశా ఇలా అనేక ప్రాంతాల్లోని గంజాయి సరఫరాదారులు, స్మగ్లర్స్ విజ్ఞప్తి మేరకు గంజాయిని మరపట్టి తైలం తీస్తారు. దానికి పెట్రోలియం ఈథర్ అనే కెమికల్‌ను కలిపి హాషిష్ ఆయిల్‌గా తయారు చేస్తున్నారు. ఇది డ్రై గంజాయి కన్నా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. 50 కిలోల గంజాయితో సమానమైన కిలో హాషిష్ ఆయిల్‌ను రూ. 2 లక్షలకు స్మగ్లర్స్‌కు ఇస్తున్నారు. దాన్ని సిటీకి తరలిస్తున్న స్మగ్లర్స్. 5 ఎంఎల్ డబ్బాల్లో నింపి ఒక్కో డబ్బాను రూ.5 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇలా కిలో హాషిష్ ఆయిల్ ద్వారా రూ. 10 లక్షలు సంపాదిస్తున్నట్లు పోలీసులు తేల్చారు.

రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ సభ్యుడిగా రవీన్‌కుమార్ రెడ్డి



రవీన్‌కుమార్ రెడ్డి

అడ్డగుట్ట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ బెంచ్ సభ్యుడిగా కె. రవీన్‌కుమార్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రైల్వేలో మూడు దశాబ్దాలుగా వివిధ హోదాల్లో పనిచేస్తున్న రవీన్ కుమార్‌రెడ్డిని రైల్వే బోర్డు సికింద్రాబాద్ రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ బెంచ్ సభ్యుడిగా నియమించింది. 1988 ఐఆర్‌టీఎస్ బ్యాచ్‌కు చెందిన రవీన్‌కుమార్‌రెడ్డి ఇప్పటి వరకు న్యూఢిల్లీలోని రైల్వే బోర్డులో అదనపు సభ్యులు (ట్రాఫిక్ రవాణా)గా బాధ్యతలు నిర్వర్తించారు. భారతీయ రైల్వేలలో ప్రమాదాలు, అవాంఛనీయ సంఘటనలకు సంబంధించిన పరిహారాలు, సరుకు రవాణా చార్జీలు పరిహారం కోసం క్లెయిమ్‌ల వాపసుకు సంబంధించిన వివాదా లను త్వరగా పరిష్కరించేందుకు 1989లో క్వాజీ-జ్యుడిషియల్ సంస్థగా రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ బెంచ్ పని చేస్తుంది.

శ్రీశైలం వైశ్య సత్రం పేరుతో నకిలీ వెబ్‌సైట్

● భక్తులను దోచుకుంటున్న సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): నకిలీ వెబ్‌సైట్ సృష్టించి భక్తులను సైబర్ నేరగాళ్లు దోచుకుంటున్నారు. సత్రంలో రూమ్స్ బుక్ చేసుకున్న వారిని టార్గెట్ చేసి, జీఎస్‌టీ, ఇతర ఖర్చుల పేరుతో వేధిస్తున్నారు. లేదంటే డబ్బులు రీఫండ్ చేస్తామంటూ నమ్మించి అందినంతా దండుకుంటున్నారు. రెండు రోజుల క్రితం నగర వాసిని టార్గెట్ చేసిన సైబర్ నేరగాళ్లు అతన్ని బురిడీ కొట్టించి రూ. 1.33లక్షలు కొల్లగొట్టారు. సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన 31 ఏళ్ల ప్రైవేట్ ఉద్యోగి దైవదర్శనానికి ప్లాన్ చేసుకున్నాడు. అందులో భాగంగా శ్రీశైలం దేవస్థానం వెబ్‌సైట్లోకి వెళ్లి వైశ్య సత్రంలో రూమ్‌ను బుక్ చేసుకున్నాడు. అందుకు రూ.1000లు చార్జి చెల్లించాడు. ఆ తర్వాత గుర్తుతెలియని వ్యక్తి లైన్‌లోకి వచ్చాడు. మీరు కేవలం గది అద్దెను మాత్రమే చెల్లించారని, జీఎస్టీ రూ. 180లు చెల్లించాలని సూచించాడు. అందుకు బాధితుడు అంగీకరించలేదు. దాంతో మీ డబ్బులు రీఫండ్ చేస్తామని చెప్పడంతో సరే అన్నాడు. రిఫండ్ ప్రాసెస్ ప్రారంభించాడు. ముందుగా బాధితుడుని రూ. 1 పంపాలని సూచించాడు. ఒక్క రూపాయి పంపిన తర్వాత సైబర్ నేరగాడు తిరిగి రూ. 2 పంపించాడు. అనంతర మీరు చెల్లించిన రూ. 1000, జీఎస్టీ రూ. 180 మొత్తం రూ. 1180లు చెల్లించండి నేను రెట్టింపు డబ్బులు పంపుతాను అంటూ నమ్మించాడు. ఇలా విడతల వారీగా దాదాపు రూ. 1.33 లక్షలు వసూల్ చేశాడు. తర్వాత సర్వర్ ప్రాబ్లమ్ వచ్చిందని తప్పించుకున్నాడు. బాధితుడు అతన్ని గట్టిగా నిలదీయడంతో స్పందించడం మానేశాడు. ఇదంతా సైబర్ మోసమని గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు టెక్నికల్ ఎవిడెన్స్ ద్వారా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమ్మోహనంగా నృత్య ప్రదర్శన



కళాకారులను సత్కరిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు

రవీంద్రభారతి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రవీంద్రభారతిలో బుధవారం శ్రీకూచిపూడి డాన్స్ అకాడమీ 30వ వార్షికోత్సవం సందర్భంగా అకాడమీలో శిక్షణ పొందిన కళాకారులు పలు శాస్త్రీయ నృత్యలను ప్రదర్శించారు. నాట్య గురువు విమల నీలం నేతృత్వంలోని శిష్య బృందం చక్కటి నాట్యంతో అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ ఈటల రాజేందర్ కళాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలుగా కళాసేవలో నిమగ్నమైన శ్రీకూచిపూడి డాన్స్ అకాడమీ నిర్వాహకులను అభినందనలు తెలిపారు. శాస్త్రీయ కళలు భారతీయ సంస్కృతికి నిదర్శనమని అన్నారు. పిల్లలు విద్యతో పాటు శాస్త్రీయ కళల పట్ల మక్కువ చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని నాట్య గురువు విమల నీలంను ఘనంగా సత్కరించి అభినందించారు.

విలియం షేక్స్పియర్ రచనలకు నేటికీ ప్రజాదరణ



డాక్టర్ సంగీతకు షేక్స్పియర్ ఎక్స్‌లెన్సీ అవార్డును ప్రదానం చేస్తున్న ప్రొఫెసర్ కరుణాకర్, తదితరులు

బర్కత్‌పుర, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): విలియం షేక్స్పియర్ రచనలకు నేటికీ ప్రజాదరణ ఎంతో ఉందని ఓయూ ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ మాజీ అధిపతి ప్రొఫెసర్ ఎ.కరుణాకర్ అన్నారు. బుధవారం ప్రపంచ ఆంగ్ల భాష దినోత్సవం, విలియం షేక్స్పియర్ జయంతిని పురస్కరించుకుని కింగ్‌కోఠిలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ పీజీ కళాశాల ఆడిటోరియంలో వికాస భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆంగ్ల భాష నిపుణురాలు డాక్టర్ ఎం.సంగీతకు షేక్స్పియర్ ఎక్స్‌లెన్సీ అవార్డును ప్రదానం చేశారు. ఈకార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. షేక్స్పియర్ నాటక రచయిత, కవి, నటుడు అని గొప్ప రచయితగా ప్రపంచంలోనే పేరు పొందారని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌నారాయణ్‌ముదిరాజ్, కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ అంటోని సాగయ్య, రాజు, వి.నవీన్‌కుమార్, పర్ల దాసు, డాక్టర్ సింధు, ఫాదర్ మారేటి తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.. స్వప్నసుందరి అభినయం



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): నవ్యనాటక సమితి నిర్వహణలో బుధవారం తెలంగాణ సారస్వత పరిషత్ హాల్‌లో జరిగిన పద్మభూషణ్ విదుషి స్వప్నసుందరి లాస్య లతిక అభినయ ప్రధాన నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. ముందుగా పుష్పాంజలిలో స్వప్నసుందరి తన నాట్య ప్రదర్శనను ప్రారంభించి తరువాత ఇతర రాష్ట్రాల వాగ్గేయకారుల తెలుగు రచనలకు నృత్య ప్రదర్శన చేశారు. రిటైర్డ్ ఐఏఎస్ ఆర్వీ చంద్రవదన్, రాష్ట్ర ఖజానా, లెక్కలశాఖ ఉప సంచాలకురాలు జి.వసుంధర, దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ డీడీవీ కృష్ణవేణి పాల్గొన్నారు. నృత్య గురువు, కార్యక్రమ సమన్వయకర్త నిష్టల సుధామాల సభకు స్వాగతం పలికారు. డాక్టర్ ఇందిరా హేమ, మధుమతి కులకర్ణి, లక్ష్మీ మానస, మాధవీమాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సమితి అధ్యక్షుడు వేమరాజు విజయ్‌కుమార్, బాలాజీశర్మ, కృష్ణకన్నారావు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పోస్టర్ ఆవిష్కరణ



బద్రినాథ్ వద్ద నిర్వహించే నిత్యాన్నదాన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలో జరిగిన దాడిని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సత్యనారాయణ గుప్తా ఖండించారు. బుధవారం ఉస్మాన్‌గంజ్ బేగంబజార్‌లోని భాగ్యనగర్ అయ్యప్పసేవా సమితి(బాస్) కార్యాలయంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. బాస్ అధ్యక్షుడు క్యాతం రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మెడిశెట్టి రాకేశ్, కోశాధికారి సీఏ అనిల్ నాయక్, శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగాల ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం ట్రస్ట్ సంయుక్తాధ్వర్యంలో సరస్వతి నది పుష్కరాల సందర్భంగా బద్రీనాథ్‌లో అన్నప్రసాద వితరణ పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. మే 15 నుంచి 26వ తేదీ వరకు జరిగే పుష్కరాల్లో అన్నదానం చేపట్టడం అభినందనీయమన్నారు. వీరు చేస్తున్న సేవా కార్యక్రమాలకు దాతలు చేయూతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో బాస్ ప్రతినిధులు ఎస్.జగదీశ్ గుప్తా, విజయభాస్కర్, శ్రీహరి పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన 'మహబూబియా' విద్యార్థినులు



వర్షిణి



కేజియా



దివ్య



రాధ



తేజస్విని



మనీషా



స్ఫూర్తి



మమత



మహిమ

బర్కత్‌పుర, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మహబూబియా ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు ఇంటర్ ఫలితాల్లో తమ సత్తా చాటారు. ఈ కళాశాల 67 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీలో వర్షిణి 986/1000 మార్కులు సాధించి రికార్డు నెలకొల్పింది. ద్వితీయ సంవత్సరం హెచ్ఈసీలో 977/1000 మార్కులు, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో దివ్య 971, ద్వితీయ సంవత్సరం సీఈసీలో రాధ 971, ద్వితీయ సంవత్సరం ఏంఈసీలో తేజస్విని 963 మార్కులు సాధించింది. ఇంటర్ మొదటి సంవత్సరంలో బైపీసీలో మనీషా 436/440 మార్కులు సాధించి కళాశాలలో మొదటి స్థానంలో నిలిచింది. మొదటి సంవత్సరం ఏంపీసీలో స్ఫూర్తి 463/470 మార్కులు సాధించింది. మొదటి సంవత్సరం హెచ్ఈసీలో మమత 491/500 మార్కులు, సీఈసీలో మహిమ 489/500 మార్కులు, ఎంఈసీలో నిఖిల 414/500 మార్కులు సాధించి శభాష్ అనిపించుకున్నారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పద్మావతి అభినందించారు.



మైలార్‌దేవుపల్లి శివాజీ చౌక్ వద్ద జరిగిన కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు ధనుంజయ, అడికె అర్జున్, కాశీగారి యాదగిరి తదితరులు



ఆరాంఘర్ చౌరస్తాలో పాకిస్తాన్ ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ కన్వీనర్ పొన్నమోని మల్లేశ్ యాదవ్, మైలార్‌దేవుపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్



బాబుల్‌రెడ్డినగర్‌లో జరిగిన కొవ్వొత్తుల ప్రదర్శనలో బీఆర్ఎస్ మైలార్‌దేవుపల్లి డివిజన్ అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు



ఉప్పుగూడ ఆర్‌యూబీ వద్ద జరిగిన కొవ్వొత్తుల ప్రదర్శనలో కాంగ్రెస్ చాంద్రాయణగుట్ట నియోజకవర్గ ఇన్‌చార్జి బోయ నాగేశ్, సీనియర్ నాయకులు

ఉగ్రవాదులను ఉరి తీయాలి

కశ్మీర్ పహల్గాంలో మంగళవారం జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ బుధవారం అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం, రాజేంద్రనగర్, తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకుల ఆత్మలకు శాంతి కలగాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్, తదితరులు భగవంతున్ని ప్రార్థించారు. ఉగ్రదాడిలో మరణించిన వారి కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయా ప్రాంతాల్లో పాకిస్తాన్ దిష్టిబొమ్మలను దహనం చేసి భారత్‌మాతకు జై అంటూ నినాదాలు చేశారు. ఉగ్రదాడికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఆయా పార్టీలు, వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మరణించిన వారి కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలన్నారు.

- అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ బృందం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి)



నెక్లెస్‌రోడ్డు అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శనలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, ఎంపీ డీకే అరుణ, నాయకులు



మణికొండ మర్రిచెట్టు వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు, తదితరులు



మొజంజాహీ మార్కెట్ వద్ద పాకిస్తాన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్, బీజేపీ నాయకులు



మణికొండ మున్సిపాలిటీ అల్కాపూర్ చింతచెట్టు సర్కిల్‌లో జరిగిన కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్, మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, నాయకులు, కాలనీ వాసులు



పీడీపీ చౌరస్తాలో కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు బాల్‌రాజ్, కాంగ్రెస్ నాయకులు



నార్సింగ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు



బేగంబజార్ కిరాణా మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టిన బీజేపీ సీనియర్ నాయకులు

కండలు పెరగడానికి ఇంజెక్షన్ల విక్రయం.. ఇద్దరి అరెస్ట్

మదీన, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిమ్‌కు వెళ్తూ కండలు పెంచాలనే కోరిక ఉన్న యువకులను గుర్తించి వారికి ఇంజెక్షన్లు విక్రయిస్తున్న ఇద్దరిని దక్షిణ మండలం పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1.32 లక్షల విలువైన ఇంజెక్షన్లను స్వాధీనం చేసుకున్నారు. మొగల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన మహ్మద్ జిబ్రాన్ అహ్మద్ అలియాస్ సమీర్ గోరి (30), చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన అహ్మద్ ఖురేషీ(30) జిమ్‌కు వెళ్తుంటారు. శరీర దారుఢ్యం కోసం మెఫెంటర్‌మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లు వాడుతుంటారు. ఈ ఇంజెక్షన్లు మార్కెట్‌లో అందుబాటులో లేవు. దీంతో వాటిని న్యూఢిల్లీ ఇండియా మార్ట్ నుంచి రూ. 324కు ఒక ఇంజెక్షన్‌ను ఆన్‌లైన్‌లో తెప్పించి కండలు పెంచాలనే ఆసక్తి ఉన్న యువకులకు ఎక్కువ ధరకు విక్రయిస్తుంటారు. విశ్వసనీయ సమాచారమందుకున్న దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్, చాంద్రాయణగుట్ట, మొగల్‌పురా పోలీసులు సంయుక్తంగా దాడి చేసి మహ్మద్ జిబ్రాన్ అహ్మద్, అహ్మద్ ఖురేషీలను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1,32 లక్షల విలువ చేసే 110 ఇంజెక్షన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

యువతిని వేధించిన పోకిరీలు

మదీన, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఇంటికి వెళ్తున్న ఓ యువతిని కొందరు యువకులు వేధించారు. యువతి ఎదురుతిరగడంతో దాడిచేశారు. ఈ సంఘటన అర్ధరాత్రి బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం... పాతబస్తీ రక్షాపురం ప్రాంతానికి చెందిన ఓ యువతి హైటెక్ సిటీలో ఉద్యోగి. మంగళవారం రాత్రి విధులు ముగించుకొని ఇంటికి వెళ్తోంది. వెనక నుంచి కారులో వచ్చిన యువకులు హారన్ మోగిస్తూ ఆ యువతిని వేధించారు. బండ్లగూడ టైటాన్ ఫంక్షన్‌హాల్ వద్ద బైక్‌ను ఆపి ఎందుకు వేధిస్తున్నారంటూ మందలించింది. దీంతో ఓ యువకుడు కారులోనుంచి దిగి యువతి దగ్గరికి వెళ్లగా చెంప మీద కొట్టింది. దీంతో యువతిపై దాడి చేసి తోసేశాడు. గొడవ జరిగిన అనంతరం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా సంఘటన జరిగిన ప్రదేశం బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధికావడంతో పోలీసులు బండ్లగూడ పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ లోపు నిందితుడు అక్కడినుంచి పారిపోయాడు. గుర్తుతెలియని వ్యక్తిపై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

రాజేంద్రనగర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి... బిహార్‌కు చెందిన టింకు యాదవ్(31) జ్యోతి భార్యాభర్తలు. వారికి 10వ తరగతి చదువుతున్న కుమార్తె ఉంది. వీరు ఐదు సంవత్సరాలుగా టీఎన్‌జీవోస్ కాలనీలో నివాసం ఉంటున్నారు. టింకు కుమార్ లిఫ్ట్ మెకానిక్. జ్యోతి ఓ కంపెనీలో కార్మికురాలు. టింకు యాదవ్ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. బుధవారం భార్య పనికి, కుమార్తె స్కూల్‌కు వెళ్లారు. ఇంట్లో ఒక్కడే ఉన్న టింకు కుమార్ బెడ్ షీట్‌తో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన కుమార్తె తలుపు తట్టడంతో ఎంతకూ తీయలేదు. తలుపులు తోయడంతో తెరుచుకున్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా టింకు కుమార్ ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. ఈ విషయాన్ని తల్లికి ఫోన్ చేసి చెప్పింది. ఆమె వచ్చి మైలార్‌దేవుపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చింది. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ సైదీ నాయుడు వివరాలు సేకరించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏవో సునీతపై బదిలీ వేటు!

చార్మినార్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీ బండ్లగూడలోని దక్షిణమండల ప్రాంతీయ రవాణాశాఖ(ఆర్టీఓ) కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అడ్మినిస్ట్రేటివ్ అధికారిణి (ఏవో) సునీతను రవాణశాఖ కమిషనర్ బదిలి చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు వాహనదారులు రవాణా శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారని ఆరోపణలున్నాయి. క్రమ శిక్షణ చర్యల్లో భాగంగా ఉన్నతాధికారులు ఆమెను రవాణశాఖ ప్రధాన కార్యలయానికి రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారిచేశారు. ఈ విషయంపై బండ్లగూడ ఇన్‌చార్జి ఆర్టీవో కిష్టయ్యను వివరణ అడుగగా ఆమె బదిలీ వాస్తవమేనని ఎన్టీఏ అటాచ్ చేయాలని ఉన్నతాధికారులు ఆమెకు ఆదేశాలు జారీ చేశారు.

అనాథ మహిళ మృతదేహానికి అంత్యక్రియలు

రాజేంద్రనగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు నిజమైన అర్థం చేకూరేలా పనిచేశారు అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వర్‌రావు, ఎస్ఐ వెంకన్నలు. పోలీస్ అంటే కాఠిన్యమే కాదు కరుణ కూడా ఉంటుందని చాటి చెప్పారు. నా అనే వారు లేని యాచకురాలుగా ఆరాంఘర్ చౌరస్తాలో ఉండే ఓ ముస్లిం మహిళ మరణిస్తే ఆమెకు అన్నీ తానై ముందుండి అంత్యక్రియలు చేయించారు. ఈ కార్యక్రమాన్ని జరిపించిన ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వర్‌రావు, ఎస్ఐ వెంకన్నను చూసిన ప్రజలు వారిని అభినందనలతో ముంచెత్తారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి... ఆరాంఘర్ చౌరస్తా ప్రాంతంలో యాచకురాలుగా ఉంటూ ఎవరు లేని ఓ మహిళ అక్కడనే ఉండేది. అనారోగ్య సమస్యలతో ఆమె బుధవారం మరణించింది. సమాచారం తెలుసుకున్న అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వర్‌రావు, ఎస్ఐ వెంకన్న అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆమె మృతదేహన్ని తీసుకెళ్లడానికి ఎవరూ రాకపోవడంతో నౌనెంబర్ ప్రాంతంలోని మస్తాన్ బాబా ఖబరస్థాన్‌కు చెందిన శ్మశానవాటికలో స్థానిక పెద్దలతో మాట్లాడి స్థలాన్ని చూశారు. బుధవారం నమాజ్ ఏ జనాజ పూర్తి అయిన తర్వాత ఆ మహిళ అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్మశానవాటిక పెద్దలు అక్బర్ ఖాన్, అక్రమ్ ఖాన్ కూడా పోలీసులకు సహకారం అందించారు. ఈ మంచి కార్యక్రమాన్ని చేపట్టిన అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వర్‌రావు, ఎస్ఐ వెంకన్నను స్థానికులు అభినందించారు.



మృతి చెందిన మహిళ వివరాలు తెలుసుకుంటున్న అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు, ఎస్ఐ వెంకన్న

సివిల్స్‌లో ర్యాంకులు సాధించిన 109 మంది ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు

బర్కత్‌పుర, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సివిల్స్ ఫలితాల్లో 109 మంది ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు ర్యాంకులు సాధించడం అభినందనీయమని ఈడబ్ల్యూఎస్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు తాడిశెట్టి పశుపతి అన్నారు. కేంద్ర ప్రభుత్వం కల్పించిన 10 శాతం రిజర్వేషన్ల వల్లనే ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు అన్ని రంగాల్లో రాణించగలుగుతున్నారని, ఆ రిజర్వేషన్లు తమ పోరాట ఫలితమేనన్నారు. బుధవారం బషీర్‌బాగ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎంపికైన ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. రిజర్వేషన్లతో లబ్ధి పొందిన అగ్రవర్ణ పేదలు ప్రధాని మోదీకి రుణపడి ఉంటారని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు తాడిశెట్టి ప్రతిమ, కె.రాజేష్, తిరుపతయ్య, శ్రీనివాస్, ప్రవీణ, వైష్ణవి, కూలరాజు, సముద్రాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తాడిశెట్టి పశుపతి

ఇంటర్ ఫలితాల్లో సింధూ కళాశాల విజయ భేరి



విద్యార్థులను అభినందిస్తున్న సింధూ కళాశాల వ్యవస్థాపకులు రామారావు, ప్రిన్సిపాల్ కె.ప్రమీలారాణి



విద్యార్థులను అభినందిస్తున్న సింధూ కళాశాల వ్యవస్థాపకులు రామారావు, ప్రిన్సిపాల్ ప్రమీలారాణి, డిగ్రీ ప్రిన్సిపాల్ సంధ్యారాణి

కార్వాన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో సింధూ జూనియర్ కాలేజీ విద్యార్థులు విజయ భేరి మోగించారు. మెహిదీపట్నం, రేతిబౌలిలో ఉన్న సింధూ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో సత్తా చాటారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో కె.నందిని (439/470), బైపీసీలో ప్రతీక్ష (420/440), సీఈసీలో సయిష్టా ఫాతిమా (476/500), ఎంఈసీలో మహిమా (449/500) మార్కులతో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు ఎంఈసీలో పి.కోమల్ రాణి (982/1000), ఎంపీసీలో బి.నందిని(962/1000), బైపీసీలో ఎస్.దేవిదుర్గా (960/1000), సీఈసీలో నేహబేగం (951/1000) మార్కులతో రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల వ్యవస్థాపకులు ఐ.రామారావు, అధ్యక్షులు జె.వెంకటచలపతి, ప్రిన్సిపాల్ కె.ప్రమీలా రాణి, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ సంధ్యారాణి, వైస్ ప్రిన్సిపాల్ యం.నరేందర్ రెడ్డి విద్యార్థులకు అభినందనలు తెలిపారు. విద్యార్థుల ఉత్తీర్ణతలో తమ వంతు కృషిచేసిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/wiNnjVlలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

హుక్కా సెంటర్‌పై పోలీసుల దాడి

చార్మినార్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పాతబస్తీలోని రైన్ బజార్ పోలీసుస్టేషన్ పరిధిలో సౌత్‌జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. జఫర్‌రోడ్డులో ఓ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా హుక్కా సెంటర్ నడుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు సోదాలు చేశారు. హుక్కా సెంటర్‌లో దాడిచేసి తొమ్మిది మందిని పట్టుకొని వారి నుంచి పది హుక్కా పాట్స్ ఆపిల్ హుక్కా ఫ్లేవర్ ఒక్కటి స్వాధీనం చేసుకొని విచారణ నిమిత్తం రెయిన్ బజార్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోకాపేట్‌లో స్వల్ప అగ్నిప్రమాదం

నార్సింగ్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కోకాపేట్‌లో బుధవారం రాత్రి స్వల్ప అగ్నిప్రమాదం జరిగింది. రాజుపుష్ప ఆట్రీ సమీపంలో అగ్నిప్రమాదం జరగడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారంతో ఇవ్వగా, వారు వెంటనే వచ్చి మంటలు ఆర్పారు. ఇది చిన్నపాటి అగ్నిప్రమాదమేనని, ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందని అగ్నిమాపక సిబ్బంది పేర్కొన్నారు.

షెడ్డు నిర్మాణ పనులు జరగడం లేదు

రాజేంద్రనగర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): అత్తాపూర్ నుంచి పీడీపీ చౌరస్తాకు వెళ్లే మార్గంలో మంత్రా మాల్, విశాల్ మార్ట్ మధ్య చేపడుతున్న షెడ్డు పనులను బుధవారం రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది పరిశీలించారు. వారు వెళ్లినప్పుడు అక్కడ ఎలాంటి పనులు జరుగడం లేదని గుర్తించారు. గతంలో షెడ్డు పనులు చేస్తుండగా రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు ఇవ్వడంతో పనులు ఆపినట్లు గుర్తించారు. షెడ్డు నిర్మాణ ప్రాంతానికి తాళం వేశారు. అనధికార షెడ్డు నిర్మాణ విషయంలో షెడ్డు నిర్మిస్తున్న వారికి నోటీసులు అందజేశామని డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్ తెలిపారు. షోకాజ్ పీరియడ్ కొనసాగుతున్నదని, ఆ తర్వాత షెడ్డు నిర్మాణంపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం పనులు జరగడంలేదన్నారు.

'సమస్యలు పరిష్కరించండి'

పహాడిషరీఫ్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పహాడిషరీఫ్ రాజీవ్‌గాంధీనగర్‌లో భూగర్భ డ్రైనేజీ, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నాయకులు బుధవారం జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ బి.వెంకట్ రామ్‌కు వినతి పత్రం అందజేశారు. స్పందించిన జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ త్వరలో సమస్యలు పరిష్కారిస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాకడుమ్ పటేల్, నయీమ్, యూసుఫ్, ముబీన్, ఫెరోజ్, అర్బజ్, మక్బూల్, ఇమ్రాన్, జావీద్, ఆమెర్ పటేల్, సాహిల్, తదితరులు పాల్గొన్నారు

పాఠశాలకు నూతన గేటు ఏర్పాటు

రాజేంద్రనగర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు నూతన గేటు అమర్చారు. గతంలో ఉన్న గేటు శిథిలావస్థకు చేరడంతో ఆ గేటు స్థానంలో ఇరు వైపులా సిమెంటు దిమ్మెలను నిర్మించి పాడైన గేటు స్థానంలో నూతన గేటును అమర్చారు. అందుకు అయిన ఖర్చులో రూ. 75వేలు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ ఎం.సుగుణారెడ్డి ఇవ్వగా, రామయ్య హాస్పిటల్స్ అధినేత, ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సుల్తాన్ అమరేందర్ రూ.20వేలు విలువ గల స్టీల్, సిమెంటును అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు ఎస్.వెంకటేశ్, రాజుతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ ఎం.సుగుణారెడ్డి మాట్లాడుతూ, పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులే ఎక్కువగా చదువుకుంటారని, వారికి కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | గోవిందరావు : 9703618721, రాజ్ కుమార్: 9985921389 కె. అనిల్ కుమార్: 99854 03628

● రెగ్యులరైజ్ కోసం ర్యాలీ



ర్యాలీ చేస్తున్న ఓయూ యూనివర్సిటీల కాంట్రాక్ట్ అధ్యాపకులు

తమను క్రమబద్ధీకరించాలని కాంట్రాక్ట్ అధ్యాపకులు చేపట్టిన నిరవధిక సమ్మె ఐదో రోజైన మంగళవారం చలో ఉస్మానియా యూనివర్సిటీ చేపట్టారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్ అధ్యాపకులతో ఆర్ట్స్ కాలేజీ నుంచి అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం అక్కడే టెంటు వేసుకుని సమ్మెలో కూర్చున్నారు. ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక ముందు ఒక మాట, వచ్చాక ఒక మాట మాట్లాడుతోందన్నారు. కాంట్రాక్ట్ అధ్యాపకులు చేపట్టిన ఉద్యమానికి అండగా ఉంటామని ఎంపీ ఆర్.కృష్ణయ్య భరోసా ఇచ్చారు. **ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) :**

సివరేజీ పనులను సత్వరమే పూర్తి చేయాలి

గన్‌పార్క్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : సివరేజీ పనులను సత్వరమే పూర్తి చేయాలని ఈడీ మయాంక్ మిట్టల్ ఆదేశించారు. ఈ నెల 15న ఆంధ్రజ్యోతిలో సివరేజీ పనుల్లో జాప్యం! ..'పేరిట ప్రచురించిన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కథనానికి స్పందన లభించింది. బుధవారం అధికార యంత్రాంగంతో కలిసి ఈడీ స్థానికంగా జరుగుతున్న పనులను పరిశీలించారు. గుత్తేదారు చేపట్టిన పనుల జాప్యం పై ఆరా తీశారు. కింది స్థాయి అధికారుల పనితీరుపై కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. సాధ్యమైనంత త్వరగా మురుగు కాలువ పనులను పూర్తి చేయాలని జీఎం ప్రాజెక్ట్ అధికారిని ఆదేశించారు.

షుగర్ రీప్లేసర్.. 'స్వీట్' స్పాట్ !

- చక్కెరకు ప్రత్యామ్నాయం
- చెరుకు నుంచి తయారు చేసిన సహజ సిద్ధం
- జీర్ణక్రియకు తోడ్పడే ప్రోబయాటిక్స్ దీని సొంతం
- పిల్లలకు ఆరోగ్యకరం.. మధుమేహులకు ప్రయోజనం
- నగరంలో అన్ని సూపర్ మార్కెట్‌లలో లభ్యం

చక్కెర వాడకం తగ్గించుకోండి... డాక్టర్లు సాధారణంగా ఇచ్చే సలహా. రసాయన ప్రక్రియతో తయారు చేసే చక్కెర కారణంగా పిల్లల్లో దంతక్షయం, పెద్దలకు రక్తంలో గ్లూకోజ్ స్థాయి పెరిగిపోవడంతో ఆరోగ్య పరంగా ఎన్నో సమస్యలు. వీటికి చెక్ పెడుతూ... స్వీట్‌స్పాట్ ప్రొడక్టు మార్కెట్‌లోకి వచ్చింది. చక్కెరకు ప్రత్యామ్నాయం.. ఆరోగ్యానికి ప్రయోజనం అని రెవలేషన్స్ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చెబుతోంది. చెరుకు నుంచే తయారు చేసిన ఫ్రక్టో -ఒలిగో-సాచరైడ్ (ఎఫ్ఓఎస్)తో స్వీట్ స్పాట్ పేరిట ప్రోబయాటిక్ షుగర్ రీప్లేసర్‌ను తీసుకు వచ్చామంటోంది. నగరంలో జరిగిన స్టార్టప్ కాంక్లేవ్ 2025లో ఈ స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



కాన్‌క్లేవ్‌లో రెవలేషన్స్ బయోటెక్ స్టాల్, స్వీట్ స్పాట్



తార్నాక/హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : చక్కెర అవసరం లేదిక చక్కెరకు బదులుగా స్వీట్ స్పాట్‌ను వినియోగించవచ్చు అని అంటున్నారు. సంస్థ ఏరియా సేల్స్ మేనేజర్ ప్రశాంత్. విస్తృత జీవన ఆహార, పానీయాలలో దీనిని వాడవచ్చని, తద్వారా వాటిని ఆరోగ్యవంతంగానూ మలుచుకోవచ్చంటున్నారు. రెవలేషన్స్ బయోటెక్ ఈ ప్రొడక్టును తమ పాస్(ఎఫ్ఓఎస్)లైఫ్ ఉత్పత్తుల విభాగంలో విడుదల చేసింది. స్వీట్ స్పాట్ అనేది సహజసిద్ధమైన చక్కెర. చెరుకు నుంచి ప్రత్యేకమైన ఎంజైమ్ ప్రక్రియ ద్వారా తయారుచేస్తున్నారు. ఇది వినియోగాన్ని ఆర్ అండ్ డీ సీనియర్ మేనేజర్ దీపాన్విత సిన్హా వివరించారు. దీనిలో షార్ట్ చైన్ ఫ్రక్టో-ఒలిగో -సాచరైడ్స్ (ఎస్‌సీ-ఎఫ్ఓఎస్) ఉంటుంది. ఇది సాధారణంగా ఉల్లిపాయలు, టమోటాలు, గోధుమలు, అరటిపండు, వెల్లుల్లి వంటి పండ్లు, కూరగాయలలో సహజంగా లభిస్తుంది. సాంకేతికంగా చూస్తే ఎఫ్ఓఎస్ అనేది సుక్రోజ్ మాలిక్యూల్‌కు సహజసిద్ధమైన రూపం. ఇప్పుడు ఈ ఫాస్‌లైఫ్ విభాగంలోని స్వీట్‌స్పాట్‌ను భవిష్యత్ స్వీటెనర్‌గా చెప్పొచ్చని సిన్హా తెలిపారు.

ఆరోగ్య ప్రయోజనాలు అధికం

మార్కెట్‌లో లభించే చక్కెర స్థానాన్ని తమ స్వీట్ స్పాట్ భర్తీ చేస్తుంది. దీనిలో గ్లూకోజ్ స్థాయి తక్కువ ఉంటుంది. ఈ స్వీట్ స్పాట్‌లో 65% డైటరీ ఫైబర్ ఉంటే, 25% గ్లూకోజ్ ఉంటుంది. వీటికి తోడు దీనిలో ప్రోబయాటిక్స్ ఉంటాయి. దీని వల్ల జీర్ణక్రియ ఆరోగ్యం మెరుగుపడుతుంది. రోగనిరోధక శక్తికి తోడ్పడుతుంది. చక్కెరలో గ్లైసెమిక్ ఇండెక్స్ (జీఐ) 65 ఉంటే దీనిలో అతి తక్కువగా 20 గ్లైసెమిక్ ఇండెక్స్ (జీఐ) దీనిలో ఉందన్నారు. పిల్లల నుంచి పెద్దవారి వరకూ ఎవరైనా దీనిని వాడొచ్చు. సాధారణంగా స్వీట్లు లాంటివి తింటే పిల్లలకు దంతక్షయ సమస్యలు వచ్చే అవకాశాలుంటాయి కానీ, స్వీట్ స్పాట్‌తో చేసిన స్వీట్లతో ఆ సమస్యలు కూడా రావు. హైదరాబాద్ మార్కెట్‌లో అన్ని సూపర్ మార్కెట్లలో ఇది లభ్యమవుతుంది. 450 గ్రాముల ధర 300 రూపాయలు అని ప్రశాంత్ తెలిపారు.



సమావేశంలో ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

'స్టార్టప్‌లు'.. సామాజిక మార్పుపై దృష్టి సారించాలి

- ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి
- విజయవంతంగా ముగిసిన స్టార్టప్ కాంక్లేవ్

నాచారం, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి): స్టార్టప్‌లు సాధారణంగా వాణిజ్య పరంగా విజయం సాధించడానికి దూసుకుపోతాయని, కానీ సామాజిక అభివృద్ధి పై కూడా వాటి యజమాన్యాలు దృష్టి సారించాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) ల్యాబ్‌లు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ), సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ), నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ)లు సంయుక్తంగా రెండు రోజులుగా తార్నాకలోని సీఎస్ఐఆర్ క్యాంపస్‌లో నిర్వహిస్తున్న స్టార్టప్ కాంక్లేవ్ -2025 హైదరాబాద్ ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశంలో జ్ఞాన సంపదకు కొదవలేదన్నారు. భారత ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా లాంటి కార్యక్రమాల ద్వారా దేశంలో నూతన శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు అభివృద్ధి చెందారన్నారు.

'ఏమి సాధించారని ఎల్కతుర్తిలో సభ'

పంజాగుట్ట, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): విలగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పులపాలు చేసినందుకా? నిర్బంధాల మధ్య తెలంగాణను పాలించినందుకా? వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో కేసీఆర్ సభ ఎందుకు నిర్వహిస్తున్నారో చెప్పాలని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు గజ్జెల కాంతం డిమాండ్ చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణను నిరంకుశంగా పాలించి లక్షల కోట్లు వెనకేసుకున్న కేసీఆర్‌కు సభ పెట్టే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. ధరణి పేరుతో 32 వేల ఎకరాల భూములను దోచుకున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో 13 లక్షల సెల్ ఫోన్ల కితే స్పందించిన సీనియర్ ఐఏఎస్ అధికారి స్మిత సబర్వాల్ ఇప్పుడు ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు.

మ్యాన్‌హోల్ లీకేజీ ఘటనపై సీరియస్

- సుమోటోగా స్వీకరణ

గన్‌పార్క్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) :హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సీవరేజీ బోర్డు అధికారుల పనితీరుపై మానవ హక్కుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎంఎన్‌జే ప్రభుత్వ క్యాన్సర్ ఆసుపత్రి సమీపంలో మ్యాన్‌హోల్ లీకేజీ వల్ల దుర్వాసన వెదజల్లి, ప్రజల రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలిగించిన నేపథ్యంలో స్పందించింది. మ్యాన్‌హోల్ లీకేజీ పై కేసును మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ సుమోటోగా స్వీకరించారు. ఈ ఘటనపై నివేదిక కోరారు. వచ్చే నెల 4న విచారణ తేదీ వరకు పూర్తి నివేదికను జలమండలి ఎండీని ఆదేశించారు.



ప్రాజెక్టు పనులు పరిశీలిస్తున్న వాటర్ బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి

సుంకిశాల పనుల్లో నిర్లక్ష్యం వద్దు : అశోక్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి): సుంకిశాల ప్రాజెక్టు పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దని, పనులు నాణ్యతతో చేపట్టాలని వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి ఆదేశించారు. రిటైనింగ్ వాల్ శిథిలాల తొలగింపు పనులు శరవేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. బోర్డు ఉన్నతాధికారులతో కలిసి ఆయన... నాగార్జునసాగర్ వద్ద నిర్మిస్తున్న సుంకిశాల ప్రాజెక్టు నిర్మాణ ప్రాజెక్టు పనులను బుధవారం సందర్శించారు. పైప్ లైన్ విస్తరణ పనులు.. ఇంటెక్‌వెల్ నిర్మాణ పనులు పరిశీలించారు. టన్నెల్, ఎలక్ట్రికల్ పనులు తుది దశకు చేరుకున్నాయని, సివిల్ వర్క్స్ ఇంకా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. సుంకిశాల టన్నెల్ గేట్ రిటైనింగ్ వాల్ ఒక పక్కకు ఒరిగిన ప్రాంతాన్ని సైతం పరిశీలించారు. సంపులో నీళ్ల ఖాళీ కావడంతో శిథిలాల తొలగింపు పూర్తిగాలేదని అధికారులు ఆయనకు తెలుసుకున్నారు. పునర్నిర్మాణం సంబంధించిన డిజైన్‌లు వెంటనే సమర్పించాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులతో ఆయన అన్నారు.

బౌద్ధ విలువలు అత్యంత అవసరం

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజానికి, ప్రపంచానికి బౌద్ధ విలువలు అత్యంత అవసరమని ప్రదర్శన ద్వారా అందరికీ తెలియజేయడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్స్ కాలేజీలో ఫిలాసఫీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో "అశోక చక్రవర్తి శాసనాలు, పురాతన స్మారకాలు" అనే అంశంతో, "శాంతి వారసత్వం - యుద్ధం నుంచి జ్ఞానం వైపు" అనే ఉపశీర్షికతో మంగళవారం ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉస్మానియా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం, గౌరవ అతిథిగా ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి. కాశీం హాజరయ్యారు. ఫిలాసఫీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ సి.హెచ్. వంశీధర్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



ప్రదర్శనలో వీసీ కుమార్, ప్రిన్సిపాల్ కాశీం

● వచ్చే బతుకమ్మ... బతుకమ్మకుంటలోనే



అభివృద్ధి పనులకు పూజలు నిర్వహిస్తున్న రంగనాథ్

వచ్చే బతుకమ్మ ఉత్సవాలు బతుకమ్మకుంటలోనే జరుగుతాయని హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ వెల్లడించారు. బుధవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ బతుకమ్మకుంటలో పలు అభివృద్ధి పనులను వేదమంత్రోచ్ఛరణల నడుమ పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. బతుకమ్మకుంట చెరువును యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించి అభివృద్ధి, సుందరీకరణ పనులు జరిపాలని అధికారులను ఆదేశించారు. **రాంనగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) :**

పునరాభివృద్ధి పనులు వేగిరం

- వరంగల్ ఎంపీ కావ్య
- దక్షిణమధ్య రైల్వే జీఎంకు వినతి



రైల్వే జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీలు కావ్య, రఘురాంరెడ్డి, కిరణ్‌కుమార్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : అమృత్ భారత్ పథకం కింద వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లలో జరుగుతున్న పునరాభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఎంపీ కావ్య కోరారు. వరంగల్ పరిధిలో ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని ఎంపీ కావ్య అన్నారు. తమ నియోజకవర్గంలో.. రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై వినతిపత్రం అందజేశారు. సికింద్రాబాద్ రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్‌తో కలిసి ఆమె, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ.. తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్ రైల్వే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని వినతిపత్రం అందించినట్లు తెలిపారు. జోన్ పరిధిలో కీలకమైన కాజీపేట జంక్షన్ ప్రాముఖ్యతను తగ్గించడం చూడాలని కోరారు. కాజీపేట లోకో రన్నింగ్ డిపో సిబ్బందిని విజయవాడ డిపోకు బదిలీ చేశారన్నారు. ప్రస్తుతం ఈ స్టేషన్‌లో కొత్త పోస్టుల భర్తీపై అధికారులు శ్రద్ధ కనబరచడం లేదని తెలిపారు. కాజీపేటలో ఉండాల్సిన 709 మంది ఉద్యోగులకు గాను 526 మంది విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఇంకా పలు అంశాలపై ఆరు జీతో మాట్లాడారు. ఆయన కూడా వాటన్నింటిపై సానుకూలంగా స్పందించారు.

4 నుంచి 'జేఎన్‌టీయూ'కు సెలవులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీలో బీటెక్ చదువుతున్న విద్యార్థులకు మే నెల 4వ తేదీ నుంచి వేసవి సెలవులు ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి.నర్సింహారెడ్డి తెలిపారు. కళాశాల తిరిగి జూన్ 2నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా... జేఎన్‌టీయూలో కాంట్రాక్ట్ అధ్యాపకులు బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రంలోని 12యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని డిమాండ్‌తో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. నెహ్రూ విగ్రహం వద్ద నుంచి క్యాంపస్‌లోని వివిధ ఇంజనీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ బ్లాక్‌ల మీదుగా మేనేజ్‌మెంట్ కళాశాలవరకు ర్యాలీ కొనసాగింది.

నిర్మాణ రంగానికి ఊతం

భూ భారతి, బిల్డ్‌నౌ : నరెడ్కో



మాట్లాడుతున్న నరెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు విజయసాయి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి పోర్టల్, బిల్డ్‌నౌ అప్లికేషన్లు నిర్మాణ రంగానికి ఊతమిస్తాయని నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నరెడ్కో) రాష్ట్ర అధ్యక్షుడు విజయసాయి మేక, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. వీటిని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడాన్ని సమర్థిస్తున్నట్లు ప్రకటించారు. నగరంలోని ఓ హోటల్‌లో నరెడ్కో తెలంగాణ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. భూభారతి పోర్టల్ ముఖ్యమైన సంస్కరణ అని, రాష్ట్ర భూపరిపాలన ప్రక్రియ పనితీరును పరివర్తనం చేయడం దీని లక్ష్యమని తెలిపారు. మిస్సింగ్ సర్వేనంబర్లు, లేఅవుట్లను ఓపెన్ ల్యాండ్స్‌గా చూపెట్టడం, నిషేధిత జాబితాలో సర్వే నంబర్లను తప్పుగా జాబితా చేయడం వంటి మరెన్నో సమస్యలను, డెవలపర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను భూభారతి పోర్టల్ పరిష్కరిస్తుందని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. భూమి యాజమాన్య రికార్డులపై ప్రజల్లో విశ్వాసాన్ని మెరుగుపరుస్తుందని తెలిపారు. ఆధునీకరించిన రికార్డ్ ఆఫ్ రైట్ (ఆర్ఓఆర్) విధానం భూభారతిలో కీలకంగా ఉండబోతున్నారు. భూభారతి పటిష్టంగా అమలుకు, విని యోగదారులకు స్నేహపూర్వకంగా తోడ్పాటును అందించడానికి రియల్ ఎస్టేట్ రంగానికి చెందినవారికి భాగస్వామ్యం కల్పించాలన్నారు.

పీహెచ్‌డీ సీట్ల అమ్మకాలపై విచారణకు డిమాండ్

నల్లకుంట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : తెలుగు యూనివర్సిటీలో పీహెచ్‌డీ సీట్ల అమ్మకాలపై విచారణ జరిపించాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ ఫెడరేషన్ (టీపీటీఎల్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విజయకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డిని టీపీటీఎల్ఎఫ్ ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పీహెచ్‌డీ అడ్మిషన్ల అమ్ముకున్న వీసీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నోటిఫికేషన్ వెలువరించిన నుంచి సీట్లు ఇచ్చేంతవరకు అడుగడుగునా అవకతవకలు జరిగాయని ఆరోపించారు. పీఎస్‌టీయూ పీహెచ్‌డీ తెలుగు (రెగ్యులర్) అడ్మిషన్ ప్రక్రియలో అనేక అవకతవకలు జరిగాయని పేర్కొన్నారు. ఈ అడ్మిషన్ (రెగ్యులర్) కోసం జనవరి 30న విడుదల చేసిన నోటిఫికేషన్ యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పెట్టకుండా దొంగదారిన రిలీజ్ చేశారని అన్నారు. ఈ ఘటనలపై సత్వరమే విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుని అర్హత కలిగిన వారిని ఎంపిక చేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీటీఎల్ఎఫ్ నాయకులు కొమ్ము విజయ్, కట్టా ప్రభాత్, చిట్టిబాబు, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ సాధనకు అవేమీ అడ్డురాదు

- సివిల్స్ ర్యాంకర్ ఉదయకృష్ణారెడ్డి



చిక్కడపల్లి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఆయన పుట్టింది, పెరిగింది ఓ పల్లెటూరు. చదివింది ప్రభుత్వ పాఠశాలలో. చిన్నతనంలోనే అమ్మ, నాన్నల ప్రేమకు దూరమయ్యారు. సెంటు భూమి లేదు. ఉన్నదల్లా పట్టుదల, లక్ష్య సాధనపై గురి మాత్రమే. తనకి ఎదురైన అవమానం దానికి ఆజ్యం పోసింది. పట్టువదలని ప్రయత్నంతో కష్టసాధ్యమైన ఐఏఎస్‌ని సాధించి నగర్గంగా నిలబడ్డాడు.. ప్రకాశం జిల్లా ఉళ్లపాలెం వాసి ముంగర ఉదయకృష్ణారెడ్డి. జంతువులపై ఆయనకు అపారమైన ప్రేమ. దేశ వ్యాప్తంగా వాటి రెస్క్యూ కోసం 109ని సాధించేందుకు ప్రయత్నిస్తానని ప్రకటించారు. బుధవారం సాయంత్రం ఆయన హైదరాబాద్, అశోక్‌నగర్‌ ఆర్‌సీ క్రాస్‌రోడ్స్‌లోని విజన్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌లో మీడియాతో మాట్లాడారు. 'చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన నన్ను మా నాయనమ్మ రమణమ్మ కూరగాయలు అమ్మి పెంచి పోషించింది. మామయ్య కోటిరెడ్డి ఎంతో సహకరించారు. 350వ ర్యాంక్ సాధించిన ఈ వేళ వారిద్దరికీ కృతజ్ఞతలు తెలుపుకున్నా. తెలిపి తన సెంటు భూమి లేదు. కానిస్టేబుల్‌గా 2013లో ఉద్యోగంలో చేరాను. పూర్వ ప్రకాశం జిల్లా గుడ్లూరు పీఎస్, రామాయపట్నం మెరైన్ పీఎస్‌లో కానిస్టేబుల్‌గా పనిచేశా. అక్కడ సీఐ చేసిన అవమానం నన్ను ఐఏఎస్ సాధన దిశగా పురిగొల్పింది. 2018లో ఉద్యోగానికి రిజైన్ చేశాను. సివిల్స్ ప్రిపరేషన్ మొదలు పెట్టాను. నాలుగో ప్రయత్నంలో 780వ ర్యాంకు సాధించా. ఇండియన్ రెవెన్యూ మేనేజ్‌మెంట్ సర్వీస్(ఐఆర్ఎంఎస్) వచ్చింది. నాకు అక్కర ఐఏఎస్... అందుకే ట్రైనింగ్ చేస్తూనే మళ్లీ రాశాను. ఈసారి 350వ ర్యాంక్ వచ్చింది. ఐఏఎస్ కచ్చితంగా వస్తుంది. నా తమ్ముడు ప్రణయ్‌కృష్ణారెడ్డి కూడా సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు' అని తెలిపారు. సివిల్స్ సాధించాలనుకునే వారికి తనదైన సూచనలు చేశారు. 'అంకిత భావంతో చదవాలి. ప్రణాళికాబద్ధంగా ప్రిపేర్ కావాలి. ఎలాంటి ఆత్మన్యూనతాభావాలు లేకుండా ఉండాలి. అప్పుడే సివిల్స్ సాధించడం సులభమవుతుంది. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చినవారు ఎలాంటి ఫీలింగ్ పెట్టుకోవద్దు ' అంటూ గ్రామీణ యువతకు మార్గదర్శనం చేశారు.

హ్యాండ్ హెల్డ్ బ్లెండర్ల విక్రయ కేంద్రంపై దాడులు

- 2,635 ఉత్పత్తుల స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : బీఐఎస్ ప్రమాణాలు లేని ఎలక్ట్రానిక్ హ్యాండ్ హెల్డ్ బ్లెండర్లు విక్రయిస్తున్నారన్న సమాచారంతో భారతీయ ప్రమాణాల బ్యూరో (బీఐఎస్) హైదరాబాద్ శాఖ అధికారులు బషీర్‌బాగ్‌లోని ఓ కేంద్రంపై దాడులు నిర్వహించారు. రూ. 7లక్షల విలువ కలిగిన 2635 హ్యాండ్ హెల్డ్ బ్లెండర్లు బీఐఎస్ జారీ చేసే రిజిస్ట్రేషన్ ముద్ర లేకుండా, ప్రదర్శిత లేకుండా విక్రయిస్తున్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు బుధవారం హైదరాబాద్ శాఖ సంచాలకులు పీవీ శ్రీకాంత్ వెల్లడించారు. ప్రతీ ఎలక్ట్రానిక్ గృహోపకరణ వస్తువుకు బీఐఎస్ ప్రమాణీకరణ తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిందన్నారు. ఈ వస్తువులపై బీఐఎస్ అనుమతి లేకుండా తయారు చేయడానికి, విక్రయించడానికి, నిల్వ ఉంచడానికి వీల్లేదన్నారు. ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై బీఐఎస్ చట్టం 2016 కింద కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

బాక్స్ డ్రైయిన్ నిర్మాణం

- ట్రాఫిక్ మళ్లింపు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ దుర్గం చెరువు సమీపంలోని గ్రీన్‌నగర్ (నెక్టార్ గార్డెన్) ప్రాంతంలో బాక్స్ డ్రైయిన్ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో రేపటి నుంచి ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టనున్నట్లు సైబరాబాద్ జాయింట్ ట్రాఫిక్ సీపీ బుధవారం తెలిపారు. బాక్స్ డ్రైయిన్ నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి జోన్ మునిసిపల్ అధికారులు చేపట్టారని, పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందన్నారు. మాదాపూర్ సీఓడీ జంక్షన్, రాయదుర్గం మైండ్‌స్పేస్, ఐకియా, ఇనార్బిట్ మాల్ ప్రాంతాల నుంచి వాహనాలు ఇతర మార్గాల్లో వెళ్లాలని, వాహనదారులు ఇతర మార్గాల్లో వెళ్లేలా పలు రూట్లు సూచించామని తెలిపారు.

పట్టుబడిన 35 వాహనాల రిజిస్ట్రేషన్స్ రద్దు

- ఆర్టీఏకి ట్రాఫిక్ పోలీసుల లేఖ ఎఫెక్ట్
- సిటీలో స్పెషల్ డ్రైవ్.. 1,275 కేసులు నమోదు
- తల్లిదండ్రులు, యజమానులకు శిక్షలు, జరిమానాలకు ప్రణాళిక
- 25 ఏళ్లు వచ్చేంత వరకు నో లైసెన్స్ : సీపీ దేవిస్



స్పెషల్ డ్రైవ్‌లో సిటీ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ పోలీసులు

మైనర్ డ్రైవింగ్‌పై కొరడా

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రోజు రోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ ఉల్లంఘనలను పరిగణలోకి తీసుకున్న పోలీసులు.. నగరంలో మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 15 రోజులుగా సిటీ పరిధిలోని అన్ని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ చేపట్టిన పోలీసులు 275 మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు చేశారు. ఈ మేరకు మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులు, లేదా వాహన యజమానులపై కేసు నమోదు చేయడంతో పాటు.. చార్జిషీట్ దాఖలు చేసి కోర్టు జోనులో నిలబెట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సిటీ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ పేర్కొన్నారు. మైనర్ డ్రైవింగ్‌లో పట్టుబడ్డ వాహనాలు.. మోటారు వెహికిల్ చట్టం 1988లోని సెక్షన్ 199ఎ ప్రకారం రిజిస్ట్రేషన్లు రద్దు చేయాల్సిందిగా సిటీ పోలీసులు ఆర్టీఏ అధికారులకు లేఖలు రాశారు. ఇప్పటి వరకు 35 వాహనాల రిజిస్ట్రేషన్లు రద్దు చేసినట్లు స్పష్టం చేశారు. అంతే కుండా వాహనాలు ఇచ్చిన బాధ్యులను న్యాయస్థానంలో హాజరుపరుస్తామన్నారు. మెజిస్ట్రేట్ నిర్ణయం మేరకు మైనర్ డ్రైవింగ్‌కు కారణమైన బాధ్యులకు జరిమానా, జైలు శిక్ష విధించే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఒక్కసారి మైనర్ డ్రైవింగ్‌లో పట్టుబడితే 25 ఏళ్ల వయసు వచ్చేంత వరకు డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు అర్హత ఉండదని తెలిపారు. ఇకపై తల్లిదండ్రులు, వాహన యజమానులు కొనసాగమైన ట్రాఫిక్ నిబంధనలను దృష్టిలో ఉంచుకుని, వాహనాలు ఇచ్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని డేవిస్ పేర్కొన్నారు.

పెళ్లి చేసుకుంటానని లైంగికదాడి

- నిందితుడిపై కేసు నమోదు

అమీర్‌పేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిపై యువతి ఎస్ఆర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏపీ రాష్ట్రం ఒంగోలు సమీపంలోని రాజుపల్లికి చెందిన దార్ల ముకేశ్(33) నవవర్షం క్రితం నగరానికి వచ్చి ఎస్ఆర్‌నగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటూ ప్రైవేట్ పాఠశాలలో పీఈటీ టీచర్‌గా పని చేస్తున్నాడు. బజాజ్ షోరూంలో ఉద్యోగం చేస్తున్న అనంతపురం జిల్లాకు చెందిన యువతితో అప్పటి నుంచే ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. ఇది కాస్తా ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించి అనేక సార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. నెల క్రితం ఇద్దరి మధ్య పెళ్లి మాట రాగానే పోన్ స్విచ్‌ఆఫ్ చేశాడు. ఇక మోసపోయానని తెలుసుకున్న యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

ఆంధ్రజ్యోతి Daily CLASSIFIEDS

WANTED

H మంగ హెల్మెట్ కావలెను : అర్హత : 10th పాస్ / ఫెయిల్, మంచి జీతం. ఉద్యోగంలో రుచి సులభ కంపెనీ బ్రోకర్ చిరునామాలో పనిచేయుటకు సంప్రదించండి. సెల్ : 70326 40251 AJB-133

రియల్ ఎస్టేట్

H వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్‌లో మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్క్ (హనుమాన్ జంక్షన్ దగ్గర) సమీపంలో ఇన్వెస్ట్‌మెంట్‌కు ప్లాట్లు కలవు సంప్రదించండి : 94 94 44 12 19 AJH-235061

HOUSE FOR SALE

H Hyderabad Airport Shamshabad near Independent House 2BHK 45 & 30 Lakhs, Gajwel Near 2BHK 45 Lakhs & 120 Sq.yards 4 Lakhs. 1 acre 8 Lakhs & 1 Cr 50 Lakhs. 9848257295 AJH-002945

CHANGE OF NAME

H I, PITTA SUDHAKAR S/ o. Pitta Chandraiah, H.No.14-1-170/A, Tulasi Nagar, Allapur, Borabanda, Hyderabad 500018, Has Changed my son Name from PITTA ...

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలు ప్రత్యేకించి వారి ఉద్యోగ ప్రకటనలు, వ్యాపారం, క్రయవిక్రయాలు లాంటివి సంప్రదింపులు చేసే ముందు పాఠకులు తగిన విచారణ చేసుకోవాలి. ప్రకటనలకు సంబంధించి ప్రకటనకర్తలదే బాధ్యత. ఆంధ్రజ్యోతి ఎలాంటి బాధ్యత వహించదు. సంస్థకు సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించిన వ్యవహారాలలో ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించాలి.

మేనేజర్ - ADVT

క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.

99859 21380, 99859 21386, 97036 18806



స్వశక్తితో ఉన్నత స్థానాలకు ఎదిగి, తమ తమ రంగాల్లో శక్తిమంతులుగా గుర్తింపు పొందిన కొందరు మహిళల జాబితాను 'ఫోర్బ్స్' పత్రిక ఇటీవల విడుదల చేసింది. ఆయుర్వేద ఉత్పత్తుల రంగంలో అంతర్జాతీయ బ్రాండ్ వ్యవస్థాపకురాలైన 69 ఏళ్ల మీరా కులకర్ణి, దేశంలో అత్యున్నత మానసిక వైద్య సంస్థకు డైరెక్టర్‌గా తనదైన ముద్ర వేస్తున్న 64 ఏళ్ల డాక్టర్ ప్రతిమా మూర్తి వారిలో ఉన్నారు.



స్వశక్తి 'సంపన్నులు'

నమ్మకమే ఆమె ధైర్యం

పుట్టిన ఊరైన ఢిల్లీలో, ప్రకృతి సౌందర్యంతో అలరాలే సిమ్లాలోని హాస్టల్స్‌లో ఆడుతూ పాడుతూ గడిచిపోయిన రోజుల తరువాత.... కఠినమైన జీవన వాస్తవికత మీరా కులకర్ణి అనుభవంలోకి వచ్చింది. "దానికి కారణం నేను తీసుకున్న నిర్ణయమే" అంటారామె. మీరాను విదేశాల్లో చదివించాలని ఆమె తండ్రి కోరిక. మరోవైపు పెళ్లి సంబంధం వచ్చింది. "పుట్టిన దేశాన్ని, కన్నవారిని వదిలేసి... కొత్త చోటుకు వెళ్లాలనే ఆలోచన నాకు భయంగా అనిపించింది. అందుకే పెళ్లికి ఒప్పుకున్నాను. కానీ వెనక్కి తిరిగి చూసుకుంటే... 'నాకు ఏమాత్రం తెలియని వ్యక్తిని ఎలా పెళ్లి చేసుకోగలిగాను? అది నాకు భయంగా ఎందుకు అనిపించలేదు?' అనే ప్రశ్నకు నా దగ్గర సరైన సమాధానం లేదు" అని చెబుతారు మీరా. పెళ్ళయ్యాక... ఢిల్లీ నుంచి వ్యాపారస్తుడైన భర్తతో కలిసి చెన్నైలో కాపురం. కానీ అప్పటికే ఆమె భర్త వ్యాపారం నష్టాల్లో ఉంది. దానికి తోడు అతనికి మద్యపాన వ్యసనం. నాలుగేళ్లు గడిచాక... భర్త వేధింపులను భరించలేని ఆమె... ఇద్దరు పిల్లలతో మళ్లీ ఢిల్లీ వచ్చేశారు. చిన్న చిన్న పనులు చేస్తూ, తల్లిదండ్రుల సాయంతో పిల్లల్ని పెంచుతూ, ఒంటరి తల్లిగా మీరా సాగిస్తున్న జీవితం... ఆయుర్వేద సబ్బుల తయారీతో కొత్త మలుపు తిరిగింది.

నమ్మకంతో ధైర్యం చేశాను...

"మన దేశంలో తయారవుతున్న సబ్బుల్లో నాణ్యత లేదని తెలుసుకున్నాక... ప్రాచీన ఆయుర్వేద పద్ధతుల్లో నేనే వాటిని తయారు చేయాలనుకున్నాను. ఋషీకేశ్‌ను ఆయుర్వేదానికి పుట్టినిల్లు అంటారు. అక్కడ నిపుణులను కలిసి... కొన్ని పద్ధతులు తెలుసుకున్నాను. అయితే ఆ పద్ధతుల్లో సబ్బుల తయారీ చాలా ఖరీదైనది. కానీ ఆ పద్ధతిలో తయారు చేస్తే తప్ప వాటిలో నాణ్యత ఉండదు. మంచి ఉత్పత్తులకు ఆదరణ ఉంటుందని నా నమ్మకం. అందుకే ధైర్యం చేశాను. ప్రయోగాలు కొనసాగించి... కొన్ని సబ్బులు చేశాను. తెలిసిన వారికి, కొన్ని దుకాణాలకు ఇచ్చాను. మెల్లగా మొదలైనా... కొన్నవారే మళ్లీ మళ్లీ కొనడం, వారి సిఫార్సుతో కొత్త కస్టమర్లు రావడంతో అమ్మకాలు వేగం అందుకున్నాయి. దాన్ని పూర్తిస్థాయి వ్యాపారంగా మార్చాలనే ఆలోచన 2000 సంవత్సరంలో వచ్చింది. రెండు లక్షల పెట్టుబడి, ఇద్దరు ఉద్యోగులతో 45 ఏళ్ల వయసులో 'ఫారెస్ట్ ఎసెన్షియల్స్' ప్రారంభించాను" అని గుర్తు చేసుకున్నారు మీరా. ఇప్పుడు మేనేజింగ్ డైరెక్టర్‌గా ఆ సంస్థను నడిపిస్తున్నారు.

> 'డెబ్భై శాతం తగ్గింపు అంటూ ఊరించే నకిలీ, నాసిరకం ఆయుర్వేద ఉత్పత్తులు మార్కెట్‌లో కుప్పలుతెప్పలుగా కనిపిస్తాయి. అలాంటి జిమ్మిక్కులను మేము ఎప్పుడూ నమ్ముకోలేదు.

వారే ప్రచారకర్తలు

గత పాతికేళ్లలో 'ఫారెస్ట్ ఎసెన్షియల్స్' శరవేగంతో విస్తరించింది. ఒక విదేశీ కంపెనీ పెట్టుబడి పెట్టడంతో కొత్త ఉత్పత్తుల తయారీకి వీలు కలిగింది. ఫేషియల్, బాడీ, వెల్‌నెస్... ఇలా పలు విభాగాల్లో కొన్ని పదుల ఉత్పత్తులను మీరా బృందం రూపొందించింది. లగ్జరీ ఆయుర్వేదిక్ బ్రాండ్‌గా ఖ్యాతి సంపాదించింది. దేశంలో ఈ సంస్థకు 130కి పైగా స్టోర్స్ ఉన్నాయి. 120 దేశాలకు వారి ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. ఈ క్రమంలో మీరాకు, ఆమె బ్రాండ్‌కు పలు పురస్కారాలు లభించాయి. దేశంలో ప్రభావవంతమైన మహిళగా 'ఫోర్బ్స్' తదితర జాబితాల్లో మీరా పేరు చోటు చేసుకుంది. ఈ రోజు ఎలాంటి రుణాలు లేని వందల కోట్ల బ్రాండ్‌గా ఆమె సంస్థ నిలిచింది. "డెబ్భై శాతం తగ్గింపు అంటూ ఊరించే నకిలీ, నాసిరకం ఆయుర్వేద ఉత్పత్తులు మార్కెట్‌లో కుప్పలుతెప్పలుగా కనిపిస్తాయి. అలాంటి జిమ్మిక్కులను మేము ఎప్పుడూ నమ్ముకోలేదు. ప్రకటనలకు ఖర్చు పెట్టం. మా వినియోగదారులే మాకు ప్రచారకర్తలు" అంటారు మీరా. 'ఎసెన్షియల్లీ మీరా' పేరుతో ఆమె రాసిన ఆత్మకథ మంచి ఆదరణకు నోచుకుంది.

మనసు గుట్టు కనిపెడుతూ..

ఎంబీబీఎస్ చెయ్యాలి. డాక్టర్‌గా పేరు తెచ్చుకోవాలి... ఇది ప్రతిమామూర్తి చిన్ననాటి కల. అనుకున్నట్టే బెంగళూరు వైద్య కళాశాలలో సీటు సంపాదించారు. క్రమంగా... ఆలోచనలు, మెదడు మానవులను, వారి ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తాయనే విషయం మీద ఆసక్తి పెరిగింది. ఎంబీబీఎస్ పూర్తి చేసిన వెంటనే... 'నిమ్హాన్స్' (జాతీయ మానసిక, నరాల విజ్ఞాన సంస్థ)లో డీపీఎం, ఎండీ (సైకలాజికల్ మెడిసిన్) పూర్తి చేశారు. ఆ తరువాత.... బ్రిటన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ మాంచెస్టర్‌లో సైకలాజికల్ మెడిసిన్‌లో డిప్లమా చేశారు. అప్పట్లో ఆమె ఆసక్తి వేరే వైద్య విభాగం మీదకు మళ్లితే... దేశం ఒక గొప్ప సైకియాట్రిస్టును కోల్పోయేదంటారు ఆమె గురించి తెలిసిన వైద్య నిపుణులు. తన రంగంలో అత్యున్నతంగా నిలవడమే కాదు... దేశంలోనే అతి పెద్ద మానసిక ఆరోగ్య సంస్థ 'నిమ్హాన్స్'కు డైరెక్టర్ స్థాయికి ఎదిగారు. ఆ పదవిని చేపట్టిన రెండో మహిళగా, తొలి మహిళా సైకియాట్రిస్ట్‌గా ఆమె చరిత్రకెక్కారు. 2021లో ఆ బాధ్యతలను ప్రతిమ స్వీకరించిన సమయానికి... దేశం కొవిడ్ కల్లోలంలో ఉంది. "కొవిడ్ మహమ్మారి ఏదో ఒక మేరకు అందరినీ మానసికంగా ప్రభావితం చేసింది. సరైన వైద్య సాయం అందకపోవడం వల్ల ఆ సమస్యలు కొందరిలో కొనసాగుతున్న పరిస్థితిని చూస్తున్నాం" అంటారు ప్రతిమ.

జాతీయ సర్వేకి సారథ్యం...

ప్రత్యక్షంగానైనా, జూమ్ లాంటి మాధ్యమాల ద్వారా అయినా... సమస్యలను ఆమె చాలా ఓపికగా వింటారు. సాధ్యమయ్యే పరిష్కారాలు చెబుతారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, సెంటర్ ఫర్ అడిక్షన్ మెడిసన్‌కు అధిపతి, సైకియాట్రీ విభాగాధిపతి, ఇప్పుడు డైరెక్టర్... ఇలా తన వృత్తి జీవితంలో ఏ దశలో ఉన్నా ఆమె నిబద్ధతలో మార్పు లేదు. "నిమ్హాన్స్... కేవలం మానసిక ఆరోగ్యానికి మాత్రమే కాదు.. న్యూరో సర్జరీ, న్యూరాలజీ, న్యూరో రేడియాలజీ లాంటి అనేక అంశాల్లో సేవలు అందించే సంస్థ. నేను చదువుకున్న సంస్థకే డైరెక్టర్ కావడం నా బాధ్యతను మరింత పెంచింది" అంటున్నారు ప్రతిమ. కరోనా అనంతరం దేశంలోని మానసిక ఆరోగ్య పరిస్థితుల గురించి మరింత తెలుసుకోవడానికి దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రస్తుతం జరుగుతున్న 'నేషనల్ మెంటల్ హెల్త్ సర్వే'కి ఆమె సారథ్యం వహిస్తున్నారు. "ఇలాంటి సర్వే మొదటిసారి పదేళ్ల క్రితం... పన్నెండు రాష్ట్రాల్లో జరిగింది. దేశంలోని ప్రతి పదిమందిలో ఒకరు గుర్తించదగిన మానసిక ఆరోగ్య వైకల్యాలతో బాధపడుతున్నారని, అర్హులైన మానసిక ఆరోగ్య నిపుణుల కొరత ఉందని ఆ సర్వే వెల్లడించింది. రెండవది అయిన తాజా సర్వే వివరాలను వచ్చే ఏడాది ప్రచురిస్తాం. గ్రామీణ, పట్టణ, గిరిజన ప్రాంతాల్లో, వలస కార్మికుల్లో కొవిడ్ అనంతర పరిణామాలను ఈ సర్వేలో ప్రధానంగా అధ్యయనం చేస్తున్నాం" అని ఆమె చెబుతున్నారు.

> 1980ల్లో నేను డిప్లమా చేస్తున్నప్పుడు ఒక బ్యాచ్‌లో పదిమంది ఉంటే ఇద్దరే అమ్మాయిలు ఉండేవారు. ఇప్పుడు 40 మందిని పోస్ట్ గ్రాడ్యుషన్‌కు తీసుకుంటున్నాం. వారిలో సగానికి పైగా అమ్మాయిలే. ఇది మంచి పరిణామం"

22 భాషల్లో కౌన్సెలింగ్

"మానసిక వైద్యనిపుణులుగా మహిళల సంఖ్య పెరిగి, నాయకత్వ స్థానాల్లో ఉండాల్సిన అవసరం ఎంతో ఉంది. 1980ల్లో నేను డిప్లమా చేస్తున్నప్పుడు ఒక బ్యాచ్‌లో పది మంది ఉంటే ఇద్దరే అమ్మాయిలు ఉండేవారు. ఇప్పుడు దాదాపు 40మందిని పోస్ట్ గ్రాడ్యుషన్‌కు తీసుకుంటున్నాం. వారిలో సగానికి పైగా అమ్మాయిలే. ఇది మంచి పరిణామం" అంటున్న ప్రతిమ... 'నిమ్హాన్స్'లో సరికొత్త మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. 2022లో కేంద్రం ప్రవేశపెట్టిన 'నేషనల్ టెలీ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్'కు ఆమె నాయకత్వం వహిస్తున్నారు. "ఆ ఏడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది మార్చి వరకూ ఈ ప్రోగ్రామ్ హెల్ప్‌లైన్ ద్వారా దేశవ్యాప్తంగా 19 లక్షల మంది రిజిస్టర్ అయ్యారు. ప్రతి రాష్ట్రంలో సుశిక్షితులైన కౌన్సెలర్లు.. 22 భాషల్లో వారి ఇబ్బందులు విని, సలహాలు ఇస్తారు" అని వివరించారు. ఆమె నేతృత్వంలోనే 'నిమ్హాన్స్'కు ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి కిందటి ఏడాది 'నెల్సన్ మండేలా అవార్డ్ ఫర్ హెల్త్ ప్రమోషన్' లభించింది. వ్యక్తిగతంగా కర్ణాటక ప్రభుత్వం నుంచి 'డాక్టర్ రాజా రామన్న రాజ్య పురస్కారం' సహా అనేక గౌరవాలను ప్రతిమ అందుకున్నారు. 300కు పైగా పరిశోధనా పత్రాలు జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. "వైద్యులు ఉన్నది రోగుల సేవ కోసమే. వారి ఇబ్బందులు తీరే మార్గాలను సూచించాలి. అన్నిటికన్నా వారికి మన పట్ల, మనం అనుసరించే వైద్య పద్ధతుల పట్ల నమ్మకం కలిగించడం ముఖ్యం. నా వృత్తి జీవితంలో నేను కట్టుబడి ఉన్న అంశం అదే" అంటున్నారు ప్రతిమ.

కౌన్సెలింగ్

కొత్త తల్లికి నిస్పృహ ఎందుకు?

డాక్టర్, నాకు ఇటీవలే ప్రసవమైంది. తల్లిని అయినందుకు ఉప్పొంగిపోవడానికి బదులుగా తెలియని నిరాశ, నిస్పృహలు వేధిస్తున్నాయి. నాకు ఎందుకు ఇలా జరుగుతోంది?

- ఓ సోదరి, హైదరాబాద్

పేగు తెంచుకుని పుట్టిన పసికందు మీద తల్లికి అవ్యాజ్యమైన ప్రేమ కలగడం సహజమే! కానీ కొందరు బాలింతల్లో 'పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్' అనే సమస్య తలెత్తుతుంది. ప్రతి ఏడుగురు బాలింతల్లో ఒకరు పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్ బారిన



పడుతూ ఉంటారు. ఇది ప్రసవమైన వెంటనే కనిపించవచ్చు, లేదా బిడ్డకు ఏడాది వయసొచ్చే లోపు జరగొచ్చు. అయితే ఎక్కువగా ఈ సమస్య ప్రసవమైన 3 వారాల్లోగానే తలెత్తుతూ ఉంటుంది. నిరాశలో కూరుకుపోవటం, జీవితం మీద ఆసక్తి కోల్పోవటం, అకారణంగా ఏడుస్తూ ఉండటం లాంటి లక్షణాలు ఈసమస్యలో కనిపిస్తాయి. ఈ డిప్రెషన్‌కు లోనయిన తల్లులు...బిడ్డను సరిగా చూసుకోలేనేమో, తల్లిగా బాధ్యతను సమర్థంగా నిర్వహించలేనేమో, బిడ్డకు ప్రేమను సంపూర్తిగా అందించలేనేమో అనే చిత్రమైన మానసిక స్థితికి లోనవుతూ ఉంటారు. అయితే ఇలాంటి డిప్రెషన్ గురించి భయపడాల్సిన పని లేదు. ప్రసవంతో హెచ్చుతగ్గులకు లోనయ్యే శరీరంలోని హార్మోన్లు, పూర్వం డిప్రెషన్ బారిన పడి ఉండటం, విపరీతమైన ఒత్తిడితోపాటు, కుటుంబ సభ్యుల తోడ్పాటు కొరవడటం లాంటి కారణాల వల్ల తల్లులు పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్‌కు గురవుతారు. అయితే ఈ సమస్యను 'యాంటీ డిప్రెసెంట్స్'తో చికిత్స చేసి సరిదిద్దవచ్చు. ఈ మందులు డిప్రెషన్‌కు కారణమయ్యే మెదడులోని కొన్ని రసాయనాలను సంతులనపరిచి సమస్యను తొలగిస్తాయి. ఈ మందుల వల్ల తల్లి పాలు తాగే పిల్లలకు ఎలాంటి దుష్ప్రభావాలూ కలగవు. కాబట్టి డిప్రెషన్ తాలూకు లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వైద్యులను కలిసి చికిత్స తీసుకోవాలి.

- డాక్టర్ దినేష్ కుమార్ చిర్ల,
పీడియాట్రీషియన్ అండ్ నియో నాటాలజిస్ట్,
హైదరాబాద్.

పిల్లలను హాస్టల్‌కు పంపే ముందు...

ఒక్కోసారి పిల్లలను చదువు నిమిత్తం పాఠశాల స్థాయిలోనే హాస్టల్‌కి పంపాల్సి ఉంటుంది. అలాంటప్పుడు తల్లిదండ్రులు ముందుగానే పిల్లలకు కొన్ని విషయాలను నేర్పించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.



- పిల్లలకు బాధ్యతగా వ్యవహరించడం నేర్పించాలి. చిన్న చిన్న పనులు చెప్పి చేయిస్తూ ఉంటే వాళ్లకి పనులు చేయడం అలవాటు అవుతుంది.
- సమయానుసారం దినచర్య, వ్యాయామం పూర్తిచేసేలా అలవాటు చేయాలి. క్రమశిక్షణతో ఉండడం నేర్పించాలి.
- పుస్తకాలు సహా దుస్తులు, ఇతర వస్తువులను భద్రపరచుకునే విధానాలు తెలియజెప్పాలి.
- పిల్లలు కొత్త చోట ఉండడానికి భయపడుతూ ఉంటారు. అలాకాకుండా వారిని వెన్నంటి ప్రోత్సహిస్తే ఎప్పటికప్పుడు ఎలాంటి పరిస్థితులలోనైనా సర్దుకుపోవడాన్ని అలవాటు చేసుకుంటారు.
- పిల్లలకు ఆలోచించి నిర్ణయం తీసుకోవడం ఎలానో నేర్పించాలి. ఏ సందర్భాన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలియజెప్పాలి. దీంతో వాళ్లు ఎక్కడైనా ధైర్యంగా ఉండగల్గుతారు.
- అనుకోకుండా ఏదైనా పొరబాటు జరిగితే దాని నుంచి పాఠం నేర్చుకోవడం ఎలానో వివరించి చెప్పాలి.
- ఇతరులను గౌరవించడం, స్నేహపూర్వకంగా మాట్లాడడం, సంయమనంతో మెలగడం లాంటివి నేర్పించాలి.
- పరస్పరం సహాయ సహకారాలు అందించుకోవడం, ఇచ్చిపుచ్చుకునే విధానాల గురించి వివరించాలి.
- బడిలో చెప్పిన పాఠాలను ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ నిర్ణీత సమయంలో హోమ్‌వర్క్‌లు పూర్తి చేయడాన్ని అలవాటు చేయాలి.
- చిన్న చిన్న ఆరోగ్య సమస్యల గురించి వివరిస్తూ వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజెప్పాలి.
- ఆహారం తీసుకోవడం, ఆటలు ఆడడం, చదువుకోవడం, వ్యక్తిగత శుభ్రత లాంటివి పాటించడంలో నిర్లక్ష్యం వహించకూడదని పిల్లలకు వివరించాలి.



'ఆమ్ పన్నా' కొత్తగా

ప్రస్తుతం మనకు పుల్లని పచ్చి మామిడికాయలు లభ్యమవుతున్నాయి. వీటిలో విటమిన్-సి అధికంగా ఉంటుంది. వీటితో చేసిన 'ఆమ్ పన్నా' తాగితే వేసవి తాపం తీరుతుంది. ఆమ్ పన్నా ఎలా తయారు చేయవచ్చో తెలుసుకుందాం.

తయారీ విధానం

- ఒక చెంచా జీలకర్రను తీసుకొని దోరగా వేయించి చల్లార్చాలి. పది పుదీనా ఆకులు, పావు చెంచా మిరియాలు, రెండు చెంచాల బెల్లపు పొడి, తగినంత ఉప్పును ఒక మూకుడులో వేసి వేయించాలి. జీలకర్ర సహా వీటన్నింటినీ మిక్సీలో మెత్తగా పొడి చేసి పెట్టుకోవాలి.
- రెండు మీడియం సైజు మామిడి కాయలను తీసుకొని... వాటిని ప్రెషర్‌కుక్కర్‌లో మెత్తగా ఉడికించాలి. ఈ మామిడి కాయల తొక్కలను తీసి లోపల గుజ్జును తీయాలి.
- ముందుగా చేసుకున్న పొడిని.. ఈ గుజ్జును.. మిక్సీలో వేసి బాగా తిప్పాలి. దీనిని ఒక కంటైనర్‌లో భద్రపరుచుకోవాలి. ఇది పది రోజుల దాకా పాడుకాదు. కావాలనుకున్నప్పుడు ఈ మిశ్రమాన్ని గ్లాసులో సగం వేసి చల్లటి నీళ్లలో కలుపుకోవాలి. సోడాలో కలుపుకున్నా బాగుంటుంది.
- కేవలం మామిడి రుచి మాత్రమే కావాలనుకొనేవారు పుదీనా ఆకులు వేయాల్సిన అవసరం లేదు.

సెలబ్ ఫిట్

ఆరోగ్యమే అందం

ఆమె గాత్రం... సమ్మోహనాస్త్రం. రాగం... సుస్వరాల సంగమం. బాలీవుడ్ అగ్రతారలకు ఏమాత్రం తీసిపోని అభిమాన గణం. దేశ విదేశీ వేదికలపై తన పాటతో మైమరిపిస్తున్న ప్రముఖ గాయని నేహా కక్కర్. గానంతోనే కాకుండా... రియాలిటీ షోలకు న్యాయనిర్ణేతగా... ఫ్యాషన్ ఐకాన్‌గా... యువతరానికి ప్రేరణగా నిలుస్తోంది నేహా. 'మిమ్మల్ని నిత్యనూతనంగా ఉంచుతున్నది ఏంట'ని అడిగితే... క్రమం తప్పని వ్యాయామం, ఆహారపు అలవాట్లే అంటుంది తడుముకోకుండా.

మొన్నామధ్య ఒక వివాదం... ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో కన్సర్ట్‌కు నేహా మూడు గంటలు ఆలస్యంగా వచ్చిందని. ఈ గొడవలో ఇంటా బయట ఆమెపై విమర్శలు వెల్లువెత్తాయి. వీటన్నిటినీ మౌనంగా భరించిన నేహా... కార్యక్రమం అయిన కొన్ని రోజులకు అసలు విషయం చెప్పింది.. నిర్వాహకులు తనకు, తన బ్యాండ్‌కు అసలు డబ్బులే ఇవ్వలేదని! 'నేను ఆలస్యంగా వచ్చానంటూ నాపై నిందలు మోపారు. కానీ నాకు గానీ, నా బృందానికి గానీ ఏమైందని ఎవరన్నా అడిగారా? నిర్వాహకులు నాకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా పారిపోయారు. నా కోసం వచ్చిన అభిమానులను నిరాశపరచకూడదని ఆ షో నేను ఉచితంగా చేశాను. మాకే కాకుండా సౌండ్ సిస్టమ్ వారికి కూడా పేమెంట్ అందలేదు. దాంతో వారు షో వదిలేసి వెళ్లిపోయారు. ఆఖరి నిమిషంలో నా భర్త రోహన్‌ప్రీత్‌సింగ్ తోడ్పాటుతో కన్సర్ట్ నిర్వహించగలిగాను. వేదిక మీద మాట్లాడినప్పుడు ఈ విషయాలేవీ నేను చెప్పలేదు. కారణం... నావల్ల ఎవరికీ నష్టం జరగకూడదని అనుకున్నాను. కానీ ఇప్పుడు అందరూ తప్పు నాదేనంటూ మాట్లాడుతుంటే... ఆ అపవాదు చెరిపేసుకోవడానికే వాస్తవం ఏమిటో చెప్పాను' అంటూ తన ఆవేదన పంచుకున్న నేహాకు విమర్శలు, ఎత్తిపొడుపులు కొత్తేమీ కాదు. సామాజిక మాధ్యమాల్లో తరచూ ఆమెపై అవాస్తవ కథనాలు పుట్టుకొస్తూనే ఉంటాయి. భర్తతో విడిపోతుందని ఒకసారి... ఆరోగ్యం విషమించిందని మరొకసారి... ఎవరికి ఇష్టంవచ్చినట్టు వారు దుష్ప్రచారం చేస్తూనే ఉన్నారు. అయితే వీటన్నిటినీ పక్కన పెట్టేసి తన పని తాను చేసుకొంటూ వెళుతుంది 36 ఏళ్ల నేహా.

గాయకుల కుటుంబం...

ఉత్తరాఖండ్‌లోని రుషికేశ్‌లో పుట్టిన నేహా... నాలుగేళ్ల వయసులోనే పాటలు పాడటం మొదలుపెట్టింది. తమ కూతురి ఆసక్తిని ఆమె తల్లిదండ్రులు గుర్తించారు. తనకు మంచి శిక్షణ ఇప్పించాలని ఢిల్లీకి వచ్చి స్థిరపడ్డారు. చిన్న చిన్న వేదికలపై ఆధ్యాత్మిక గీతాలు పాడుతున్న నేహా... పదహారేళ్ల వయసులో అన్నయ్యతో కలిసి ముంబయికి వెళ్లింది. ఆమె అన్న టోనీ, అక్క సోను కక్కర్ కూడా గాయకులే. ముంబయి వెళ్లాక 2005లో టీవీ రియాలిటీ షో 'ఇండియన్ ఐడల్ సీజన్2'లో పోటీపడింది. కానీ ఆరంభంలోనే ఎలిమినేట్ అయింది. మూడేళ్ల తరువాత 'నేహా ద రాక్‌స్టార్' పేరిట తొలి ఆల్బమ్ విడుదల చేసింది. అదే ఏడాది సుఖ్వీందర్‌సింగ్‌తో కలిసి 'మీరాబాయ్ నాటౌట్'లో 'హై రామా' గీతం ఆలపించింది. అదే ఆమెకు తొలి సినిమా పాట. ఆ తరువాత తెలుగు, కన్నడ సినిమాల్లో కూడా పలు పాటలు పాడింది. 2012లో విడుదలైన 'కాక్‌టైల్'లో 'సెకండ్‌హ్యాండ్ జవానీ' పాట సూపర్‌హిట్ కావడంతో నేహా కెరీర్ మలుపు తిరిగింది. ఇక్కడి నుంచి వరుసపెట్టి ఎన్నో హిట్ పాటలు ఆలపించింది. 'ఇండియన్ ఐడల్' తదితర రియాలిటీ షోలకు న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తోంది. వీటితోపాటు దేశవిదేశాల కన్సర్ట్స్‌లో తన గాత్రంతో అలరిస్తోంది.



అభిమానం 'కోట్లు' దాటింది...

బాలీవుడ్ అగ్ర తారలకు దీటుగా నేహాకు ఇన్‌స్టాగ్రామ్‌లో 7.8 కోట్లమంది ఫాలోవర్స్ ఉన్నారు. ఆమె యూట్యూబ్ చానల్‌ను దాదాపు కోటిన్నరమంది సబ్‌స్క్రైబ్ చేశారు. ఫేస్‌బుక్, ఇతర మాధ్యమాల్లోని అభిమానగణం దీనికి అదనం. ప్రతి పోస్టుకూ లక్షల్లో వ్యూస్, లైక్‌లు. నటుడు హిమాన్ష్ కోహ్లీతో నాలుగేళ్లు ప్రేమాయణం నడిపిన నేహా... అతడిని పెళ్లి చేసుకొంటున్నట్టు కూడా ప్రకటించింది. అయితే కొద్ది రోజుల్లోనే తామిద్దరం విడిపోయామని ట్వీట్ చేసింది. 2020లో పంజాబీ సంగీత కళాకారుడు రోహన్‌ప్రీత్‌సింగ్‌ను పెళ్లాడింది. వృత్తిగత జీవితంలో ఎంత బిజీగా ఉన్నా... వ్యక్తిగత జీవితానికి కూడా సమయం కేటాయిస్తుంది ఈ గాయని. రోజంతా తనను తాను ఉల్లాసంగా ఉంచుకోవడానికి క్రమం తప్పకుండా వ్యాయామాలు చేస్తుంది. ఆహార నియమాలు పాటిస్తుంది. అందుకే కాలం మారుతున్నా... నేహా అందం మాత్రం తరగడంలేదు.

వర్కవుట్ ఇలా...

ఎంత పని ఒత్తిడి ఉన్నా అదేపనిగా కుర్చీకి అతుక్కుపోదు నేహా. ముఖ్యంగా తిన్న తరువాత. గంటలతరబడి కూర్చొంటే ఊబకాయంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు ఎన్నో చుట్టుముడతాయని అంటుంది ఈ భామ. ఎప్పుడూ చురుగ్గా, రోజంతా ఉత్సాహంగా ఉండేందుకు ప్రయత్నిస్తుంది. దాని కోసం నిత్యం వ్యాయామాలు చేస్తుంది. జిమ్‌కు వెళ్లామా... లేదా అన్నది ఆమెకు ప్రధానం కాదు. వీలైతే ఇంట్లోనే వర్కవుట్స్ ముగిస్తుంది. జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంటుంది.

- ఉదయం యోగాతో నేహా రోజు మొదలవుతుంది. బరువు తగ్గడానికి యోగా తనకు ఎంతో సహకరించిందని అంటుంది ఆమె. అంతేకాదు... అదనపు కేలరీలు, కొవ్వు కరిగిపోయి, శరీరం నాజూకుగా తయారవుతుంది. అందుకే తన జీవనశైలిలో యోగా లేని రోజంటూ ఉండదని అంటుంది.
- జాగింగ్, రన్నింగ్. బరువు తగ్గడానికి ఇది మంచి కార్డియో ఎక్సర్‌సైజ్.
- 'వర్కవుట్స్ కోసం జిమ్ మీద ఆధారపడను. ఎందుకంటే ఎడతెరిపిలేని షెడ్యూల్స్‌వల్ల ఒక్కోసారి జిమ్‌కు వెళ్లడం కుదరకపోవచ్చు. అందుకే నా వ్యాయామాల్లో అధిక శాతం ఇంట్లో చేసేవే ఉంటాయి' అంటున్న నేహా.. అందుకు తగినట్టుగానే తన వర్కవుట్స్‌ను డిజైన్ చేసుకుంది.
- పుషప్స్‌కు ఎక్కువ సమయం కేటాయిస్తుంది.
- అధిక బరువుల జోలికి పోదు. డంబెల్స్ లాంటి తేలికపాటి బరువు గల వెయిట్స్‌తో సాధన చేస్తుంది.

ఇంటి వంటకే ఓటు...

నేహా నమ్మిన సూత్రం ఇది. అందుకే ఆరోగ్యకరమైన, క్రమశిక్షణగల జీవన శైలికి అధిక ప్రాధాన్యం ఇస్తుంది. తీసుకొనే ఆహారంలో పోషక విలువలు పుష్కలంగా ఉండేలా చూసుకొంటుంది. సాధ్యమైనంతవరకు ఇంటి వంట తినడానికే ప్రయత్నిస్తుంది.

- రోజుకు కనీసం మూడు నుంచి నాలుగు లీటర్ల మంచి నీళ్లు తాగుతుంది నేహా. అలాగే కొబ్బరి నీళ్లు కూడా తీసుకొంటుంది. ఇవి శరీరం డీహైడ్రేషన్‌కు గురి కాకుండా కాపాడతాయి. చర్మాన్ని ప్రకాశవంతంగా, మృదువుగా ఉంచడంలో దోహదపడతాయి.
- పండ్ల రసాలు ఎక్కువగా తాగుతుంది. పార్టీలకు వెళ్లినా జ్యూస్‌లు, మిల్క్ షేక్‌లు, సూప్స్ లాంటి ఆరోగ్యకరమైన, బలవర్ధకమైనవే తీసుకొంటుంది.
- నేహాకు కాఫీ చాలా ఇష్టం. కానీ అప్పుడప్పుడు మాత్రమే తాగుతుంది. సేంద్రియ ఎరువులతో పండిన ఆహార పదార్థాలనే వంటకు ఉపయోగిస్తుంది.



చిన్నారిపై వీధి కుక్కల దాడి


గాయపడిన చిన్నారి

చిట్యాల/వరంగల్ మెడికల్ ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): చిన్నారిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపర్చిన సంఘటన భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం జడల్‌పేట శివారు గాంధీనగర్‌లో బుధవారం చోటుచేసుకుంది. గాంధీనగర్‌కు చెందిన రత్న రమేశ్ ఇంటి సమీపంలో ఉన్న వ్యవసాయ పొలం వద్ద భూమి చదును పనులు చేయిస్తున్నాడు. ఇంటి నుంచి తల్లిదండ్రుల వద్దకు వెళ్తున్న బాలిక రత్న నైనిషాపై వీధి కుక్కలు విచక్షణ రహితంగా దాడిచేశాయి. మెడ, భుజం, వీపుపై తీవ్రంగా గాయపర్చాయి. గమనించిన కుటుంబ సభ్యులు పరుగులు తీసి కుక్కల నుంచి బాలికను కాపాడారు. దాడిలో తీవ్రంగా గాయాలపాలైన నైమిషాను చిట్యాల సామాజిక ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. కుక్కలు చిన్నారిని మూడు చోట్ల కరవడంతో బలమైన గాయాలయ్యాయి. ప్రస్తుతం బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

మహిళా సాధికారత కమిటీ చైర్‌పర్సన్‌గా పురందేశ్వరి

- సభ్యులుగా ఎంపీలు డీకే అరుణ, కడియం కావ్య

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత కమిటీ చైర్‌పర్సన్‌గా రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి నియమితులయ్యారు. ఈ కమిటీ వివరాలను లోక్‌సభ సెక్రటరీ జనరల్ బుధవారం వెల్లడించారు. కమిటీలో సభ్యులుగా తెలంగాణకు చెందిన ఎంపీలు డీకే అరుణ, కడియం కావ్యలకు అవకాశం దక్కింది. ఈ కమిటీలో మొత్తం 20 మంది సభ్యులను నియమించాల్సి ఉండగా 18 మంది పేర్లను ప్రకటించారు. మరో ఇద్దరు సభ్యులను నియమించాల్సి ఉందని పేర్కొన్నారు.

ఫినాయిల్, సబ్బుల పైసలు నొక్కేశారు!

- చర్లపల్లి జైలు పారిశ్రామిక యూనిట్‌లో రూ.25 లక్షల గోల్‌మాల్
- క్యాంటీన్‌లో లెక్కల్లోలేని రూ. 7 లక్షలు...
- పెట్రోల్ బంకు డబ్బుల్లోనూ తేడా.. విచారణకు ఆదేశం

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి కేంద్ర కారాగారం పారిశ్రామిక యూనిట్‌లో పెద్ద మొత్తంలో అవినీతి, అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఖైదీల ప్రవర్తనలో మార్పు తెచ్చి, జైలు నుంచి విడుదలైన తర్వాత వారి జీవనోపాధి పొందేందుకు వీలుగా పారిశ్రామిక యూనిట్‌లో వారితో పనిచేయిస్తుంటారు. ఖైదీలు తయారు చేసిన వస్తువులను బయటి మార్కెట్‌లో విక్రయించి అధికారులు పెద్ద మొత్తంలో దారిమళ్లించారు. విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ఆ శాఖ డీజీ విచారణకు ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయా జైళ్లల్లో ఖైదీలు తయారు చేసే వస్తువులకు బయటి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. డిమాండ్ మేరకు 'మై నేషన్' బ్రాండ్ పేరుతో ఖైదీలు తయారు చేసిన వస్తువులను అధికారులు బయటి మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. చర్లపల్లి సెంట్రల్ జైలు పారిశ్రామిక యూనిట్‌లో ఖైదీలు తయారు చేసిన ఫినాయిల్, సబ్బులు, చేతి రుమాలు, టవళ్లు, ఇనుప వస్తువులు, ఫర్నీచర్ ఇతర సామగ్రి మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. గతంలో జైలు సూపరింటెండెంట్‌గా పనిచేసిన అధికారి హయాంలో పారిశ్రామిక యూనిట్‌లో లెక్కల్లో సుమారు రూ. 25 లక్షల మేర తేడా ఉన్నట్లు ఇటీవల అధికారులు గుర్తించారు. క్యాంటిన్‌లో రూ.7 లక్షలకుపైగా గోల్‌మాల్ జరిగినట్లు తేలింది. చర్లపల్లి జైలు ఆధ్వర్యంలో కొనసాగే పెట్రోల్ బంకు ఆదాయంలోనూ పెద్దమొత్తంలో తేడా జరిగినట్లు తేలింది. విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా నిధుల గోల్‌మాల్‌పై సమగ్ర విచారణ జరిపేందుకు ఐదుగురు అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసారు. వారం రోజుల్లోగా సమగ్ర నివేదిక అందజేయాలని కమిటీని ఆదేశించారు. డీజీ ఆదేశాల మేరకు బుధవారం మొదటి రోజు కమిటీ చర్లపల్లి జైలును సందర్శించి విచారణ మొదలు పెట్టింది. రికార్డుల పరిశీలించింది. కాగా చర్లపల్లి జైలు పారిశ్రామిక యూనిట్‌లో నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో స్టాక్ బుక్ కీలకంగా మారనుంది. యూనిట్‌లో వస్తువుల తయారీకి సంబంధించిన సమాచారం మొత్తం స్టాక్ బుక్‌లో నమోదు చేస్తారు. స్టాక్ బుక్‌లో నమోదు చేసిన వస్తువులు, బయట విక్రయం ద్వారా వచ్చిన డబ్బుల లెక్కసరిగా ఉండాలి. కానీ పెద్ద మొత్తంలో గోల్‌మాల్ నేపథ్యంలో స్టాక్ బుక్‌లో నమోదు చేసిన వస్తువుల వివరాలు, ఆ సమయంలో వచ్చిన డబ్బుల డిపాజిట్‌పైన కమిటీ ప్రధానంగా దృష్టి సారించే అవకాశం ఉంది.

వరుస పరిణామాలపై డీజీ సిరియస్....

జైళ్లల్లో ఇటీవల జరుగుతున్న పరిణామాల పట్ల డీజీ సౌమ్యా మిశ్రా అధికారుల తీరుపట్ల సీరియస్‌గా ఉన్నారు. ఇటీవల కీలక అధికారులతో సమావేశం నిర్వహించిన సమయంలోనూ వారి తీరుపై ఆమె అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. జైళ్ల శాఖలో జరుగుతున్న కొన్ని విషయాలు డీజీ దృష్టికి అధికారులు తీసుకెళ్లకపోవడం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

గ్రామీణ బ్యాంకు తాత్కాలిక ఉద్యోగులనుక్రమబద్ధీకరించండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం..456 మందికి తీపికబురు

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రోజువారీ వేతనం విధానంలో పనిచేస్తున్న 456 మంది ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని హైకోర్టు ఆదేశించింది. మెసెంజర్లు, స్వీపర్లు, ఇతర సాధారణ కార్మికులుగా పనిచేస్తున్నవారిని వారి అర్హతలను బట్టి.. శాశ్వత ఉద్యోగులుగా ఆఫీసు అటెండెంట్స్ పోస్టుల్లోకి తీసుకోవాలని సూచించింది. అయితే ఇప్పటికే సర్వీసును వదిలేసిన వారికి, చనిపోయిన వారికి ఇది వర్తించదని స్పష్టం చేసింది. ప్రస్తుతం పనిచేస్తున్నవారి సర్వీసు వ్యవధిని బట్టి వెయిటేజీ ఇచ్చి, ఆరు నెలల్లో క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించింది. సుదీర్ఘకాలం నుంచి తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్న తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకును ఆదేశించాలంటూ 456 మంది తాత్కాలిక ఉద్యోగులు గతంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం విచారణ చేపట్టింది. గ్రామీణ బ్యాంకు కేంద్ర, రీజనల్ కార్యాలయాలతోపాటు 400 శాఖల్లో 20 ఏళ్లుగా రోజువారీ వేతన విధానంలో పనిచేస్తున్నామని.. సర్వీస్ బెనిఫిట్స్ ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశంతో తమను క్రమబద్ధీకరించడం లేదని పిటిషనర్లు కోర్టుకు విన్నవించారు. ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకు తాత్కాలిక ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని హైకోర్టు తీర్పు ఉందని వివరించారు. అయితే గ్రామీణ బ్యాంకు తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లు ఔట్‌సోర్సింగ్ కార్మికులని, వారికి బ్యాంకుతో ఉద్యోగ-యాజమాన్య సంబంధం లేదని వివరించారు. కానీ ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకు కేసులో ఇలాంటి వాదనలు నిలబలేదని, సుప్రీంకోర్టు కూడా క్రమబద్ధీకరణను సమర్థించిందని ధర్మాసనం గుర్తు చేసింది. ఈ మేరకు తెలంగాణ గ్రామీణ బ్యాంకు తాత్కాలిక ఉద్యోగులైన 456 మంది పిటిషనర్లను క్రమబద్ధీకరించాలంటూ తీర్పు ఇచ్చింది.







చిత్రజ్యోతి

SINCE 1965

కంటెంట్ అదిరిపోయింది


హరీశ్ శంకర్

మలయాళంలో ఇటీవలె విడుదలై సూపర్‌హిట్ సాధించిన చిత్రం 'జింఖానా'. 'ప్రేమలు' ఫేమ్ నస్లెన్ హీరోగా ఖలీద్ రెహ్మాన్ తెరకెక్కించారు. తెలుగులో శ్రీలక్ష్మీ నరహింస మూవీమేకర్స్ విడుదల చేస్తోంది. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దర్శకుడు హరీష్ శంకర్ మాట్లాడుతూ "ఈ సినిమా కంటెంట్ అదిరిపోయింది. సినిమా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. "ప్రేమలు' సినిమాకు తెలుగు ప్రేక్షకులు ఇచ్చిన సపోర్ట్ మర్చిపోలేను. ఈ సినిమానూ ఆదరిస్తారనే నమ్మకం ఉంది" అని చెప్పారు. "క్రీడా నేపథ్యంలో సాగే ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది" అని దర్శకుడు ఖలీల్ రెహ్మాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శకులు అనుదీప్ కేవీ, సాగర్.కే. చంద్ర, సుజీత్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అందరినీ అలరిస్తుంది



నాగమహేశ్, రూపాలక్ష్మీ ప్రధాన పాత్రల్లో రమేశ్ అనెగౌని తెరకెక్కించనున్న సినిమా 'కర్మణి'. మంజుల చవన్, రమేశ్ గౌడ్ అనెగౌని నిర్మిస్తున్నారు. బుధవారం ఈ సినిమాను ప్రారంభించారు. సీనియర్ నటుడు నాగమహేశ్ క్లాప్ కొట్టగా, నిర్మాత మంజుల చవన్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు రమేశ్ మాట్లాడుతూ "ఇది విభిన్నమైన కథతో తెరకెక్కుతున్న చిత్రం. అందరినీ అలరిస్తుంది" అని చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: వి.నాగిరెడ్డి, కెమెరామెన్: జగదీష్ కొమరి, సంగీతం: జాన్ భూషన్

ఆ హీరో.. ఈ హీరోయిన్... వద్దే వద్దు!





కశ్మీర్‌లోని పహల్గామ్‌లో టూరిస్టులపై కొంతమంది తీవ్రవాదులు అమానుషంగా దాడి జరిపిన నేపథ్యంలో ప్రస్తుతం రెండు చిత్రాలపై సోషల్ మీడియాలో తీవ్రమైన చర్చ జరుగుతోంది. అందులో ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'ఫౌజీ' చిత్రం ఒకటైతే, మరొకటి వాణీ కపూర్ నటిస్తున్న హిందీ చిత్రం 'అబీర్ గులాల్'. ఫౌజీ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న ఇమాన్వీ, 'అబీర్ గులాల్'లో హీరోగా నటిస్తున్న ఫవాద్ ఖాన్... ఇద్దరూ పాకిస్థాన్ వారు కావడమే ఈ చర్చకు కారణం. వీరిద్దరినీ సినిమాల నుంచి తొలగించాలనీ, భారతీయ చలన చిత్ర పరిశ్రమలో ఏ ఒక్క పాకిస్థానీ నటుడికి కానీ నటికి కానీ అవకాశం ఇవ్వకూడదని వాదిస్తున్నారు. దేశంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పాకిస్థాన్‌కు చెందిన నటీనటులను భారతీయ సినిమాల్లో ప్రోత్సహించడం సరికాదని నెటిజన్లు అంటున్నారు. ఇమాన్వీ కరాచీలో పుట్టారు. ఆమె తండ్రి ఇక్బాల్ ఒకప్పుడు పాకిస్థాన్ మిలటరీలో ఉన్నత అధికారిగా పని చేసిన విషయాన్ని నెటిజన్లు ప్రస్తావిస్తూ ఇమాన్విని 'ఫౌజీ' చిత్రం నుంచి తొలగించాల్సిందే అని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఇమాన్వీ తన కుటుంబంతో కలసి ప్రస్తుతం అమెరికాలో ఉంటోందనీ, కళాకారులను వారి జాతీయత ఆధారంగా విమర్శించడం తగదని సోషల్ మీడియాలోనే మరో వర్గం వాదిస్తోంది.

ఇక ఫవాద్ ఖాన్ నటించిన 'అబీర్ గులాల్' చిత్రం షూటింగ్ దాదాపుగా పూర్తయింది. మే 9న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. క్రాస్ బోర్డర్ లవ్‌స్టోరీగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి ఎస్ బాగ్చీ దర్శకుడు. 'పాకిస్థానీ నటుడు మనకు అవసరమా' అంటూ సోషల్ మీడియాలో నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ఈ సినిమాను మహారాష్ట్రలో విడుదల చేయకుండా అడ్డుకుంటామని మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన ఇప్పటికే హెచ్చరించింది. ఇటువంటి ఉద్రికత్తల నేపథ్యంలో ఈ పాకిస్థానీ హీరోహీరోయిన్ల వ్యవహారం ఏమవుతుందో చూడాలి.

మానవత్వానికే మాయని మచ్చ

పహల్గాం ఉగ్ర దాడిపై చిత్ర పరిశ్రమ దిగ్ర్భాంతి వ్యక్తం చేసింది. పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల కాల్పుల ఘటనను ఖండిస్తూ పలువురు సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.



అమాయక ప్రజలు, పర్యాటకులను బలిగొన్న భయంకరమైన, హృదయ విదారకమైన దాడి ఇది. ఘటన జరిగిన తీరు గురించి తెలుసుకుంటుంటే మనసు వికలమైంది. క్షమించరాని క్రూరమైన చర్య ఇది. బరువెక్కిన హృదయంతో మరణించిన వారి కుటుంబాలకు నా సానుభూతి తెలియజేస్తున్నాను. వారికి జరిగిన నష్టం పూడ్చలేనిది.

- చిరంజీవి



ఉగ్రదాడి హేయం... అణచడమే మన ధ్యేయం. వికృత చర్యలపై విక్రమిద్దాం... కశ్మీరం మనదే సదా... పోరాడుదాం పద... అసువులు బాసిన అమాయక పౌరులందరికీ నా అశ్రునివాళి!

- నందమూరి బాలకృష్ణ



పహల్గాం దాడి ఘటన తీవ్రంగా కలచివేసింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఒక్కటిగా నిలబడదాం. ఇలాంటి దాడుల ద్వారా దేశ ఐక్యతను విచ్ఛిన్నం చేయలేరు. మనసాయుధ దళాలపై నాకు పూర్తి నమ్మకం ఉంది. కలసికట్టుగా ఈ కష్టకాలాన్ని అధిగమిద్దాం. జనసేన పార్టీ మూడు రోజుల పాటు సంతాప దినాలను పాటిస్తుంది. మా పార్టీ జెండాను అవనతం చేస్తున్నాం.

- పవన్ కల్యాణ్



పహల్గాం ఘటన గురించి నాలో చెలరేగిన బాధను, కోపాన్ని మాటల్లో చెప్పలేకపోతున్నాను. మనమంతా ఒక్కటిగా నిలిచి ఇలాంటి హేయమైన చర్యలకు వ్యతిరేకంగా పోరాడుదాం.

- షారూఖ్‌ఖాన్

భూతల స్వర్గం కశ్మీర్, తీవ్రవాద చర్యలతో నరకంగా మారుతోంది. వారికి అమాయక ప్రజలు లక్ష్యంగా మారుతున్నారు. అమాయకుల ప్రాణాలు హరించడం హేయమైన చర్య.

- సల్మాన్‌ఖాన్

ఇది క్షమార్హం కాని నేరం. ఈ ఉగ్రచర్యపై అందరూ మౌనం వీడాలి. వారిపై ప్రతీకారం తీర్చుకోవాలి. తగిన విధంగా బుద్ధి చెప్పాలి.

- సంజయ్‌దత్



ఇది చీకటి రోజు. పహల్గాం దాడి ఘటనతో చాలా బాధపడ్డాను. క్రూరత్వానికి వ్యతిరేకంగా కలసి నిలబడే శక్తి మనకు లభిస్తుందని ఆశిస్తున్నాను. బాధిత కుటుంబాలకు ఈ విషాదం నుంచి బయటపడే శక్తి లభించాలి.

- మహేశ్‌బాబు



పహల్గాం ఉగ్రదాడి తీవ్రంగా బాధించింది. ఇలాంటి ఘటనలకు మన సమాజంలో స్థానం లేదు. బాధిత కుటుంబాలను చూస్తుంటే హృదయం బరువెక్కుతోంది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా.

- ఎన్టీఆర్

రివర్స్‌గేర్‌లో టెస్లా

మార్చి త్రైమాసికంలో 71% క్షీణించిన సంస్థ లాభం

ట్రంప్ సర్కారుకు సేవలను తగ్గించుకోనున్న మస్క్



న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సన్నిహితుడు ఎలాన్ మస్క్‌కు చెందిన విద్యుత్ కార్ల కంపెనీ టెస్లా పనితీరు బాగా క్షీణించింది. జనవరి-మార్చి త్రైమాసికంలో కంపెనీ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 71 శాతం పతనమై 40.9 కోట్ల డాలర్లకు పడిపోయింది. ఆదాయం 9 శాతం క్షీణించి 1,930 కోట్ల డాలర్లకు తగ్గింది. అంతేకాదు, గడిచిన మూడు నెలల్లో కంపెనీ వాహన విక్రయాలు సైతం 13 శాతం తగ్గాయి. సంస్థ పేలవ పనితీరు నేపథ్యంలో ట్రంప్ సర్కారుకు తన సేవలను గణనీయంగా తగ్గించుకోవడంతో పాటు టెస్లా కార్యకలాపాలపై దృష్టి పెంచాలని మస్క్ గట్టి నిర్ణయం తీసుకున్నారు. వచ్చే నెల నుంచి ట్రంప్ సర్కారు కోసం కేవలం ఒకటి లేదా రెండ్రోజులు మాత్రమే కేటాయిస్తానని టెస్లా ఇన్వెస్టర్లతో అన్నారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టాక ప్రభుత్వ వ్యయాల్ని, ఉద్యోగుల్ని తగ్గించే బాధ్యతల్ని మస్క్‌కు అప్పగించారు. ఇందుకోసం డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజే) పేరుతో ఏర్పాటు చేసిన శాఖకు ప్రస్తుతం మస్క్ సారథ్యం వహిస్తున్నారు. అయితే, సర్కారు కోసం మస్క్ పని చేయడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఇది టెస్లా కార్ల అమ్మకాలతోపాటు పనితీరుపైనా తీవ్ర ప్రభావం చూపింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు టెస్లా షేర్లు 41 శాతం క్షీణించాయి.

మార్కెట్‌లోకి గోద్రెజ్ కొత్త హోం లాకర్లు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) గోద్రెజ్ ఎంటర్‌ప్రైజెస్ గ్రూప్ హోమ్ లాకర్స్ మార్కెట్‌లో ఏడు కొత్త ఉత్పత్తులను విడుదల చేసింది. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారంగా అనేక భద్రతా ఫీచర్లతో ఈ లాకర్లను తీర్చిదిద్దినట్టు కంపెనీ సెక్యూరిటీ సొల్యూషన్స్ బిజినెస్ హెడ్ పుష్కర్ గోఖలే చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాలు తమకు అత్యంత కీలకమన్నారు. దేశవ్యాప్తంగా ఈ తరహా ఉత్పత్తుల మార్కెట్‌లో తమకు 76 శాతం వాటా ఉంటే, తెలుగు రాష్ట్రాల్లో మాత్రం 85 శాతం ఉందన్నారు. గత ఆర్థిక సంవత్సరం స్మార్ట్ సెక్యూరిటీస్ ఉత్పత్తుల ద్వారా తమ కంపెనీ చేసిన రూ.1,100 కోట్ల టర్నోవర్‌లో రూ.130 కోట్లు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిందన్నారు. బ్యాంకులు, జువెలరీ సంస్థలు తమ ఉత్పత్తుల ప్రధాన వినియోగదారులని గోఖలే చెప్పారు.

అణు ఇంధన రంగంలోకి మేఘా

MEGHA ENGINEERING & INFRASTRUCTURES LIMITED

ఎన్‌పీసీఐఎల్ నుంచి రూ.12,800 కోట్ల ఆర్డర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్థానిక మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) మరో ఘనత సాధించింది. కంపెనీ అణు ఇంధన రియాక్టర్ల రంగంలోకి ప్రవేశిస్తోంది. న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐఎల్) కర్ణాటకలోని కైగా వద్ద నిర్మించే అణు విద్యుత్ ప్రాజెక్టు ఐదు, ఆరు యూనిట్లకు ఒక్కోటి 700 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉండే రెండు అణు రియాక్టర్లు సరఫరా చేయనుంది.

రూ.12,800 కోట్ల ఆర్డర్: ఈ ఆర్డర్ విలువ రూ.12,800 కోట్లని ఎంఈఐఎల్ తెలిపింది. ఎన్‌పీసీఐఎల్ చరిత్రలో ఇంత భారీ ఆర్డర్ జారీ చేయడం ఇదే మొదటిసారి. ఈ భారీ ఆర్డర్ కోసం బీహెచ్‌ఈఎల్, ఎల్ అండ్ టీ కంపెనీలు కూడా పోటీపడ్డాయి. అయితే నాణ్యత, ధరల ఆధారిత ఎంపిక (క్వాలిటీ కమ్ కాస్ట్ బేస్డ్ సెలక్షన్) పద్ధతిలో ఎన్‌పీసీఐఎల్ మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీని ఎంపిక చేసింది. ఈ ఆర్డర్ పత్రాలను ఎన్‌పీసీఐఎల్ అధికారులు ముంబైలోని తమ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) సీహెచ్ సుబ్బయ్యకు అందజేశారు. ఈపీసీ పద్ధతిలో నిర్ణీత సమయానికి ఈ ఆర్డర్ పూర్తి చేస్తామని ఎంఈఐఎల్ తెలిపింది.

యాక్సెంచర్ గూటికి టాలెంట్‌స్ప్రింట్

talent sprint Part of Accenture

బెంగళూరు: హైదరాబాద్‌కు చెందిన డీప్‌టెక్ ఎడ్యుకేషన్ కంపెనీ టాలెంట్‌స్ప్రింట్‌ను అంతర్జాతీయ ఐటీ దిగ్గజం యాక్సెంచర్ కొనుగోలు చేసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) పూర్తి అనుబంధ విభాగమైన ఎన్ఎస్ఈ అకాడమీ లిమిటెడ్ నుంచి ఈ సంస్థను టేకోవర్ చేసింది. ఈ డీల్ విలువ ఎంతనేది మాత్రం వెల్లడించలేదు. 2009లో ప్రారంభమైన టాలెంట్‌స్ప్రింట్.. హైదరాబాద్‌తో పాటు సన్నీవేల్, కాలిఫోర్నియాలోనూ కార్యాలయాలను కలిగిఉంది. ప్రస్తుతం టాలెంట్‌స్ప్రింట్ ఐఐటీ, ట్రిపుల్‌ఐటీ, ఐఐఎం వంటి ప్రముఖ విద్యాసంస్థలు, టెక్నాలజీ ప్రొవైడర్ల భాగస్వామ్యంలో వర్ధమాన, అనుభవజ్ఞులైన వృత్తినిపుణులకు కృత్రిమ మేధ (ఏఐ), డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, చిప్ డిజైన్, సెమీ కండక్టర్ టెక్నాలజీస్, డిజిటల్ పరివర్తనం వంటి ఆధునిక టెక్నాలజీ కోర్సులతో పాటు మేనేజ్‌మెంట్ విభాగంలో లీడర్‌షిప్ అండ్ సస్టెయినబిలిటీ ప్రోగ్రామ్స్‌ను కూడా ఆఫర్ చేస్తోంది. కాగా, ఈ కొనుగోలు ఒప్పందంలో భాగంగా టాలెంట్‌స్ప్రింట్‌కు చెందిన 210 మంది ఉద్యోగులు యాక్సెంచర్‌కు చెందిన లర్న్‌వాంటేజ్‌లో చేరనున్నారు. తమ క్లయింట్ల సిబ్బంది నైపుణ్యాలను పెంచేందుకు తోడ్పడే లర్న్‌వాంటేజ్ సామర్థ్యాన్ని ఈ డీల్ మరింత బలోపేతం చేయనుందని యాక్సెంచర్ పేర్కొంది.

లక్ష దిగువకు బంగారం

ఒక్క రోజే రూ.2,400 పతనం

రూ.94,000 వరకు తగ్గే అవకాశం



న్యూఢిల్లీ: పసిడి పరుగుకు బ్రేక్ పడింది. నిన్న మొన్నటి వరకు రేసు గుర్రంలా పరిగెత్తిన పుత్తడి ధర బుధవారం ఒక్కసారిగా బ్రేక్ తీసుకుంది. మంగళవారం ఢిల్లీ మార్కెట్‌లో రికార్డు స్థాయిలో రూ.1,02,100 పలికిన 10 గ్రాముల మేలిమి బంగారం ధర బుధవారం రూ.2,400 పతనమై రూ.99,200కు చేరింది. ఫ్యూచర్స్ మార్కెట్‌లోనూ ఇదే పరిస్థితి. జూన్‌లో డెలివరీ ఇచ్చే 10 గ్రాముల మేలిమి బంగారం ధర బుధవారం మల్టీ కమోడిటీస్ ఎక్స్ఛేంజిలో (ఎంసీఎక్స్) రూ.1,435 తగ్గి రూ.95,905 వద్ద ట్రేడైంది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ పుత్తడి ధర దిగొస్తోంది. మంగళవారం రికార్డు స్థాయిలో 3,500.33 డాలర్లకు చేరిన ఔన్స్ (31.10 గ్రాములు) పసిడి ధర బుధవారం 3,300-3,318 డాలర్ల మధ్య ట్రేడైంది. 'పసిడి ధర చాలా బలహీనంగా ఉంది. ఈ నెల 3 తర్వాత ధర ఇంత భారీగా తగ్గడం ఇదే మొదటిసారి. అయితే ఇది స్వల్ప కాలిక దిద్దుబాటు మాత్రమే' అని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ రీసెర్చి అనలిస్టు జతిన్ త్రివేది చెప్పారు. వచ్చే కొద్ది రోజుల్లో దేశీయ మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.94,000 నుంచి రూ.98,000 మధ్య ట్రేడయ్యే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా.

అమ్మకాలు కష్టమే: బంగారం ధరలు లక్ష రూపాయలకు అటూఇటూగా కదలాడుతున్న నేపథ్యంలో అమ్మకాల పరిమాణం 9-11 శాతం పడిపోయే అవకాశం ఉందని రేటింగ్ కంపెనీ క్రిసిల్ అంచనా వేసింది. ఈ ప్రభావం ఇప్పటికే పెళ్లిళ్ల సీజన్, ఈ నెల 30న వచ్చే అక్షయ తృతీయ అమ్మకాలపై కనిపిస్తోంది. ప్రధాన నగరాల్లో ఏ నగల షాపు చూసినా బోసిపోయి కనిపిస్తోంది. వచ్చే కొద్ది మంది కూడా కొద్దిపాటి కొనుగోళ్లతోనే సరిపెడుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పెళ్లిళ్ల సీజన్ అమ్మకాలు 40 శాతం కూడా లేవని వ్యాపారులు చెబుతున్నారు.

విలువపరంగా ఓకే: గత ఆర్థిక సంవత్సరం దేశీయ మార్కెట్‌లో పసిడి ధర 25 శాతం పెరిగింది. ఈ ఏడాది ఇప్పటి వరకు చూసినా 20 శాతం పెరిగింది. ఇవే ధరలు కొనసాగితే ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) అమ్మకాల పరిమాణం 9-11 శాతం తగ్గినా, అమ్మకాల విలువ మాత్రం గత ఏడాదితో పోలిస్తే 13 నుంచి 15 శాతం పెరిగి రూ.5 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉందని క్రిసిల్ చెబుతోంది.

తగ్గిన ట్రంప్ జోరే కారణం: తాజా పరిణామాల నేపథ్యంలో వాణిజ్య యుద్ధం విషయంలో ట్రంప్ తెగే వరకూ లాగకపోవచ్చనే అంచనాలు పసిడి ధరలపై ప్రభావం చూపాయి. పెట్టుబడుల రక్షణ కోసం నిన్న మొన్నటి వరకు పసిడిని కొనుగోలు చేసిన మదుపరులు బుధవారం ఒక్కసారిగా అమ్మకాలకు దిగారు. అలాగే వడ్డీరేట్లు తగ్గించకపోతే ఫెడ్ చైర్మన్ జెరోం పోవెల్‌ను ఆ పదవి నుంచి పీకి పారేస్తామని కొద్ది రోజుల క్రితం ప్రకటించిన ట్రంప్ మంగళవారం ఒక్కసారిగా దీనిపై వెనక్కి తగ్గి అలాంటి ఆలోచనే లేదనడం కూడా మార్కెట్‌కు ఊరట కలిగించింది.

ఇంటెల్‌లో 20 శాతం ఉద్యోగాల కోత!?

న్యూఢిల్లీ: అమెరికా చిప్ తయారీ దిగ్గజం ఇంటెల్ వ్యాపార పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా భారీగా ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమవుతోందని సమాచారం. తద్వారా కంపెనీ సిబ్బందిని 20 శాతం వరకు తగ్గించుకోవాలనుకుంటున్నట్లు బ్లూంబర్గ్ కథనం పేర్కొంది. ఇందుకు సంబంధించి ఈ వారంలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఎన్‌విడియా నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటున్న ఇంటెల్ ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. వ్యాపారాన్ని తిరిగి గాడిలో పెట్టే బాధ్యతలను కొత్త సారథి లిప్-బు టాన్ చేతుల్లో పెట్టింది. ఈ మార్చిలో కంపెనీ పగ్గాలు చేపట్టిన టాన్.. ఉన్నతాధికార విభాగాన్ని క్రమబద్ధీకరించడంతోపాటు సంస్థలో ఇంజనీర్ల ప్రాధాన్యాన్ని పెంచేందుకు శ్రీకారం చుట్టారు. వ్యయాలను తగ్గించుకునేందుకు ఉద్యోగాల కోతలపైనా దృష్టి సారించినట్లు తెలిసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



24వ తేదీ			
హైదరాబాద్	405	విజయవాడ	420
వరంగల్	407	గోదావరి	405
చిత్తూరు	450	విశాఖపట్నం	425
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	112
వరంగల్	120	గుంటూరు	112
కరీంనగర్	120	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	85
కర్నూలు	120	నెల్లూరు	90
విశాఖపట్నం	111	అనంతపురం	90
గోదావరి	112		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,350 ▼	90,150 ▼	1,11,000 ▲
విజయవాడ	99,500 ▲	96,000 ▼	99,800 ▲
విశాఖపట్నం	98,295 ▼	90,140 ▼	98,000 ▲
రాజమండ్రి	98,350 ▼	90,150 ▼	99,000 ▼
ప్రొద్దుటూరు	97,800 ▼	89,980 ▼	99,200 ▲
ముంబై	96,080 ▼	88,010 ▼	96,610 ▲

మళ్లీ 80,000 పైకి సెన్సెక్స్

మరో 520 పాయింట్లు పెరిగిన సూచీ

ముంబై: ఈక్విటీ సూచీలు వరుసగా ఏడో రోజూ లాభపడ్డాయి. బుధవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 520.90 పాయింట్ల వృద్ధితో 80,116.49 వద్దకు చేరింది. సూచీ మళ్లీ 80,000 ఎగువకు చేరడం ఈ ఏడాదిలో ఇదే తొలిసారి. అంతేకాదు, 2024 డిసెంబరు 18 తర్వాత సూచీకిదే గరిష్ఠ ముగింపు స్థాయి. కాగా, నిఫ్టీ 161.70 పాయింట్లు పెరిగి 24,328.95 వద్ద ముగిసింది. ఐటీ, వాహన రంగ షేర్లలో మదుపరులు జోరుగా కొనుగోళ్లు జరపడం ఇందుకు దోహదపడింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) మన మార్కెట్లో మరిన్ని పెట్టుబడులు పెట్టడంతోపాటు అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలు ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మరింత మెరుగుపరిచాయి. కాగా గడిచిన 7 సెషన్లలో సెన్సెక్స్ 6,269.34 పాయింట్లు, నిఫ్టీ 1,929.80 పాయింట్లు పుంజుకున్నాయి. దీంతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ మరో రూ.3.1 లక్షల కోట్ల వృద్ధితో రూ.430.47 లక్షల కోట్లకు (5.04 లక్షల కోట్ల డాలర్లు) చేరింది. ఏడు రోజుల్లో మార్కెట్ సంపద రూ.36.65 లక్షల కోట్లు పెరిగింది.

ఏథర్ ఎనర్జీ ఐపీఓ ధర శ్రేణి రూ.304-321: ఏథర్ ఎనర్జీ ఐపీఓ ధర శ్రేణిని రూ.304-321గా నిర్ణయించింది. కంపెనీ పబ్లిక్ ఇష్యూ ఈనెల 28 ప్రారంభమై 30న ముగియనుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో పబ్లిక్ ఇష్యూకు రాబోతున్న ప్రధాన కంపెనీ ఇదే.

భారత్-అమెరికా మధ్య వాణిజ్య చర్చలు షురూ

న్యూఢిల్లీ: ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై భారత్- అమెరికా అధికారుల మధ్య చర్చలు వాషింగ్టన్‌లో బుధవారం ప్రారంభయ్యాయి. మూడు రోజులపాటు సాగనున్న ఈ చర్చలు ఇరు దేశాల మధ్య వాణిజ్యంలో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవడంతోపాటు వీలైనంత త్వరగా ఒప్పందం కుదుర్చుకోవడానికి బాటలు వేయనున్నాయి. భారత్‌తో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ద్వారా తమ వస్తువులకు కొత్త మార్కెట్లకు ప్రవేశం లభించడంతోపాటు ఇరు దేశాల్లోని కార్మికులు, రైతులు, పారిశ్రామికవేత్తలకు మరిన్ని అవకాశాలు లభించనున్నాయని అమెరికా పేర్కొంది. భారత మార్కెట్లోకి మరింత సులువుగా ప్రవేశం, సుంకాలు, ఇతర అవరోధాలను తగ్గించుకోవడంతోపాటు దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం అదనపు హామీలను అమెరికా కోరుకుంటోంది.

విజేత హంపి

'ఫిడే' మహిళల గ్రాండ్ ప్రీ చెస్



పుణె: భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి ఫిడే మహిళల గ్రాండ్ ప్రీ చెస్ టోర్నమెంట్ పుణె అంచె చాంపియన్‌గా నిలిచింది. బుధవారం జరిగిన ఆఖరి రౌండ్‌లో బల్గేరియా జీఎం నుర్గ్యుల్ సలిమోవాపై హంపి విజయం సాధించింది. తెల్ల పావులతో ఆడిన తెలుగు గ్రాండ్‌మాస్టర్ హంపి 84 సుదీర్ఘ ఎత్తుల తర్వాత సలిమోవాను ఓడించింది. ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్ హంపి మొత్తం తొమ్మిది రౌండ్ల ద్వారా ఏడు పాయింట్లు సాధించింది. హంపితోపాటు టైటిల్ రేసులో నిలిచిన చైనా గ్రాండ్‌మాస్టర్ ఝు జినెర్ కూడా చివరి గేమ్‌లో గెలుపొందింది. ఏడు పాయింట్లతో హంపితో సమంగా జినెర్ నిలిచింది. కానీ మెరుగైన టై బ్రేకర్ స్కోరు ఆధారంగా భారత గ్రాండ్‌మాస్టర్ టైటిల్ దక్కించుకుంది. మరో తెలుగు గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక మంగోలియా జీఎం ముంగుంతూల్‌తో పాయింట్ పంచుకుంది. 4.5 పాయింట్లతో హారిక నాలుగో స్థానంలో నిలిచింది. రష్యన్ జీఎం అలీనాతో చివరి రౌండ్‌ను డ్రా చేసుకున్న దివ్య దేశ్‌ముఖ్ (5.5) మూడో స్థానం సాధించింది. జీఎం వైశాలి (4) ఆరో స్థానంలో నిలిచింది.

పాకిస్థాన్‌తో ఆటలు వద్దే వద్దు

అథ్లెట్ల డిమాండ్

పహల్గాం ఉగ్ర దాడికి ఖండన

న్యూఢిల్లీ: పహల్గాంలో ఉగ్ర దాడిని దేశ క్రీడారంగం తీవ్రంగా ఖండించింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. ఉగ్ర దాడి నేపథ్యంలో పాకిస్థాన్‌తో క్రీడా సంబంధాలను తక్షణమే తెంచుకోవాలని కొందరు అథ్లెట్లు డిమాండ్ చేశారు. పహల్గాంలోని పర్యాటక ప్రదేశంపై మంగళవారం టెర్రరిస్టులు దాడి చేసి ఎంతోమందిని పొట్టనబెట్టుకున్న సంగతి తెలిసిందే. పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత లష్కర్-ఎ-తాయిబా అనుబంధ సంస్థ 'ద రెసిస్టెన్స్ ఫోర్స్' తామే ఈ చర్యకు పాల్పడినట్టు ప్రకటించుకుంది.

- ఆ ఘటన షాక్‌కు గురిచేసింది. మృతుల కుటుంబాలకు సానుభూతి. ఆ కుటుంబాలు ఎంత వేదనకు లోనవుతున్నాయో.. -సచిన్ టెండూల్కర్
- మృతుల ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నా. ఈ ఘోర ఘటనలో బాధితులకు న్యాయం జరగాలి. -విరాట్ కోహ్లీ, బుమ్రా, సూర్యకుమార్
- మతం పేరిట మారణహోమం సృష్టించి అమాయకులను బలిగొనడం దారుణం. ఇది క్షమార్హం కాదు. -మహ్మద్ సిరాజ్
- మృతుల కుటుంబాలకోసం ప్రార్థిస్తున్నా. ఈ ఘటనకు భారత్ తప్పకుండా ప్రతి దాడి చేస్తుంది. -బీజేపీ మాజీ ఎంపీ, భారత జట్టు కోచ్ గంభీర్
- అమాయక భారతీయులను హత్య చేయడమే పాకిస్థాన్ జాతీయ క్రీడలా ఉంది. ఆ దేశంతో అన్ని క్రీడా సంబంధాలను నిలిపి వేయాలి. -మాజీ క్రికెటర్ శ్రీవత్స గోస్వామి
- ఈ ఘటనతో నా హృదయం గాయపడింది. మృతుల కుటుంబాల బాధ వర్ణించలేనిది. -సింధు
- జమ్మూకశ్మీర్ ఉదంతంతో నా గుండె బద్దలైంది. -నీరజ్ చోప్రా
- పిరికి పందల చర్య. ఇందుకు కారణమైన వారిని వదలకూడదు. -రవిశాస్త్రి

స్పోర్ట్స్

నేటి మ్యాచ్ — వేదిక బెంగళూరు

బెంగళూరు x రాజస్థాన్ — రా.7.30 నుంచి

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	8	6	2	0	12	1.104
ఢిల్లీ	8	6	2	0	12	0.657
ముంబై	9	5	4	0	10	0.673
బెంగళూరు	8	5	3	0	10	0.472
పంజాబ్	8	5	3	0	10	0.177
లఖ్‌నవూ	9	5	4	0	10	-0.054
కోల్‌కతా	8	3	5	0	6	0.212
రాజస్థాన్	8	2	6	0	4	-0.633
హైదరాబాద్	8	2	6	0	4	-1.361
చెన్నై	8	2	6	0	4	-1.392

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

జింబాబ్వే థ్రిల్లింగ్ విక్టరీ

బంగ్లాతో తొలి టెస్ట్



ముజరబాని (6/72)

సిల్హట్: బంగ్లాదేశ్‌తో తొలి టెస్ట్‌లో జింబాబ్వే 3 వికెట్ల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. బంగ్లా నిర్దేశించిన 174 పరుగుల లక్ష్యాన్ని.. మరో రోజు ఆట మిగిలుండగానే జింబాబ్వే 7 వికెట్లు కోల్పోయి ఛేదించింది. తమ టెస్ట్ చరిత్రలో నాలుగో ఇన్నింగ్స్‌లో అత్యధిక లక్ష్యాన్ని ఛేదించిన జింబాబ్వే.. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది. ఓపెనర్లు బ్రియాన్ బెన్నెట్ (54), బెన్ కర్రాన్ (44) రాణించారు. మెహిదీహసన్ మిరాజ్ 5 వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు ఆటకు నాలుగో రోజైన బుధవారం ఓవర్‌నైట్ స్కోరు 194/4తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన బంగ్లా 255 పరుగులకు ఆలౌటైంది. నజ్ముల్ షంటో (60) నిన్నటి స్కోరు వద్దే అవుట్ కాగా.. జాకర్ అలీ (58) అర్ధ శతకం సాధించాడు. ముజరబాని ఆరు వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లా 191.. జింబాబ్వే 273 పరుగులు చేశాయి. కాగా, 2021 తర్వాత విదేశాల్లో జింబాబ్వేకిదే తొలి టెస్ట్ విక్టరీ.

లంక వన్డే కెప్టెన్ ఆటపట్టు

● మహిళల ముక్కోణపు సిరీస్

కొలంబో: భారత్, దక్షిణాఫ్రికాలతో స్వదేశంలో జరిగే మహిళల ముక్కోణపు టోర్నీ కోసం ఆతిథ్య శ్రీలంక 17 మంది సభ్యుల బలమైన జట్టును ఎంపిక చేసింది. చమరి ఆటపట్టు జట్టుకు సారథ్యం వహించనుంది. ఈ ముక్కోణపు సిరీస్ ఈ నెల 27 నుంచి కొలంబోలో జరగనుంది.

ముక్కోణపు సిరీస్ షెడ్యూల్

- **ఏప్రిల్ 27:** శ్రీలంక-భారత్
- **ఏప్రిల్ 29:** భారత్-దక్షిణాఫ్రికా
- **మే 2:** శ్రీలంక-దక్షిణాఫ్రికా
- **మే 4:** శ్రీలంక-భారత్
- **మే 7:** భారత్-దక్షిణాఫ్రికా
- **మే 9 :** శ్రీలంక-దక్షిణాఫ్రికా
- **మే 11:** ఫైనల్

సెమీఫైనల్లో ఆరుగురు భారత బాక్సర్లు

అమ్మాన్ (జోర్డాన్): ఆసియా అండర్-15, అండర్-17 చాంపియన్‌షిప్స్‌లో జోరు కనబరుస్తూ ఆరుగురు భారత బాక్సర్లు సెమీఫైనల్‌కు దూసుకెళ్లారు. బుధవారం జరిగిన 46 కిలోల అండర్-15 క్వార్టర్‌ఫైనల్లో రుద్రాక్ష్ సింగ్ 3-0తో ఐదర్ ముసేవ్ (కజకిస్థాన్)ను చిత్తు చేశాడు. ఈ విభాగం ఇతర క్వార్టర్‌ఫైనల్స్‌లో సంస్కార్ (36కి.)-అల్మత్‌బౌలీపై, 37 కి.లలో హర్సిల్-మహ్మదలీపై, 40 కి.లలో బల్హారా-నూర్‌సలేమ్‌పై, 49కి.లలో సంచిత్-యూ చెన్‌పై నెగ్గారు. మహిళల 43 కిలోల అండర్-15 విభాగంలో మిల్కీ 5-0తో కజక్ బాక్సర్ యెల్దానాను ఓడించి సెమీస్ చేరింది.

తీరు మారని రైజర్స్

- ● ఆరో ఓటమితో ప్లేఆఫ్స్ ఆశలు సంక్లిష్టం
- ● క్లాసెన్ పోరాటం వృథా ● బౌల్ట్‌కు 4 వికెట్లు
- ● 7 వికెట్లతో ముంబై విజయం ● అదరగొట్టిన రోహిత్




రోహిత్ శర్మ (70)

హైదరాబాద్: పేలవ ప్రదర్శనను కొనసాగిస్తున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆరో ఓటమితో నాకౌట్ అవకాశాలను మరింత సంక్లిష్టం చేసుకోగా.. క్రమంగా జోరు పెంచిన ముంబై ఇండియన్స్ ఏకంగా మూడో స్థానానికి ఎగబాకింది. రోహిత్ శర్మ (46 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 70) వరుసగా రెండో అర్ధ శతకం నమోదు చేయగా.. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ట్రెంట్ బౌల్ట్ (4/26) బంతితో విజృంభించడంతో.. ముంబై ఇండియన్స్ వరుసగా నాలుగో విజయాన్ని నమోదు చేసింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ముంబై 7 వికెట్ల తేడాతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను చిత్తు చేసింది. తొలుత హైదరాబాద్ 20 ఓవర్లలో 143/8 స్కోరు చేసింది. క్లాసెన్ (44 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 71), అభినవ్ మనోహర్ (37 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 43) పోరాటం వృథా అయింది. దీపక్ చాహర్ 2 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో ముంబై 15.4 ఓవర్లలో 3 వికెట్లకు 146 పరుగులు చేసి గెలిచింది. సూర్యకుమార్ యాదవ్ (40 నాటౌట్) రాణించాడు. ఉనాద్కట్, ఇషాన్ మలింగ చెరో వికెట్ పడగొట్టారు.

కష్టపడకుండానే..: ఫామ్‌లోకి వచ్చిన ఓపెనర్ రోహిత్ మరోసారి చెలరేగడంతో.. ముంబై అలవోకగా గెలిచింది. ఛేదనలో ఓపెనర్ రికెల్టన్ (11)ను స్వల్ప స్కోరుకే ఉనాద్కట్ పెవిలియన్ చేర్చడంతో.. సన్‌రైజర్స్ ఏదైనా అద్భుతం చేస్తుందా? అనిపించింది. కానీ, వన్‌డౌన్‌లో వచ్చిన విల్ జాక్స్ (22)తో కలసి రెండో వికెట్‌కు 64 పరుగులు జోడించిన రోహిత్.. మూడో వికెట్‌కు సూర్యకుమార్‌తో కలసి 53 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. దీంతో ముంబై 26 బంతులు మిగిలుండగానే విజయాన్ని అందుకొంది. పవర్‌ప్లేలో ముంబై 56/1తో నిలిచింది. అయితే, 10వ ఓవర్‌లో అన్సారీ బౌలింగ్‌లో జాక్స్ క్యాచవుట్ అయ్యాడు. హర్షల్ వేసిన 14వ ఓవర్‌లో రోహిత్ మూడు బౌండ్రీలతో 15 పరుగులు రాబట్టడంతో.. లక్ష్యం 36 బంతుల్లో 23 పరుగులకు దిగివచ్చింది. రోహిత్‌ను మలింగ క్యాచౌట్ చేసినా.. సూర్య 6,4,4తో మ్యాచ్‌ను ముగించాడు.

టాపార్డర్ విలవిల..: సొంతగడ్డపై సన్‌రైజర్స్ మరోసారి విధ్వంసం సృష్టిస్తుందనుకొంటే.. తుస్సుమంది. టాపార్డర్ వైఫల్యంతో 13/4తో పీకల్లోతు కష్టాల్లో పడింది. అయితే, క్లాసెన్, మనోహర్ ఆరో వికెట్‌కు 99 పరుగుల భాగస్వామ్యంతో గౌరవప్రద స్కోరు అందించారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్.. ముంబై పేసర్లు చాహర్, బౌల్ట్ దెబ్బకు విలవిల్లాడింది. రెండో ఓవర్‌లో ఓపెనర్ హెడ్ (0)ను డకౌట్ చేసిన బౌల్ట్.. తన తర్వాతి ఓవర్‌లో అభిషేక్ శర్మ (8)ను పెవిలియన్ చేర్చాడు. వన్‌డౌన్‌లో వచ్చిన ఇషాన్ కిషన్ (1) చాహర్ బౌలింగ్‌లో అవుట్‌గా వెనుదిరిగిన తీరు అందరినీ ఆశ్చర్యపర్చింది. ఎవరూ అప్పీలు కూడా చేయకపోయినా.. అతడు వికెట్లను వదిలేసి వెళ్లడంతో వైడ్ ఇవ్వాల్సిన అంపైర్ అవుట్‌గా ప్రకటించాడు. బ్యాట్‌ను బంతి తాకలేదని రీప్లేలో నిర్ధారణ అయింది. నితీశ్ కుమార్ (2)ను కూడా చాహర్ అవుట్ చేయడంతో.. పవర్‌ప్లేలో రెండు బౌండ్రీలు మాత్రమే బాదిన హైదరాబాద్ 24/4తో నిలిచింది. కానీ, అనికేత్‌ను అవుట్ చేసి హార్దిక్ దెబ్బకొట్టాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన మనోహర్.. క్లాసెన్‌కు సహకారం అందించడంతో హైదరాబాద్ క్రమంగా కోలుకొంది. బుమ్రా బౌలింగ్‌లో సిక్స్‌తో వావ్ అనిపించిన మనోహర్.. డెత్ ఓవర్లలో జోరు పెంచాడు. మరోవైపు క్లాసెన్ ఈ సీజన్‌లో తొలి ఫిఫ్టీ పూర్తి చేసుకొన్నాడు. 19వ ఓవర్‌లో బుమ్రా బౌలింగ్‌లో సిక్స్ బాదిన క్లాసెన్.. ఆ తర్వాతి బంతికి క్యాచవుటయ్యాడు. మనోహర్, కమిన్స్ (1)ను అవుట్ చేసిన బౌల్ట్.. హైదరాబాద్ స్కోరును 150 మార్క్ చేరకుండా అడ్డుకొన్నాడు.



స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: హెడ్ (సి) నమన్ (బి) బౌల్ట్ 0, అభిషేక్ (సి) విఘ్నేష్ (బి) బౌల్ట్ 8, ఇషాన్ (సి) రికెల్టన్ (బి) చాహర్ 1, నితీశ్ (సి) శాంట్నర్ (బి) చాహర్ 2, క్లాసెన్ (సి) తిలక్ (బి) బుమ్రా 71, అనికేత్ (సి) రికెల్టన్ (బి) హార్దిక్ 12, అభినవ్ మనోహర్ (హిట్ వికెట్) బౌల్ట్ 43, కమిన్స్ (బి) బౌల్ట్ 1, హర్షల్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 143/8; వికెట్ల పతనం:** 1-2, 2-9, 3-13, 4-13, 5-35, 6-134, 7-142, 8-143; **బౌలింగ్:** చాహర్ 4-0-12-2, బౌల్ట్ 4-0-26-4, బుమ్రా 4-0-39-1, శాంట్నర్ 4-0-19-0, హార్దిక్ 3-0-31-1, విఘ్నేష్ 1-0-15-0.

ముంబై: రికెల్టన్ (సి అండ్ బి) ఉనాద్కట్ 11, రోహిత్ (సి) అభిషేక్ (బి) మలింగ 70, జాక్స్ (సి) మనోహర్ (బి) అన్సారి 22, సూర్యకుమార్ (నాటౌట్) 40, తిలక్ వర్మ (నాటౌట్) 2, **ఎక్స్‌ట్రాలు 1, మొత్తం: 15.4 ఓవర్లలో 146/3, వికెట్లపతనం:** 1-13, 2-77, 3-130, **బౌలింగ్:** కమిన్స్ 3-0-31-0, ఉనాద్కట్ 3-0-25-1, హర్షల్ పటేల్ 3-0-21-0, మలింగ 3-0-33-1, జీషన్ అన్సారి 3.4-0-36-1.

ఉగ్ర చర్యలను ఖండించిన బీసీసీఐ

పహల్గాంలో ముష్కరుల దాడిలో మరణించిన మృతులకు సంతాపంగా ముంబై, హైదరాబాద్ జట్లు నల్ల ఆర్మ్ బ్యాండ్‌లు ధరించి బరిలోకి దిగాయి. మ్యాచ్ ఆరంభానికి ముందు ఇరుజట్లూ మృతుల ఆత్మకు శాంతి కలగాలని నిమిషంపాటు మౌనం పాటించాయి. తీవ్ర విషాదం నెలకొన్న నేపథ్యంలో చీర్ లీడర్స్ డ్యాన్సులతోపాటు బాణసంచా కాల్చడాన్ని కూడా రద్దు చేసినట్టు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. తీవ్రవాదుల పిరికిపంద చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ప్రకటించాడు. మరణించిన వారి కుటుంబాలకు బోర్డు తరఫున శ్రద్ధాంజలి ఘటించాడు.



విమానాశ్రయంలోనే ఉన్నతస్థాయి భేటీ!

విదేశాంగ మంత్రి జైశంకర్, ఎన్ఎస్ఏ దోభాల్‌తో పహల్గాం దాడిపై ప్రధాని మోదీ సమీక్ష

- పహల్గాంలో ఘటనా స్థలాన్ని పరిశీలించిన అమిత్ షా.. ఉగ్రదాడి మృతులకు నివాళులు
- దాడికి త్వరలోనే బదులిస్తాం: రాజ్‌నాథ్

శ్రీనగర్/న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో సౌదీ అరేబియా పర్యటనను కుదించుకొని హుటాహుటిన ఢిల్లీ చేరుకున్న ప్రధాని మోదీ.. విమానాశ్రయంలోనే ఉన్నతాధికారులతో సమీక్ష జరిపారు. బుధవారం ఉదయం జాతీయ భద్రతా సలహాదారు(ఎన్ఎస్ఏ) అజిత్ దోభాల్, విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్, విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీతో ఎయిర్‌పోర్టులోనే ప్రధాని ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. పహల్గాం ఉగ్రదాడి ఘటనకు సంబంధించిన వివరాలను మోదీకి తెలియజేశారు. మంగళవారం రాత్రే శ్రీనగర్‌కు చేరుకున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా సైతం వర్చువల్‌గా ఈ సమావేశంలో పాల్గొన్నట్లు తెలిసింది. బుధవారం ఆయన పహల్గాంలోని బైసారన్‌లో దాడి జరిగిన ప్రదేశానికి వెళ్లారు. అక్కడ సైనికాధికారులు, జమ్మూకశ్మీరు డీజీపీ నళిన్ ప్రభాత్.. ఘటన జరిగిన తీరును అమిత్ షాకు వివరించారు. ఉగ్రవాదులు ఏ మార్గంలో వచ్చి ఉంటారనే విషయాన్ని కూడా తెలిపారు. అనంతరం ఆయన అనంతనాగ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. అమిత్ షాను చూసి బాధితులు రోదించారు. ఉగ్రదాడిని వివరిస్తూ విలపించారు. వారిని ఓదార్చిన ఆయన, దాడి బాధ్యులను వదిలే ప్రసక్తే లేదని చెప్పారు. కాగా, ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన 26 మంది మృతదేహాలను శ్రీనగర్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలకు తరలించి, పోస్టుమార్టం చేశారు. అనంతరం పోలీస్ కంట్రోల్ రూమ్‌కు తరలించారు. అక్కడ అమిత్ షా మృతులకు పుష్పాంజలి ఘటించారు. ఆయన వెంట జమ్మూకశ్మీరు లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, సీఎం ఒమర్ అబ్దుల్లా కూడా ఉన్నారు. జమ్మూకశ్మీరు ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. అలాగే తీవ్రంగా గాయపడిన వారికి రూ.2 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.లక్ష పరిహారం ఇవ్వనున్నట్లు తెలిపింది. మరోవైపు జమ్మూకశ్మీరు మొత్తం భద్రతా బలగాలను మోహరించారు. కాగా, పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో బాధితుల కుటుంబ సభ్యులు శ్రీనగర్‌కు చేరుకుంటున్నారు. ఈ క్రమంలో విమాన టికెట్ల ధరలు పెంచొద్దని కేంద్ర పౌర విమానయాన శాఖ విమానయాన సంస్థలను ఆదేశించింది. అలాగే శ్రీనగర్ మార్గంలో అదనపు విమానాలను నడపాలని కూడా సూచించింది. మంగళవారం అర్ధరాత్రి సౌదీ అరేబియా నుంచి హుటాహుటిన తిరుగు ప్రయాణమైన ప్రధాని మోదీ విమానం పాక్ గగనతలం గుండా ప్రయాణించలేదని అధికారులు తెలిపారు. ఉగ్రదాడి నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా ఆయన విమానం అరేబియా సముద్రం పైనుంచి ప్రయాణించి, గుజరాత్ గగనతలం మీదుగా ఢిల్లీ చేరుకున్నట్లు వెల్లడించారు. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్రంగా ఖండించారు. దాడికి గట్టిగా బదులిస్తామని, ఎవ్వరినీ వదిలే ప్రసక్తే లేదని ఉగ్రవాదులను హెచ్చరించారు. పహల్గాం ఉగ్రదాడిని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. బుధవారం ఆయన ఎన్ఎస్ఏ అజిత్ దోభాల్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేదీ, నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేశ్ త్రిపాఠీతో సమావేశమయ్యారు.

సింధు జలాలు బంద్

(మొదటి పేజీ తరువాయి)

వచ్చిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా.. అక్కడి పరిస్థితి గురించి భేటీలో వివరించారు. ఈ దాడికి పాల్పడినవారిని, అందుకు ప్రేరేపించినవారిని తీవ్రంగా శిక్షించేంతవరకూ విశ్రమించకూడదని సమావేశం నిర్ణయించింది. పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని త్రివిధ దళాలకు సూచించింది. కాగా.. పహల్గాం ఉగ్రదాడిపై గురువారం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కూడా ఈ భేటీలో నిర్ణయించారు. సీసీఎస్ సమావేశం ముగిసిన అనంతరం.. అందులో తీసుకున్న కీలక నిర్ణయాల గురించి విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మీడియాకు వెల్లడించారు. అవేంటంటే..

- ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో 1960లో కుదుర్చుకున్న సింధు జలాల ఒప్పందం అమలు నిలిపివేత. ఈ నిర్ణయంతో.. సింధు, దాని ఉపనదులైన జీలమ్, చీనాబ్, రావి, బియాస్, సట్లెజ్ నుంచి పాకిస్థాన్‌కు నీటి సరఫరాను ఆపేస్తారు. సీమాంతర ఉగ్రవాదానికి మద్దతును పాక్ విశ్వసనీయంగా, కచ్చితంగా నిలిపివేసేదాకా ఈ ఒప్పందం అమలు కాదని భారత్ ప్రకటించింది.
- వాఘా-అట్టారీ వద్ద ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్ట్ తక్షణ మూసివేత. సరైన పత్రాలతో ఆ దారి గుండా ఇప్పటికే భారత్‌లోకి ప్రవేశించినవారు మే1లోపు అదే మార్గంలో వెళ్లిపోవాలని ఆదేశించింది.
- సార్క్ వీసా మినహాయింపు పథకం కింద పాక్ జాతీయులకు భారత్‌లోకి ప్రవేశం నిషిద్ధం. ఇప్పటికే అలా వచ్చినవారి వీసాలు రద్దయిపోతాయి. ఈ మినహాయింపు కింద భారత్‌లో ఉన్న పాక్ జాతీయులందరూ 48 గంటల్లోగా దేశం విడిచి వెళ్లిపోవాల్సి ఉంటుంది. న్యాయమూర్తులు, చట్టసభల సభ్యులు, సీనియర్ అధికారులు, వాణిజ్య ప్రముఖులు, పాత్రికేయులు, క్రీడా ప్రముఖులు.. ఇలా 24 కేటగిరీలకు చెందిన ప్రముఖులు సార్క్ దేశాల మధ్య వీసా రహిత ప్రయాణం చేసేందుకు వీలుగా 1992లో ఈ పథకాన్ని ప్రారంభించారు. దీని కింద.. ఆయా కేటగిరీలకు చెందిన ప్రముఖులకు వారి వారి దేశాలు ఏడాది వ్యాలిడిటీ ఉన్న ప్రత్యేక వీసా స్టికర్ ఇస్తాయి. ఆ స్టికర్ ఉంటే సార్క్ దేశాలకు వారు సంప్రదాయ వీసా లేకుండానే ఎన్నిసార్లయినా రావొచ్చు, పోవచ్చు.
- పాకిస్థానీ హైకమిషన్‌లో ఉన్న రక్షణ, సైనిక, నౌకా దళ, వైమానిక దళ సలహాదారులందరినీ అవాంఛిత వ్యక్తులుగా (పర్సొనా నాన్ గ్రేటా) ప్రకటించింది. వారం రోజుల్లోగా వారంతా తమ దేశానికి తిరిగి వెళ్లిపోవాలని ఆదేశించింది. అలాగే.. ఇస్లామాబాద్‌లో ఉన్న భారత హైకమిషన్‌లోని రక్షణ, సైనిక, నౌకా దళ, వైమానిక దళ సలహాదారులందరినీ భారత్ ఉపసంహరించుకుంది. ఆ పోస్టులన్నీ రద్దు చేసింది.
- రెండు దేశాల్లోని హైకమిషన్లలో సిబ్బంది సంఖ్యను 55 నుంచి 30కి తగ్గించింది. మే 1 నుంచి ఈ నిర్ణయం అమలు కానుంది.



పహల్గాం ఉగ్రదాడి మృతులకు అమిత్ షా నివాళి

ఉగ్రవాదంతో మానవాళికి తీవ్ర ముప్పు

- సంయుక్త ప్రకటనలో ఖండించిన మోదీ, సౌదీ యువరాజు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: ఉగ్రవాదం, హింసాత్మక తీవ్రవాదం మానవాళికి తీవ్ర ముప్పుగా పరిణమించాయని ప్రధాని మోదీ, సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ పేర్కొన్నారు. కారణం ఏదైనప్పటికీ ఉగ్రవాద చర్య సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. ఇతర దేశాలపై ఉగ్రవాద చర్యలకు పాల్పడటానికి క్షిపణులు, డ్రోన్లు సహా ఆయుధాలు అందకుండా నివారించాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం సౌదీ అరేబియాకు వెళ్లిన మోదీ బుధవారం స్వదేశానికి తిరిగి రావాల్సి ఉండగా, జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో తన పర్యటనను కుదించుకొని మంగళవారం రాత్రే స్వదేశానికి తిరిగివచ్చారు. అంతకుముందు మంగళవారం రాత్రి జెద్దాలో సౌదీ యువరాజుతో మోదీ ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో పహల్గాం ఉగ్రదాడిని మోదీ, మొహమ్మద్ బిన్ సల్మాన్ తీవ్రంగా ఖండించినట్టు ఒక సంయుక్త ప్రకటన విడుదలైంది.

సింధుపై పట్టు మనకే


న్యూఢిల్లీ, ఏప్రిల్ 23 : "ఒకే సమయంలో, ఒకేచోట నెత్తురు, నీళ్ల ప్రవహించవు" అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సింధూ జలాల ఒప్పందాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. పాక్ కారణంగా సరిహద్దుల్లో తలెత్తిన ఉద్రిక్తతలను దృష్టిలో ఉంచుకుని 2016లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు సింధూ జలాల ఒప్పందాన్ని రద్దుచేసుకుని ఆ మాటలను ఆయన నిజం చేసి చూపించారు. సింధూనది నుంచి నీటి పంపిణీకి సంబంధించి భారత్-పాకిస్థాన్ మధ్య కుదిరిన ఒప్పందం ఇది. ఈ ఒప్పందం నుంచి అధిక లబ్ధి పొందుతున్న దేశం పాకిస్థాన్. నదీ ప్రవాహానికి దిగువన ఉన్నా, సింధూ జలాల్లో 80శాతం ఆ దేశమే వాడుకుంటోంది. పాక్ దుశ్చర్యలతో సరిహద్దుల్లో ఎన్ని ఉద్రిక్తతలు తలెత్తినా...దాదాపు ఆరు దశాబ్దాలుగా నిరాటంకంగా ఈ ఒప్పందం కొనసాగడానికి భారత్ సహకరిస్తోంది. నీటి ప్రవాహానికి ఎగువన ఉన్నా, ఏ దశలోనూ పాక్‌కు వెళ్లే జలాల ప్రవాహాలను అడ్డుకోలేదు. ఈ విషయంలో ప్రపంచంలోనే శాంతియుత పంపకాలు జరిగిన అతి పెద్ద ఒడంబడిక ఇది.

విశిష్టతలు...

రెండు దేశాల మధ్య శాంతియుత నీటి పంపకాలకు వాహికగా నిలిచిన ఈ ఒప్పందానికి అనేక విశిష్టతలు ఉన్నాయి. అవి..

- సరిహద్దుల్లో జలాల పంపిణీకి కుదుర్చుకున్న ఆసియాలోని ఏకైక ఒప్పందమిది.
- 1965, 1971ల్లో రెండు యుద్ధాలు జరిగాయి. కానీ, సింధూ జలాల కమిషన్ జల వివాదాల పరిష్కారానికి ఆ సమయంలోనూ పనిచేసింది.
- భారత పార్లమెంటుపై 2001లో ఉగ్రదాడి జరిగింది. 2019లో పుల్వామాలో మన జవాన్లను పాక్ ముష్కరులు పొట్టనబెట్టుకున్నారు. అయినా, ఒప్పందం నుంచి భారత్ బయటకు రాలేదు. కనీసం ఒప్పందాన్ని సమీక్షించాలంటూ అంతర్జాతీయ ఒప్పందాలను పర్యవేక్షించే వియన్నా కన్వెన్షన్‌ను ఆశ్రయించలేదు.

పంపకాలు ఇలా..: ప్రపంచ బ్యాంక్ చొరవతో 1960లో సింధూజలాల ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం, సింధూ పరీవాహకం పరిధిలోని ఆరు నదులను ఇరుదేశాల మధ్య విభజించారు. సింధు, జీలం, చీనాబ్ నదులపై (పడమట) పాక్‌కు, బియాస్, రావి, సట్లెజ్ నదులపై (తూర్పు) భారత్‌కు హక్కును కల్పించారు. పంపకాల తీరు చూస్తే, సింధూజలాలు అత్యధికంగా పాక్‌లోనే ప్రవహిస్తున్నట్టు కనిపిస్తుంది. సాధారణంగా భారత్ తాగు,సాగు అవసరాలకు తూర్పు వైపు ప్రవహించే నదులపైనే ఆధారపడుతుంది. పడమట వైపు ప్రవహించేనదుల నీటితో పెద్దగా మనకు పని ఉండదు. అందువల్ల సింధూజలాలు అత్యధికంగా పాక్‌కు దక్కుతున్నాయి. అదేసమయంలో భారత్ నదీ ప్రవాహానికి ఎగువన ఉంది. భౌగోళికంగా వ్యూహాత్మక అనుకూలత ఇది. కోరుకుంటే, పాకిస్థాన్‌కు జలాల ప్రవాహాన్ని అడ్డుకోగలదు. ప్రపంచ బ్యాంక్ చొరవతో తొమ్మిదేళ్లపాటు చర్చలు జరిగి, చివరకు 1960లో ఇరుదేశాల మధ్య సింధూ జలాల ఒప్పందం ఖరారైంది.



తలపై గురిపెట్టి, కలిమా చదవమన్నారు

- పక్కనున్న వాళ్లతో పదం కలిపి బతికిపోయాను
- అసోం వర్సిటీ ప్రొఫెసర్ దెబాశీష్ భట్టాచార్య



జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన సమయంలో.. అసోం యూనివర్సిటీలో బెంగాలీ బోధించే ప్రొఫెసర్ దేబాశీష్ భట్టాచార్య కూడా తన కుటుంబ సభ్యులతో అక్కడే ఉన్నారు. ఆయన ఎన్‌డీటీవీతో మాట్లాడుతూ మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకున్న ఘటన వివరాలను వెల్లడించారు. "బైసరన్ అందాలను వీక్షిస్తున్నాం. పర్యాటకులు గుంపులు గుంపులుగా ఉన్నారు. తొలుత తుపాకీ పేలిన శబ్దాలు వస్తే.. అటవీశాఖ అధికారుల చర్య అనుకున్నాం. కాసేపటికి ఓ సాయుధుడు మునుగు ధరించి మాకు కొంత దూరంలో ఉన్న జంటతో మాట్లాడాడు. అప్పటికీ.. అతణ్ని అటవీశాఖ అధికారిగానే భావించాం. కానీ, అతను హఠాత్తుగా అక్కడున్న యువకుడిని కాల్చి చంపాడు. దాంతో.. మేము ఉన్న చోట గుంపు అంతా ఓ చెట్టు వద్ద నేలపై పడుకున్నాం. దుండగుడు మా వద్దకు వచ్చాడు. కలిమా(ఇస్లామిక్ వాక్యం) చదవమన్నాడు. నా చుట్టూ ఉన్నవారు కలిమా చదివారు. నేను కూడా వారితో పదం కలిపాను. నా వద్దకు వచ్చి తలకు తుపాకీ గురిపెట్టాడు. అప్పటికే కలిమాను వినడం వల్ల.. 'లా ఇలాహ..' అంటూ ఉచ్చరించాను. అంతే.. ముష్కరుడు నన్ను వదిలి వెళ్లిపోయాడు" అని భట్టాచార్య వివరించారు.

కలిమా పఠించకపోవడంతో కాల్పులు

- దాడిలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఎల్ఐసీ మేనేజర్ హతం
- ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని బంధువుల డిమాండ్

ఇండోర్, ఏప్రిల్ 23: పహల్గామ్ ఉగ్రదాడిలో మరిన్ని విషాదకరమైన విషయాలు వెలుగుచూస్తున్నాయి. పర్యాటకులే లక్ష్యంగా దాడులకు తెగబడిన ఉగ్రవాదులు మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక ఎల్ఐసీ మేనేజర్ సుశీల్ నతన్యాల్ (58)ను ఇస్లామిక్ ధర్మోక్తి (కల్మా)ను పఠించమని అడిగారు. తాను పఠించలేనని చెప్పడంతో తలపై కాల్చిచంపారు. తన తండ్రిని ఆ పరిస్థితుల్లో చూసి భయపడి ఆయన వైపు పరుగుతీసిన సుశీల్ కూతురు ఆకాంక్ష (35) కాలుపై కాల్చారు. ప్రస్తుతం ఆమె జమ్మూకశ్మీర్‌లోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. క్రైస్తవ మతానికి చెందిన సుశీల్ నతన్యాల్ ఈస్టర్ సందర్భంగా తన భార్య, కూతురు, కుమారుడితో కలిసి పహల్గామ్‌కు వెళ్లారని వారి బంధువు సంజయ్ కుమావత్ తెలిపారు. అమాయకులైన పర్యాటకులపై దాడి హేయమైన చర్య అని, ఇంతకంటే ఘోరం మరొకటి ఉండదని వారి బంధువులు అన్నారు. దాడులకు పాల్పడిన వారిని వదలకూడదని, వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి మధ్యప్రదేశ్ ప్రభుత్వం అండగా ఉంటుందని, ప్రభుత్వం తరఫున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని ఇండోర్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సింగ్ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ఈ సంఘటనపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారని, జమ్మూకశ్మీర్ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారని ఆయన తెలిపారు.

సరిహద్దుల్లో పాక్ హై అలెర్ట్!

భారత్ ప్రతీకారదాడులపై భయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్ అప్రమత్తమైందా? పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు జరిపిన ఘాతుకానికి.. భారత్ బదులు తీర్చుకోనుందని ఆందోళన చెందుతోందా? బాలాకోట్ తరహా ఏరియల్ స్ట్రైక్స్ జరిపే సూచనలుండడంతో.. సరిహద్దుల్లోని రాడార్ వ్యవస్థలను అప్రమత్తం చేసి, నిఘాను ముమ్మరం చేసిందా? ఈ ప్రశ్నలకు ఫ్లైట్‌ట్రాకింగ్ వెబ్‌సైట్ 'ఫ్లైట్‌రాడార్24' అవుననే సమాధానం చెబుతోంది. దక్షిణ పాకిస్థాన్‌లోని కరాచీ ఎయిర్‌బేస్ నుంచి ఆ దేశ వాయుసేనకు చెందిన రెండు విమానాలను ఉత్తరాన– రావల్పిండి, లాహోర్ సమీపంలో.. భారత సరిహద్దులకు దగ్గర్లో ఉన్న వైమానిక స్థావరాలకు తరలించినట్లు వివరిస్తోంది. ఫ్లైట్‌ట్రాకింగ్ సమాచారం మేరకు సీ-130ఈ(పీఏఎఫ్ 198) రవాణా విమానం, పీఏఎఫ్ 101 నిఘా, వీఐపీలను తరలించే విమానాలను భారత సరిహద్దుల్లో మోహరించినట్లు తెలుస్తోంది. అదే విధంగా మిలటరీ వనరులను సైతం సరిహద్దులకు తరలిస్తున్నట్లు సమాచారం. వీటిల్లో పీఏఎఫ్-101 విమానంలో అధునాతన ఎయిర్‌బోర్న్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్(ఏఈడబ్ల్యూ అండ్ సీ) ఉంటుంది. అంటే.. భారత్ ఏదైనా ఏరియల్ స్ట్రైక్స్‌కు సిద్ధమైతే.. ఈ వ్యవస్థలోని రాడార్లు వెనువెంటనే అప్రమత్తం చేస్తాయి. పాక్‌వైపు దూసుకువచ్చే క్షిపణులు, యుద్ధ విమానాలను గుర్తిస్తుంది. అదేవిధంగా రావల్పిండిలోని నూర్‌ఖాన్ బేస్‌లో రాడార్లను కూడా పాకిస్థాన్ వాయుసేన అప్రమత్తం చేసినట్లు సమాచారం. సర్జికల్ స్ట్రైక్స్, బాలాకోట్ ఎయిర్‌స్ట్రైక్ వంటి ఉదంతాల నేపథ్యంలో.. పాకిస్థాన్ అప్రమత్తమైనట్లు తెలుస్తోంది.



ఎంపీ అరుణ్ గోవిల్ నేతృత్వంలో మీరట్‌లో బీజేపీ శ్రేణుల నిరసన

వాళ్లు పాకిస్థానీలే!

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ఈ ముగ్గురి వివరాలను తెలియజేసిన వారికి రూ.20 లక్షల చొప్పున రివార్డు ఇస్తామని ప్రకటించారు. ఉగ్రదాడి నుంచి ప్రాణాలతో బయటపడిన వారు చెప్పిన గుర్తులు ఆధారంగా ఈ ఊహాచిత్రాలు గీయించారు. ఇక, లష్కరే తాయిబా కమాండర్ సైఫుల్లా కసూరీ అలియాస్ ఖలీద్ ఈ దాడికి సూత్రధారి అని దర్యాప్తు సంస్థలు పేర్కొంటున్నాయి. కాగా, ఉగ్రవాదులు కశ్మీరులోకి ఎలా ప్రవేశించారు ? ఎంతకాలంగా కశ్మీరులో ఉన్నారు ? తదితర అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

● **బాడీ కెమెరాల్లో దాడి రికార్డు !**

దాడికి పాల్పడిన ఉగ్రవాదులు బాడీ కెమెరాలు ఉపయోగించి దాడి మొత్తాన్ని రికార్డు చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. శరీరానికి లేదా తుపాకీలకు అమర్చిన కెమెరాల సాయంతో ఉగ్రవాదులు తాము చేసే దాడులను రికార్డు చేయడం ఇటీవల కాలంలో అధికమైందని జమ్మూకశ్మీర్ పోలీసు శాఖకు చెందిన ఓ అధికారి తెలిపారు. ఆయా వీడియోలను ఉగ్రవాదులు తర్వాత ప్రచారం కోసం వాడుకుంటున్నారని చెప్పారు.

మృతులంతా పురుషులే

భారత నేవీలో లెఫ్టినెంట్‌గా ఉన్న ఓ హరియాణా వాసి, అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్న కోల్‌కతా వాసి, విశాఖపట్నంకు చెందిన రిటైర్డు బ్యాంకు ఉద్యోగి, కర్ణాటకకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి, తదితరులు పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి జాబితాలో ఉన్నారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన 26 మంది జాబితాను దర్యాప్తు సంస్థలు విడుదల చేశాయి. మృతుల్లో మహారాష్ట్రకు చెందిన వారు ఆరుగురు, గుజరాత్ వారు ముగ్గురు, కర్ణాటక వారు ముగ్గురు, పశ్చిమ బెంగాల్ వ్యక్తులు ఇద్దరు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్, ఒడిసా, మధ్యప్రదేశ్, పంజాబ్, బిహార్, ఉత్తరప్రదేశ్, కేరళ రాష్ట్రాలకు చెందిన వారు ఒక్కొక్కరు ఉన్నారు. వీరు కాక నేపాల్‌కు చెందిన ఓ వ్యక్తి, పహల్గాం స్థానికుడు కూడా మృతుల్లో ఉన్నారు. మృతులంతా పురుషులే కావడం గమనార్హం.

మృతుల జాబితా

	పేరు	ప్రాంతం
1	సుశీల్ నథ్యాల్	ఇండోర్
2	సయ్యద్ అదిల్ షా	పహల్గాం
3	హేమంత్ సుభాష్ జోషి	ముంబై
4	వినయ్ నర్వాల్	హరియాణా
5	అతుల్ శ్రీకాంత్ మోని	మహారాష్ట్ర
6	నీరజ్ ఉధావని	ఉత్తరాఖండ్
7	బితన్ అధికారి	కోల్‌కతా
8	సుదీప్ నెపుణె	నేపాల్
9	శుభమ్ ద్వివేది	కాన్పూర్
10	ప్రశాంత్ కుమార్ స్తపథి	ఒడిసా
11	మనీశ్ రంజన్	బిహార్
12	ఎన్ రామచంద్ర	కేరళ
13	సంజయ్ లక్ష్మణ్ లలీ	థాణే
14	దినేశ్ అగర్వాల్	ఛత్తీస్‌గఢ్
15	సమీర్ గుహర్	కోల్‌కతా
16	దిలీప్ దసాలి	ముంబై
17	జే చంద్రమౌళి	విశాఖపట్నం
18	మధుసూదన్(నెల్లూరు వాసి)	బెంగళూరు
19	సంతోష్ జగ్దా	పుణె
20	మంజునాథ్ రావు	కర్ణాటక
21	కస్తూబ గాన్వోతే	పుణె
22	భరత్ భూషణ్	బెంగళూరు
23	సుమిత్ పర్మార్	గుజరాత్
24	యతీశ్ పర్మార్	గుజరాత్
25	తేజాలైంగ్	అరుణాచల్ ప్రదేశ్
26	శైలేశ్‌భాయి	గుజరాత్

ఢిల్లీలో భద్రత కట్టుదిట్టం

పర్యాటక ప్రదేశాలపై ప్రత్యేక నిఘా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ వెలుపల ఢిల్లీ పోలీసు సిబ్బందితో పాటు పారామిలటరీ బలగాలు మోహరించాయి. అక్కడ శాంతి భద్రతలకు ఎటువంటి ఆటంకం కలగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టామని ఓ సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పర్యటన నేపథ్యంలో ఢిల్లీలో ఇప్పటికే భద్రతను పటిష్ఠం చేశారు. ఎర్రకోట, ఇండియా గేట్, కుతుబ్ మినార్, జామా మసీదు, జంతర్ మంతర్, రాజ్‌ఘాట్ వంటి ప్రసిద్ధ పర్యాటక ప్రదేశాల వద్ద భద్రతను పెంచారు. అలాగే మెట్రో స్టేషన్లు, బస్ టెర్మినల్స్, రైల్వే స్టేషన్లు, మాల్స్, మార్కెట్‌ల వద్ద కూడా పోలీసులు నిఘా పెట్టారు. అనేక మెట్రో స్టేషన్లలో ఢిల్లీ పోలీసు హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. సీనియర్ పోలీసు అధికారులందరూ రంగంలోకి దిగి ఉత్తరప్రదేశ్, హరియాణా సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయనున్నారు. చాందినీ చౌక్, సదర్ బజార్, లజ్‌పత్ నగర్, సరోజినీ నగర్, రాజౌరి గార్డెన్ వంటి రద్దీ ప్రదేశాలలో నిఘా పెంచారు.



ఢిల్లీలోని పాక్ హైకమిషన్ దగ్గర భద్రతా బలగాలు

మరో ఉగ్రదాడి జరిగే అనుమానం!

- నిఘావర్గాల సమాచారం.. రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం

హైదరాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): దేశంలో మరో ఉగ్రదాడి జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. పహల్గామ్ దాడి నేపథ్యంలో అన్ని రాష్ట్రాలు మరింత అప్రమత్తంగా ఉండాలని కేంద్రం నుంచి రాష్ట్రాలకు సందేశాలు అందాయి. ముఖ్యంగా రద్దీ ప్రాంతాలు, విమానాశ్రయాలు, రైల్వేస్టేషన్లు, షాపింగ్ మాల్స్, పర్యాటక ప్రదేశాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఈనెల 25, 26 తేదిల్లో భారత్ సమ్మిట్ పేరిట సదస్సు జరగనున్న క్రమంలో భద్రతా ఏర్పాట్లను ఉన్నతాధికారులు మరోసారి సమీక్షించారు. ఈ సదస్సులో 100దేశాల నుంచి సుమారు 450మంది అతిధులు పాల్గొంటున్నారు. జాతీయ, అంతర్జాతీయ రాజకీయ, సామాజిక అంశాలపై చర్చలు జరగనున్నాయి. ఈ సదస్సు తొలిరోజున కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులు ఖర్గే, రాహుల్ గాంధీ ప్రసంగాలు ఉంటాయి. రెండవ రోజున ప్రియాంక గాంధీ వాద్రా, కేసీ వేణుగోపాల్ తదితర సీనియర్ నాయకుల ప్రసంగాలు ఉంటాయి. సీఎం రేవంత్‌తో పాటు రాష్ట్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల నుంచి కొందరు సీఎంలు ఈ సదస్సుకు హాజరవుతున్నారు. పహల్గామ్ దాడి నేపథ్యంలో దేశంలో మరో దాడి జరిగే అవకాశం ఉందనే నిఘావర్గాల సమాచారంతో ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. సదస్సు జరిగే మాదాపూర్ ప్రాంతంలోనూ, ప్రముఖులు బస చేస్తున్న హోటళ్ల వద్ద భద్రతను రెట్టింపు చేశారు. దేశ, విదేశీ పర్యాటకులు సందర్శించే చార్మినార్, చౌమహల్లా ప్యాలెస్, గోల్కొండ కోటతో పాటు చార్మినార్ భాగ్యలక్ష్మి మందిరం, బిర్లామందిర్, చిల్కూర్ బాలాజీ మందిరం ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తుపై దృష్టి సారించాలని పర్యాటక శాఖ అధికారులు పోలీసు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

తుపాకీ లాక్కోబోయి.. తూటాలకు బలైపోయి..

పర్యాటకులపై దాడిని అడ్డుకునే క్రమంలో హుస్సేన్ మృతి



పహల్గాం, ఏప్రిల్ 23: ప్రకృతి అందాలను చూసి మైమరచిపోతున్న పర్యాటకులపైకి ఉగ్రవాదులు ఒక్కసారిగా కాల్పులకు తెగబడగా.. ప్రాణభయంతో అందరూ పరుగులు తీశారు. కానీ, ఒక్క వ్యక్తి మాత్రం ముష్కరులను అడ్డుకునే ప్రయత్నం చేశాడు. పహల్గాంలోని బైసారన్‌లో ఉగ్రవాదులు కాల్పులు జరుపుతుండగా.. తుపాకీ లాక్కొనేందుకు యత్నించాడు. అతనే సయీద్ అదిల్ హుస్సేన్ షా. స్థానికుడైన హుస్సేన్.. తన గుర్రంపై పర్యాటకులను బైసారన్ తీసుకెళుతుంటాడు. మంగళవారం తన కళ్లెదుటే ముష్కరులు అమాయకులైన పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరుపుతుంటే తట్టుకోలేకపోయాడు. దాడిని అడ్డుకునేందుకు ధైర్యంగా ముందుకెళ్లాడు. ఉగ్రవాదుల నుంచి తుపాకులు లాక్కోవడానికి ప్రయత్నించాడు. ఆ క్రమంలో ముష్కరుల తూటాలకు బలైపోయాడు. పహల్గాం నుంచి సముద్ర మట్టానికి సుమారు 3 వేల అడుగుల ఎత్తులో ఉన్న టులియన్ సరస్సుకు వెళ్లాలంటే నడక, గుర్రపు స్వారీ తప్ప వేరే మార్గం లేదు. ఈ క్రమంలోనే వాహనాలు పార్కింగ్ చేసిన చోటు నుంచి పర్యాటకులను గుర్రంపై బైసారన్‌కు తీసుకెళ్తుంటాడు హుస్సేన్. ఇదే అతనికి జీవనోపాధి. భార్య, పిల్లలు, తల్లిదండ్రులను అతనే పోషిస్తున్నాడు. మంగళవారం కూడా పర్యటకులను బైసారన్ పచ్చిక బయళ్ల ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడి క్యాంపుల్లోని పర్యాటకులు ప్రకృతిని ఆస్వాదిస్తున్నప్పుడే ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. వారిని అడ్డుకొనే క్రమంలో హుస్సేన్ ప్రాణాలొదిలాడు. దీంతో అతని కుటుంబం రోడ్డున పడినట్లయింది. తమకు న్యాయం చేయాలని హుస్సేన్ తల్లిదండ్రులు కోరుతున్నారు. 'నా కుమారుడు గుర్రం తీసుకొని పహల్గాం వెళ్లాడు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఉగ్రదాడి గురించి మాకు తెలిసింది. వెంటనే హుస్సేన్‌కు ఫోన్ చేస్తే స్విచాఫ్ వచ్చింది. ఆ దాడిలో నా కుమారుడు చనిపోయాడని తర్వాత తెలిసింది' అంటూ హుస్సేన్ తండ్రి సయ్యద్ హైదర్ కన్నీరుమున్నీరయ్యారు.

ప్రపంచ దేశాల ఖండన

పహల్గాం ఉగ్రదాడిని ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాయి. అమాయకులైన పౌరులను కాల్చిచంపడం అనాగరిక, అమానవీయ చర్య అని 20కు పైగా దేశాలు పేర్కొన్నాయి. అమెరికా, రష్యా, చైనా, జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, ఇజ్రాయెల్, యూఏఈ, శ్రీలంక, నేపాల్, మాల్దీవులు, తదితర దేశాలు ఉగ్రదాడిని ఖండిస్తూ మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపాయి. పహల్గాం ఉగ్రదాడిని ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్, ఈయూ విదేశాంగ వ్యవహారాల ప్రతినిధి కాజా కల్లాస్ కూడా ఖండించారు.

ఖాళీ అవుతున్న కశ్మీరం!

విమానాల్లో ఆరు గంటల్లోనే 3,337 మంది వెనక్కి!

- భయంతో కశ్మీర్‌ను వీడుతున్న పర్యాటకులు
- ఉగ్రదాడికి నిరసనగా జమ్మూకశ్మీర్‌లో బంద్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: దారుణ ఉగ్రదాడి నేపథ్యంలో కశ్మీర్‌లోని పర్యాటక స్థలాలన్నీ ఖాళీ అవుతున్నాయి. వివిధ ప్రాంతాలను సందర్శించేందుకు వచ్చిన వేలాది మంది పర్యాటకులు భయంతో వెనుదిరుగుతున్నారు. ఉగ్రదాడి జరిగిన తర్వాత కేవలం ఆరు గంటల్లోనే 3,337 మంది విమానాల్లో శ్రీనగర్‌ను వీడినట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు. రద్దీ దృష్ట్యా అదనపు విమానాలను అందుబాటులోకి తెచ్చామని, విమానాశ్రయంలో ప్రత్యేక సదుపాయాలు కల్పించామని తెలిపారు. టికెట్ ధరలు పెంచొద్దని విమానయాన సంస్థలను ఆదేశించామని, అన్ని సంస్థలు ఇప్పటికే టికెట్ల క్యాన్సిలేషన్, రీషెడ్యూల్ చార్జీలను రద్దు చేశాయని వివరించారు. మరోవైపు త్వరలో కశ్మీర్‌లో పర్యటించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నవారు.. తమ ప్రయాణ టికెట్లు, హోటల్ బుకింగ్స్ వంటివి రద్దు చేసుకుంటున్నారు. ఉగ్రదాడి జరిగాక ఒక్క రోజులోనే జమ్మూకశ్మీర్‌కు 90 శాతం బుకింగ్స్ రద్దయినట్టు ఢిల్లీలోని ట్రావెల్స్ సంస్థలు చెబుతున్నాయి. మిగతావారు కూడా రద్దు చేయాలని కోరుతున్నారని ఢిల్లీ కన్నాట్‌ప్లేస్‌లోని స్వాన్ ట్రావెలర్స్ సంస్థ నిర్వాహకుడు గౌరవ్ రాతీ పేర్కొన్నారు. జమ్మూకు, వైష్ణోదేవి ఆలయం వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు కూడా పర్యాటకులు భయపడుతున్నారని స్వస్తిక్ ట్రావెల్స్ సంస్థ ప్రతినిధి తెలిపారు. ఇక జమ్మూకశ్మీర్‌కు సంబంధించి ఎలాంటి కొత్త బుకింగ్స్ తీసుకోవద్దని శ్రీనగర్ ట్రావెల్ అసోసియేషన్ నుంచి సమాచారం వచ్చిందని ఏజే టూర్స్ అండ్ ట్రావెల్స్ ప్రతినిధి వెల్లడించారు.

ఆరేళ్లలో తొలిసారి బంద్..

ఉగ్రదాడిని నిరసిస్తూ జమ్మూకశ్మీర్‌లోని చాలా ప్రాంతాల్లో బుధవారం బంద్ పాటించారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత బంద్ జరగడం ఇదే తొలిసారి. ముఖ్యంగా జమ్మూ నగరం, ఉధంపూర్, కత్రా, కథువా, సాంబ తదితర ప్రాంతాల్లో పూర్తిగా బంద్ పాటించారు. దుకాణాలు, వాణిజ్య సంస్థలు, విద్యా సంస్థలు మూసివేశారు. ఈ నేపథ్యంలో భారీగా భద్రతా దళాలను మోహరించారు. బంద్‌కు పిలుపునిచ్చిన జమ్మూ చాంబర్ ఆఫ్ కామర్స్, బార్ అసోసియేషన్, ఆల్ జమ్మూకశ్మీర్ ట్రాన్స్‌పోర్టర్స్ అసోసియేషన్, జమ్మూ ట్రేడర్స్ అసోసియేషన్ తదితర సంస్థలతోపాటు రాజకీయ పార్టీలు, ఇతర సంస్థలు నిరసన ప్రదర్శనలను నిర్వహించాయి. బీజేపీ, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, కాంగ్రెస్ కార్యకర్తలు పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ఆందోళనలు నిర్వహించారు. దిష్టిబొమ్మలను దహనం చేశారు. ర్యాలీ నిర్వహించే క్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. సర్జికల్ స్ట్రైక్స్ తరహా దాడులతో ఉగ్రమూకల స్థావరాలపై దాడి చేసి పాకిస్థాన్‌కు బుద్ధిచెప్పాలని బీజేపీ ఎమ్మెల్యే యుద్‌వీర్ సేథీ డిమాండ్ చేశారు. ఇటీవల హమాస్ చేసిన దాడికి ప్రతిగా ఇజ్రాయెల్ విరుచుకుపడిన స్థాయిలో.. పాకిస్థాన్‌కు భారత్ సమాధానం ఇవ్వాలని జమ్మూకశ్మీర్ మాజీ డీజీపీ ఎస్‌పీ వైద్ పేర్కొన్నారు. మరోవైపు బనిహాల్, రాజౌరీ, పూంఛ్, దోడా తదితర ప్రాంతాల్లో జమ్మూకశ్మీర్ స్థానిక రాజకీయ పార్టీలు పీడీపీ, నేషనల్ కాన్ఫరెన్స్, పలు ముస్లిం సంస్థలు కూడా ఉగ్రదాడిని నిరసిస్తూ ప్రదర్శనలు నిర్వహించాయి. ఇదిలా ఉండగా, పహల్గామ్ ఉగ్రదాడిని నిరసిస్తూ జమ్మూకశ్మీర్‌లోని పత్రికలు బుధవారం నాటి తమ సంచికల మొదటి పేజీలను నలుపు రంగుతో నింపేశాయి. ముష్కర దాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారంటూ నివాళి అర్పించాయి. కాగా, పర్యాటకులపై దాడికి పాల్పడినవారు మానవత్వం లేని జంతువులని, బాధితుల కుటుంబాలకు సానుభూతి ప్రకటిస్తున్నామని నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు.



శ్రీనగర్‌లోని నద్రూస్ హోటల్‌లో తెలంగాణ పర్యాటకులు

కశ్మీర్‌లో 80మంది తెలంగాణ టూరిస్టులు

మెదక్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): విహార యాత్ర కోసం కశ్మీర్‌కు వెళ్లిన 80 మంది తెలంగాణ టూరిస్టులు పహల్‌గామ్ ఉగ్రదాడితో బెంబేలెత్తిపోతున్నారు. ఉగ్రదాడి తర్వాత జమ్మూకశ్మీర్‌లో ఆంక్షలు కొనసాగుతుండటంతో తిరిగి స్వరాష్ట్రానికి వచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్రంలోని ప్రముఖ చిట్‌ఫండ్ సంస్థ హైదరాబాద్, మహబూబ్‌నగర్, వరంగల్, సంగారెడ్డి, మెదక్‌కు చెందిన 80మంది ఏజెంట్లను కశ్మీర్ పర్యటనకు తీసుకువెళ్లింది. వారంతా మంగళవారం ఉదయం 10 గంటలకు శ్రీనగర్‌లోని నద్రూస్ హోటల్లో బసచేశారు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో శ్రీనగర్‌లోని తుల్ప్ గార్డెన్స్‌ను సందర్శించారు. ఆ తర్వాత మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పహల్‌గామ్(ఉగ్రదాడి జరిగింది ఇక్కడే), గుల్‌మార్గ్, దాల్ లేక్, గోండోల్ ప్రాంతాలను పర్యటించేందుకు సంస్థ షెడ్యూల్ రూపొందించింది. అయితే, మంగళవారం మధ్యాహ్నమే పహల్‌గామ్‌లో ఉగ్రదాడి జరగడంతో తెలంగాణ టూరిస్టులు తమ పర్యటనను రద్దు చేసుకొని, తిరిగి వచ్చేందుకు సిద్ధమయ్యారు. అయితే, ఆంక్షలు, బంద్ కారణంగా వెనక్కి రావడం కష్టంగా ఉందంటూ మెదక్ ప్రాంతానికి చెందిన ఓ పత్రికా విలేకరి రాష్ట్ర కాంగ్రెస్ నేత మైనంపల్లి హన్మంత్‌రావుకు వీడియోల ద్వారా సమాచారం అందించారు. మైనంపల్లి వెంటనే స్పందిస్తూ.. గతంలో కరీంనగర్ ఎస్పీగా రాష్ట్రంలో విధులు నిర్వర్తించి, ప్రస్తుతం జమ్మూకశ్మీర్ డీజీపీగా పనిచేస్తున్న నళినీ ప్రభాత్‌తో మాట్లాడి టూరిస్టులను తిరిగి రప్పించేందుకు ఏర్పాట్లు చేయిస్తానని ధైర్యం చెప్పారు.

విహారంలో విషాదం

కశ్మీర్ ఉగ్రదాడిలో ఇద్దరు ఏపీ వాసుల దుర్మరణం



చంద్రమౌళి



మధుసూదనరావు

విశాఖపట్నం/కావలి రూరల్/నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కశ్మీర్ ఉగ్రదాడిలో విశాఖపట్నానికి చెందిన విశ్రాంత బ్యాంకు ఉద్యోగి చంద్రమౌళి ప్రాణాలు కోల్పోయారు. భార్య, స్నేహితులతో కలిసి విహారం కోసం కశ్మీర్ వెళ్లారని, ఊహించని విధంగా ఉగ్రవాదుల దాడిలో చనిపోవడం తమ కుటుంబంలో విషాదం నింపిందని ఆయన తోడల్లుడు కుమార్‌రాజా ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాకుళానికి చెందిన జేఎస్ చంద్రమౌళి (68) ఎస్బీఐలో పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. తన స్నేహితులు అప్పన్న, శేషగిరి కుటుంబాలతో కలసి ఈ నెల 18న చంద్రమౌళి దంపతులు కశ్మీర్ యాత్రకు వెళ్లారు. కాగా, ఉగ్రదాడి జరిగిన స్థలంలో ఒక మృతదేహం చంద్రమౌళిదిగా అధికారులు గుర్తించారు. ఉగ్రవాదుల దాడిలో నెల్లూరు జిల్లా కావలికి చెందిన సోమిశెట్టి మధుసూదనరావు(42) దుర్మరణం పాలయ్యారు. ఆయన ఐబీఎంలో, ఈయన భార్య ప్రసన్న కామాక్షి టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పని చేస్తున్నారు. బెంగుళూరులో స్థిరపడ్డారు. పిల్లలకు సెలవులు కావడంతో గత ఆదివారం రాత్రి వీరి కుటుంబం కశ్మీరు విహార యాత్రకు వెళ్లింది. మంగళవారం మధ్యాహ్నం వరకు సరదాగా సాగిన తమ యాత్ర ఫొటోలను బంధువులకు షేర్ చేశారు. అంతలోనే పహల్గాంలో ఉగ్రమూకలు జరిపిన కాల్పుల్లో మధుసూదనరావు అక్కడికక్కడే మృతిచెందారు.

మాకు సంబంధం లేదు: పాక్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: పహల్గాం ఉగ్రదాడితో తమకు ఎలాంటి సంబంధం లేదని పాకిస్థాన్ పేర్కొంది. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ఆమోదించబోమని తెలిపింది. కేంద్ర ప్రభుత్వం నాగాలాండ్, మణిపూర్, కశ్మీర్, ఛత్తీస్‌గఢ్ సహా చాలా రాష్ట్రాల్లో నిరసనలు ఎదుర్కొంటోందని, అనేక మందిపై ఉక్కుపాదం మోపుతోందని, వాటి పర్యవసానమే పహల్గాం దాడి అని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యానించారు. ఆ దాడి భారత్‌లో స్థానిక పరిస్థితుల వల్ల జరిగిందని పేర్కొన్నారు. స్థానిక శక్తులు భారత ప్రభుత్వాన్ని లక్ష్యం చేసుకుంటే... నెపాన్ని పాకిస్థాన్‌పైకి నెట్టివేయడం సులువు అవుతుందని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదానికి స్థానికులు లక్ష్యం కారాదని, ఈ విషయంలో తమకు ఎలాంటి సందేహం లేదని పేర్కొన్నారు.

ఉగ్రవాదులకు గుణపాఠం చెప్పాలి

- దాడిని ఖండిస్తున్నాం: అసదుద్దీన్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ పేర్కొన్నారు. భద్రతా లోపం, నిఘా వైఫల్యమే ఈ ఘటనకు కారణమన్నారు. పహల్గాంలో ఉగ్రవాదులు మతం అడిగి మరీ అమాయకులను చంపినట్టు వార్తలు వచ్చాయని, ఇది అత్యంత గర్హనీయమన్నారు. ఉరి, పుల్వామా దాడి కంటే పహల్గాం ఘటన ఘోరమని పేర్కొన్నారు. ఉగ్రవాదులకు ప్రభుత్వం గుణపాఠం చెప్పాలని కోరారు.

సుప్రీం కోర్టు సంతాపం

ఉగ్ర ఘటనలో మృతులకు సుప్రీంకోర్టు సంతాపం ప్రకటించింది. బుధవారం లంచ్ తర్వాత మధ్యాహ్నం 2గంటల సమయంలో అన్ని కోర్టు హాళ్లలో ఒకేసారి అందరూ పహల్‌గామ్ మృతులకు సంతాప సూచకంగా నిలబడి నిమిషం పాటు మౌనం పాటించారు.

నిఘా వర్గాలు హెచ్చరించినా



బుధవారం అనంత్‌నాగ్‌లో భద్రతా బలగాల సెర్చ్ ఆపరేషన్

భద్రతా దళాల వైఫల్యం వల్లే ఉగ్రదాడి జరిగిందంటున్న విశ్వసనీయ వర్గాలు

- సైనికుల దుస్తుల్లో వచ్చి 70 రౌండ్ల కాల్పులు.. ప్రాథమిక దర్యాప్తులో వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: పహల్గామ్‌లో ఉగ్రదాడి జరగబోతోందనే సమాచారం మన నిఘా వర్గాలకు కొద్ది రోజుల క్రితమే తెలిసిందా? "ఒక టెర్రర్ గ్రూప్ స్థానికేతరులపై (కశ్మీర్‌కు వచ్చే పర్యాటకులపై) దాడికి ప్రణాళికలు రచిస్తోంది" అంటూ నిఘావర్గాలు అప్రమత్తం చేశాయా? అయినా భద్రతా సంస్థలు పట్టించుకోకపోవడం వల్లే ఇంతమంది చనిపోయారా? అంటే.. విశ్వసనీయ వర్గాలు ఈ ప్రశ్నలు ఔననే సమాధానమే ఇస్తున్నాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌కు (పీవోకే) చెందిన ఒక ఉగ్రవాది.. ఈ దాడికి సంబంధించి సూచనప్రాయ వ్యాఖ్యలు చేశాడని, తాము ఆ సమాచారాన్ని అందించినా భద్రతా దళాలు వాటిని పట్టించుకోలేదని ఆ వర్గాలు చెబుతున్నాయి. ఈ దాడికి వ్యూహరచన మొత్తం పీవోకే, పాక్‌కు చెందిన అంతర్జాతీయ హ్యాండ్లర్లు చేశారని.. దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులకు రియల్‌టైమ్‌లో ఎప్పుడేం చేయాలో ఆదేశాలు ఇచ్చారని, ఏయే ప్రాంతాల్లో భద్రతా దళాల సంఖ్య తక్కువగా, పర్యాటకుల సంఖ్య ఎక్కువగా ఉంటుందో సమగ్ర సమాచారం అందించారని ఆ వర్గాలు వెల్లడించాయి. ఉగ్రవాదులకు ఆయుధాల వినియోగంలో సమగ్ర శిక్షణ ఇచ్చారని తెలిపాయి. వారి హెల్మెట్లపై కెమెరాలున్నాయని.. దాడి ఘటనలను చిత్రీకరించి, సూత్రధారులకు పంపేందుకే వాటిని వినియోగించారని పేర్కొన్నాయి. అయితే, పహల్గాంలో ఉగ్రదాడి విషయంలో భద్రతా సంస్థల వైఫల్యం నిజమేగానీ.. పూర్తిగా విఫలమయ్యాయని చెప్పలేమని కర్ణాటకకు చెందిన రక్షణ రంగ వ్యవహారాల విశ్లేషకుడు గిరీశ్ లింగన్న అభిప్రాయపడ్డారు. దాడికి ముందు ఆ పరిసర ప్రాంతాల్లో ఉగ్రవాదులు రెక్కీ నిర్వహించిన విషయం, వారి అనుమానాస్పద కదలికల గురించి నిఘా వర్గాలకు సమాచారం ఉన్నట్టుగా తెలుస్తోందని.. కానీ, ఏ సమయంలో దాడి జరగబోతోంది? ఏ స్థాయిలో జరగబోతోందనే అంశంపై పూర్తి సమాచారం లేనందునే భద్రతా దళాలు సరిగ్గా స్పందించలేకపోయాయని ఆయన వివరించారు. దాడి జరిగిన వెంటనే మాత్రం భద్రతా దళాలు వేగంగా స్పందించాయని, మన దళాల సన్నద్ధత సామర్థ్యాన్ని ఇది సూచిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ వైఫల్యం నుంచి పాఠాలు నేర్చుకోవాలని.. పర్యాటకులు ఎక్కువగా వచ్చే ప్రాంతాల్లో మరింత మెరుగైన రియల్-టైమ్ సర్వైలెన్స్ ఏర్పాట్లు చేయాలని, కేంద్ర, రాష్ట్ర భద్రతా సంస్థల మధ్య బలమైన సమన్వయం ఉండాలని, ప్రత్యేకించి కశ్మీర్‌లో పర్యాటక ప్రదేశాలకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. ఉగ్రవాద నిరోధక చర్యల్లో భాగంగా అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించాలని, అంతర్జాతీయ మద్దతు.. మరీ ముఖ్యంగా అమెరికా మద్దతు తీసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు.

అచ్చం సైనికుల్లా..

పహల్గాంలో పర్యాటకులపై దాడి జరిపిన ఉగ్రవాదులు సైనికుల యూనిఫారాలు, అమెరికన్ మేడ్ ఎం4 కార్బైన్ అసాల్ట్ రైఫిళ్లు, ఏకే-47లు ధరించి వచ్చి.. దాదాపు 70 రౌండ్ల కాల్పులు జరిపినట్టు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఆ ప్రాంతాన్ని జల్లెడపట్టిన దర్యాప్తు అధికారులు.. మంగళవారం సాయంత్రానికి 50 నుంచి 70 దాకా యూజ్డ్ క్యాట్రిడ్జ్‌లను స్వాధీనం చేసుకున్నారు. కాగా... ఈ దాడికి సంబంధించిన దర్యాప్తు బాధ్యతను జమ్మూకశ్మీర్ పోలీసుల నుంచి జాతీయ దర్యాప్తు సంస్థకు (ఎన్ఐఏ) అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది.

కశ్మీర్‌లో 56 మంది విదేశీ ఉగ్రవాదులు

అత్యధికంగా లష్కరే ముష్కరులు 35 మంది..జైషే ఉగ్రవాదులు 18 మంది

జమ్ముకశ్మీర్‌లో 56 మంది విదేశీ ఉగ్రవాదులు ఉన్నట్టు భద్రతా దళాలు, భద్రతా నిపుణుల సమాచారం. వారిలో అత్యధికులు.. 35 మంది.. లష్కరే తాయిబాకు చెందినవారేనని, 18 మంది జైషే మొహమ్మద్ ఉగ్ర సంస్థకు చెందినవారని, ముగ్గురు హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాదులని.. ఆ ముగ్గురూ పాకిస్థానీలని భద్రతాదళాలకు చెందిన ఒక అధికారి వెల్లడించారు. ఈ 56 మందికి తోడు మరో 17 మంది స్థానిక ఉగ్రవాదులు కూడా ఉన్నట్టు ఆయన తెలిపారు. మంగళవారం నాటి దాడి తమ పనేనని టీఆర్ఎఫ్ (ద రెసిస్టెంట్ ఫ్రంట్) ప్రకటించినప్పటికీ.. అది ముసుగు మాత్రమేనని.. వాస్తవంగా దీని వెనుక ఉన్నది లష్కరే ఉగ్రవాదులేనని జమ్ముకశ్మీర్ మాజీ పోలీసు బాస్ ఎస్‌పీ వైద్ అభిప్రాయపడ్డారు. దాదాపు మూడు దశాబ్దాలపాటు జమ్ముకశ్మీర్ పోలీసు శాఖలో పనిచేసిన వైద్.. గతంలో ఉగ్రవాదులు (విదేశీ, స్థానిక) అమర్‌నాథ్ యాత్రకు వచ్చే యాత్రికులను మాత్రమే లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడేవారని.. కానీ, ఇప్పుడు వారి వ్యూహం మారినట్టు కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. "ఈ దాడి ప్రభావం కశ్మీర్‌లోయపై తీవ్రంగా పడుతుంది. పర్యాటకులు తమ బుకింగ్స్‌ను రద్దు చేసుకుంటారు. వేరే ప్రాంతాల నుంచి కశ్మీర్‌కు రావాలంటేనే భయపడే పరిస్థితి ఉంటుంది. హోటళ్లు ఖాళీ అవుతాయి. పాకిస్థాన్‌కు కావాల్సింది సరిగ్గా ఇదే" అని ఆయన ఆందోళన వెలిబుచ్చారు. కశ్మీరీలంతా దీనికి వ్యతిరేకంగా ఒక్కటై నిలవాలని ఆయన సూచించారు.

రెండు జంటలు.. ఇద్దరు నవవరుల మృతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: నిండు నూరేళ్ల జీవితాన్ని సంతోషంగా గడిపేందుకు కోటి ఆశలతో ఒక్కటైన రెండు జంటలు.. ఒకరికొకరు తోడుగా ప్రకృతి అందాలను వీక్షిస్తూ మైమరిచిపోయిన సమయంలో ముష్కర మూకలు వారిని విడదీశాయి. వందేళ్ల బతుకు కలలను క్షణంలో చిదిమేశాయి. జమ్మూకశ్మీర్‌లోని బైసారన్‌లో ఉగ్రవాదుల మారణకాండలో ఇటీవలే పెళ్లయిన ఇద్దరు యువకులు కన్నుమూశారు. వారిలో ఒకరు నావికాదళంలో లెఫ్టినెంట్‌గా పనిచేస్తున్న వినయ్ నర్వాల్ (26), మరొకరు వ్యాపారవేత్త శుభమ్ ద్వివేదీ (30). హరియాణాలోని కర్నాల్ ప్రాంతానికి చెందిన వినయ్ నర్వాల్‌కు ఈ నెల 16వ తేదీనే హిమాన్షితో వివాహం జరిగింది. 19వ తేదీన రిసెప్షన్ వేడుక జరిగింది. హనీమూన్ కోసం యూరప్ వెళ్లడానికి సిద్ధమైన ఈ జంట.. వీసా తిరస్కరణకు గురవడంతో బదులుగా కశ్మీర్‌ను ఎంచుకుంది. 22వ తేదీన బైసారన్ ప్రాంతంలో విహరిస్తుండగా ఉగ్రవాదుల దుశ్చర్యకు వినయ్ బలయ్యారు. తన కళ్లముందే భర్తను కాల్చిచంపేయడంతో హిమాన్షి తీవ్ర ఆవేదనలో కూరుకుపోయారు. బుధవారం వినయ్ మృతదేహాన్ని ఢిల్లీకి తరలించిన సమయంలో.. శవపేటికను గట్టిగా కౌగిలించుకుని ఆమె చేసిన రోదన అందరినీ కలచివేసింది. మే 1వ తేదీన వినయ్ పుట్టినరోజు ఉండటంతో.. కుటుంబ సభ్యులు వేడుకల కోసం ఏర్పాట్లు కూడా మొదలుపెట్టారు. కానీ ఇంతలోనే కన్నుమూశాడంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌కు చెందిన శుభమ్ ద్వివేదీకి ఈ ఏడాది ఫిబ్రవరి 12వ తేదీనే అశాన్యతో వివాహం జరిగింది. హనీమూన్ కోసం తమ తొలి ట్రిప్‌గా వారు జమ్మూకశ్మీర్‌కు వచ్చారు. సరదాగా గుర్రాలు ఎక్కి బైసారన్ ప్రాంతానికి చేరుకున్నారు. ఇంతలోనే ఉగ్రదాడిలో శుభమ్ బలయ్యాడు. తన కళ్లముందే భర్తను చంపేయడంతో అశాన్య హతాశురాలైంది. "అప్పుడే గుర్రాలపై కొండపైకి చేరుకున్నాం. ఓ వ్యక్తి మావద్దకు వచ్చి.. మీరు హిందువా, ముస్లిమా అని అడిగాడు. అతను జోక్ చేస్తున్నాడని అనుకుని నవ్వేశాం. కానీ అతను మళ్లీ అడిగాడు. మేం ముస్లింలం కాదని చెప్పగానే.. గన్ తీసి శుభమ్‌ను తలపై కాల్చాడు. నన్ను కూడా కాల్చేసి ఉంటే బాగుండేది.." అంటూ అశాన్య వాపోయారు.



ఉగ్రదాడికి కొద్ది సేపటి ముందు వినయ్ నర్వాల్-హిమాన్షి దంపతులు సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న వీడియోలోని దృశ్యం

చైనాపై సుంకాలు తగ్గుతాయ్

కానీ సున్నాకు మాత్రం చేరవు: ట్రంప్

వాషింగ్టన్, ఏప్రిల్ 23: చైనాపై అధిక సుంకాలతో విరుచుకుపడి వాణిజ్య యుద్ధానికి తెరతీసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యూటర్న్ తీసుకున్నట్టుగా సంకేతాలిచ్చారు. చైనా ఉత్పత్తులపై విధించిన అధిక సుంకాలు గణనీయంగా తగ్గుతాయని, అయితే సున్నా మాత్రంకావని మంగళవారం వైట్ హౌస్‌లో ట్రంప్ వ్యాఖ్యానించారు. అమెరికా విధించిన సుంకాలకు ప్రతీకారంగా చైనా సుంకాలు విధించడంతో ఆ దేశ ఉత్పత్తులపై అమెరికా సుంకాలు 145 శాతం మించాయి. ఈ నేపథ్యంలో "145 శాతం అనేది చాలా ఎక్కువ. అయితే అది అంత ఎక్కువగా ఉండదు... గణనీయంగా తగ్గుతుంది. కానీ సున్నా మాత్రం కాదు" అని ఓవల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా, చైనా మధ్య అధిక సుంకాలు రెండు ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్యాన్ని అడ్డుకున్నాయని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ అంతకు ముందు వ్యాఖ్యానించారు. దీని గురించి ప్రశ్నించిన సందర్భంగా ట్రంప్ పై విధంగా స్పందించారు. కాగా చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో తనకు మంచి సంబంధం ఉందని ట్రంప్ పేర్కొన్నారు. షీ చర్చలకు వస్తారన్న ఆశాభావాన్ని ట్రంప్ మరోసారి వ్యక్తం చేశారు. ఒప్పందం కోసం చైనా లేదా షీతో అమెరికా కఠినంగా వ్యవహరించబోతోందా, కొవిడ్ మహమ్మారి గురించి అధికారులు ప్రస్తావిస్తారా అని ప్రశ్నించగా.. లేదని ఆయన సమాధానమిచ్చారు. కానీ వారు చివరకు ఒక ఒప్పందం కుదుర్చుకోవాలన్నారు.



ట్రంప్ వ్యాఖ్యలతో స్టాక్ మార్కెట్లో జోరు..

చైనాపై సుంకాలు గణనీయంగా తగ్గుతాయని, అమెరికా ఫెడరల్ రిజర్వు చైర్మన్ జెరోమ్ పావెల్‌ను తొలగించే ఉద్దేశం లేదని మంగళవారం డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు ఎగబాకాయి. ఎస్ అండ్ పీ 500 బ్లూచిప్ ఇండెక్స్, నాస్‌డాక్ 2.5 శాతానికి పైగా పెరిగాయి. ఆసియా మార్కెట్లో జపాన్ సూచీ నిక్కీ దాదాపు 2 శాతం, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 2.4 శాతం, దక్షిణ కొరియా కాస్పీ 1.6 శాతం పెరిగాయి. బుధవారం ప్రారంభ ట్రేడింగ్‌లో యూరప్ మార్కెట్లలోనూ ర్యాలీ నెలకొంది. యూకే ఎఫ్‌టీఎస్ఈ 100 ఇండెక్స్ 1.6 శాతం, ఇటాలియన్ ఎఫ్‌టీఎస్ఈ ఎంఐబీ 1.1 శాతం పెరిగాయి. జర్మనీ డాక్స్ 2.6 శాతం, ఫ్రాన్స్ సీఏసీ 2.5 శాతం పుంజుకుంది. పావెల్‌ను తొలగించబోమని ట్రంప్ పేర్కొనడంతో ఇన్వెస్టర్లలో విశ్వాసం పెరిగింది. ఇదిలా ఉండగా, సుంకాల ప్రయోగాన్ని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ బుధవారం తీవ్రంగా విమర్శించారు. ఇవి అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థను బలహీనపరచడమేకాకుండా ప్రపంచ ఆర్థిక క్రమాన్ని అస్థిరపరుస్తాయని ఆయన హెచ్చరించారు.

భారత్‌కు ఎఫ్-35లు అందిస్తాం

- అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: అమెరికా మరోసారి భారత్‌కు ఎఫ్-35 యుద్ధ విమానాలను ఆఫర్ చేసింది. భారత్‌కు ఎఫ్-35లు అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తెలిపారు. దేశ గగనతలాన్ని సంరక్షించడంలో ఈ ఐదో తరం అత్యాధునిక యుద్ధ విమానాలు భారత వైమానిక దళానికి మునుపెన్నడూ లేనంత సామర్థ్యాలను అందిస్తాయని చెప్పారు. అమెరికా నుంచి మరింతగా రక్షణ సామగ్రిని కొనుగోలు చేయడం భారత్‌కు ప్రయోజనకరమని అన్నారు. అమెరికాతో రక్షణ సహకారాన్ని కొనసాగించడం ద్వారా భారత్ మరింత ప్రయోజనం పొందాలని వాన్స్ ఆకాంక్షించారు. ఇటీవల ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా ఈ ఆధునిక స్టెల్త్ ఫైటర్‌ను భారత్‌కు అందిస్తామని ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా, ఎఫ్-35 విమానాల కొనుగోలుపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని వైమానిక దళాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ వ్యాఖ్యానించారు.

వెంకయ్య కశ్మీర్ పర్యటన రద్దు

» ఢిల్లీలో దత్తాత్రేయ పుస్తకావిష్కరణ వాయిదా

ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రవాదుల దాడుల మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు బుధవారం తన కశ్మీర్ పర్యటనను రద్దు చేసుకున్నారు. తన సతీమణి ఉషమ్మతో పాటు శ్రీనగర్ వెళ్లి ఈనెల 28 వరకు ఐదు రోజుల పాటు కశ్మీర్‌లో పహల్గాం సహా వివిధ ప్రాంతాల్లో ఆయన పర్యటించాల్సి ఉంది. శ్రీనగర్ రాజ్ భవన్‌లో ఆయనకు బస ఏర్పాట్లు కూడా చేశారు. అయితే, ప్రస్తుత అలజడి సద్దుమణిగేవరకూ కశ్మీర్ పర్యటనను రద్దు చేసుకోవాలని భద్రతా వర్గాలు ఆయనకు సలహా ఇవ్వడంతో బుధవారం ఉదయం ఆయన ఢిల్లీ నుంచి హైదరాబాద్ తిరిగి వెళ్లిపోయారు. కాగా హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ గురువారం న్యూఢిల్లీలో జరగాల్సిన తన పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని కూడా పహల్గాం ఘటన నేపథ్యంలో వాయిదా వేసుకున్నారు. 'జనతా కీ కహానీ మేరీ ఆత్మకథ' పేరుతో ఆయన రచించిన ఆత్మకథను గురువారం ఉపరాష్ట్రపతి ఆవిష్కరించాల్సి ఉండగా.. వాయిదా పడింది.

కాశ్మీర్‌లో ఉగ్ర దాడి అమానుషం: భట్టి

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి 27మందిని పొట్టన పెట్టుకోవడం పట్ల డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉగ్రవాదులు దాడి చేసి పర్యాటకులను హత్య చేయడం అమానుషమని, ఇలాంటి సంఘటనలకు దేశంలో తావు లేదని పేర్కొన్నారు.

పర్యాటకులకు పూర్తిస్థాయి భద్రత కల్పించండి

» కశ్మీర్ డీజీపీని కోరిన బండి సంజయ్

జమ్మూకశ్మీర్ పర్యటనకు వచ్చే యాత్రికులకు పూర్తిస్థాయిలో భద్రత కల్పించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కశ్మీర్ డీజీపీ నళినీ ప్రభాత్‌కు సూచించారు. ఉగ్రదాడి నేపథ్యంలో బుధవారం ఆయన యాత్రికుల భద్రతపై డీజీపీతో మాట్లాడారు. స్థానికంగా ఉండే హోటల్ యజమానులతోనూ ఫోన్‌లో మాట్లాడి ధైర్యంచెప్పారు. కశ్మీర్‌లో పర్యటించే యాత్రికులు ఆందోళనకు గురికావద్దని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు.

ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో హెల్ప్‌లైన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా హెల్ప్ లైన్ ఏర్పాటు చేసింది. రాష్ట్రానికి చెందిన ఎవరైనా ఉంటే స్పందించాలని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ సూచించారు. కశ్మీర్ ప్రభుత్వంతోపాటు కేంద్ర ఏజెన్సీలతో సమన్వయం చేస్తున్నామని, తెలంగాణ వాసులు ఎవరైనా ఉన్నారా? అనే అంశంపై ఆరా తీస్తున్నామని తెలిపారు. సాయం కోసం 9871999044(వందన), 9971387500 (హైదర్‌అలీ నక్వీ) నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఢిల్లీలో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసింది. 9818395787, 011 23387089 నంబర్లను సంప్రదించాలని అధికారులు సూచించారు.

ఉగ్రవాద దాడికి 'మాస్ లైన్' ఖండన

నల్లకుంట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రవాద దాడిని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) కేంద్ర కమిటీ ఖండించింది. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసింది. కవిఎటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్ సింహా ఠాకూర్, సహాయ కార్యదర్శి పోటు రంగారావు బుధవారం ఇక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఆర్టికల్ 370ని రద్దు చేసి పూర్తిస్థాయి రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చడం రాజకీయ సమస్యకు సరైన సమాధానం కాదని ఈ ఘటన మరోసారి రుజువు చేస్తుందన్నారు.

చెన్నమనేని కేసులో సీఐడీకి ఆది శ్రీనివాస్

» వాంగ్మూలం నమోదు చేసుకున్న దర్యాప్తు అధికారులు

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ పౌరసత్వం కేసుకు సంబంధించి ఫిర్యాదుదారు, కాంగ్రెస్ నేత, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్.. సీఐడీ అధికారులను బుధవారం కలిశారు. సీఐడీ కార్యాలయానికి వచ్చిన శ్రీనివాస్ ఈ కేసుకు సంబంధించి తన వద్ద ఉన్న ఆధారాలను దర్యాప్తు అధికారికి అందజేశారు. ఆపై ఆది శ్రీనివాస్ వాంగ్మూలాన్ని సీఐడీ అధికారులు నమోదు చేసుకున్నారు. భారత పౌరసత్వం విషయంలో చెన్నమనేని అక్రమాలకు పాల్పడినట్లు సీఐడీ అధికారులు గత నెల 17న కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించిన అనేక కీలక ఆధారాలను ఆది శ్రీనివాస్ దర్యాప్తు అధికారులకు అందించడంతో రమేశ్ విషయంలో అధికారులు తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నారు.

కేశవరెడ్డి విద్యార్థుల విజయ విహారం


597 మార్కులు సాధించిన తన్మయి గాయిత్రిని అభినందిస్తున్న కేశవరెడ్డి

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఏపీ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని కేశవరెడ్డి విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ యన్.కేశవ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన్మయిగాయిత్రి 597, వర్షితబాయి, నాగ సత్యమణికంఠ, వెంకట అభినవ్ రెడ్డి 596 మార్కులు సాధించారని వివరించారు. ఏడుగురు విద్యార్థులు 595 మార్కులు, 8మంది 594 మార్కులు సాధించారని పేర్కొన్నారు. ప్రతి ఐదుగురిలో ముగ్గురు 500పైగా మార్కులు సాధించారని, ప్రతి సబ్జెక్టులో సగానికిపైగా విద్యార్థులు 90%పైగా మార్కులు సాధించారని తెలిపారు. తెలుగు, హిందీ, ఆంగ్లంలో సగటున 84%,గణితం, సామాన్య, సాంఘిక శాస్త్రంలో సగటున 86%మార్కులు సాధించినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, టీచర్లను ఆయన అభినందించారు.


విద్యార్థులతో భాష్యం రామకృష్ణ

పది ఫలితాల్లో భాష్యం విజయభేరి

» 600కి 600 మార్కులు సాధించిన వై.నేహాంజని

గుంటూరు(విద్య), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఏపీ పదో తరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమప్రతిభ కనబరిచారని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. బుధవారం గుంటూరు భాష్యం క్యాంపస్‌లో ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థి వై.నేహాంజని 600కి 600 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానంలో నిలిచినట్టుచెప్పారు. కె.ప్రేమసత్య లిఖిత, కె.హర్షిత్, ఎ.లిఖిత 599, పి.వి.ఎస్. ఎస్.శ్రీహాసిని, ఎస్.షాలిని సంహిత, ఎం.ప్రియజోషిని 598 మార్కులు సాధించారని వెల్లడించారు. 590కి పైగా మార్కులు 206 మంది, 580కి పైగా 953, 570కి పైగా 1,889, 550కి పైగా 3,585, 500 మార్కులకు పైగా 6,635 మంది విద్యార్థులు సాధించారన్నారు. గణితంలో 100కు 100సాధించిన విద్యార్థులు 1,088 ఉన్నారన్నారు. సైన్స్‌లో 100కు 100సాధించిన వారు 724మంది ఉన్నట్టు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులను చైర్మన్ రామకృష్ణ, వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్‌డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ అభినందనలు తెలిపారు.

ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య

ప్రపంచ దేశాల ఎదుట పాకిస్థాన్‌ను దోషిగా నిలబెడతాం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు లక్ష్మణ్, ఈటల, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన

కవాడిగూడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడి.. పిరికిపంద చర్య అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాకిస్థాన్ అసమర్థ నాయకత్వానికి ఈ ఘటన పరాకాష్ట అని ఆయన పేర్కొన్నారు. ప్రశాంతంగా ఉన్న జమ్మూ కశ్మీర్‌లో పాకిస్థాన్ విషం చిమ్ముతోందని మండిపడ్డారు. భారత్‌ను దెబ్బతీయాలని చూస్తే.. పాక్ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, లక్ష్మణ్, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి తదితరులు నివాళులర్పించారు. అనంతరం కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టికల్ 370ని తొలగించిన తర్వాత కశ్మీర్‌లో పర్యాటకుల సంఖ్య పెరిగి, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయన్నారు. ఇలాంటి తరుణంలో అమాయకులైన పర్యాటకులను హత్య చేసి మతం పేరుతో ప్రజలను విభజించేందుకు పాకిస్థాన్ కుట్ర చేసిందన్నారు. రానున్న రోజుల్లో ప్రపంచ దేశాల ముందు పాకిస్తాన్‌ను దోషిగా నిలబెడతామని పేర్కొన్నారు. దేశంలో ఉన్న 140కోట్ల మంది ఏకమై.. ఉమ్మి వేస్తే.. పాకిస్తాన్ అందులో కొట్టుకుపోతుందన్నారు. ఎంపీలు లక్ష్మణ్, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు పర్యాటకులపై కాల్పులు జరపడం.. హేయమని అన్నారు. భారత పౌరుల రక్తాన్ని కళ్ల చూసిన వారి అంతమే మన కర్తవ్యమని ప్రతిన బూనుదామన్నారు. ఉగ్రవాదులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

'ఆపరేషన్ కర్రెగుట్టలు' షురూ..!

గుట్టలను చుట్టుముట్టిన బలగాలు.. ఉదయం నుంచి మొదలైన బాంబుల మోత

- పూజారి కాంకేర్ రోడ్డు మూసివేత
- ప్రజలు ఇళ్లలోనే ఉండాలని ఆదేశాలు
- మందుపాతరలను గుర్తించి.. నిర్వీర్యం చేస్తున్న కేంద్ర బలగాలు
- తెలంగాణ సరిహద్దు ప్రాంతాల దిగ్బంధం
- కాల్పుల విరమణను ప్రకటించాలి
- బలగాలను సీఎం వెనక్కి రప్పించాలి
- పీస్ డైలాగ్ కమిటీ చైర్మన్ చంద్రకుమార్



నిర్మానుష్యంగా రాంపురం గ్రామం(ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న జస్టిస్ బి.చంద్రకుమార్

చర్ల/వాజేడు/వెంకటాపురం/బర్కత్‌పుర, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కర్రెగుట్టలు మొదలైంది.! కేంద్ర ప్రభుత్వం చేపట్టిన మావోయిస్టుల ఏరివేత కార్యక్రమం 'ఆపరేషన్ కగార్'కు కర్రెగుట్టలు ఆఖరి మజిలీగా బలగాలు భావిస్తున్నాయి. సోమ, మంగళవారాల్లో ఈ ప్రాంతం వైపు కదిలిన బలగాలు.. బుధవారం ఉదయానికి గుట్టలను చేరుకున్నాయి. ఈ ప్రాంతానికి 'ఆంధ్రజ్యోతి' చేరుకుంది. అయితే.. అడుగడుగునా పోలీసుల దిగ్బంధం, రహదారుల మూసివేత కారణంగా.. అతికష్టమ్మీద.. బుధవారం మధ్యాహ్నానికి ఆంధ్రజ్యోతి ప్రతినిధి కర్రెగుట్టలను చేరుకున్నారు. గుట్టలను సమీపిస్తున్న కొద్దీ.. బాంబుల మోతతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లుతుండడాన్ని గుర్తించారు. అయితే.. భీమారంపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీసు బేస్ నుంచి ముందుకు వెళ్లడానికి వీల్లేదని నిలిపివేశారు. గ్రామస్థులకు కూడా ఇవే ఆదేశాలు జారీ చేశారు. ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించారు. అక్కడి నుంచి వార్తాసేకరణ కొనసాగించిన 'ఆంధ్రజ్యోతి'కి ప్రతి రెండు నిమిషాలకు ఒకటి చొప్పున బాంబు పేలుళ్లు వినిపించాయి. కర్రెగుట్టలకు సమీపంలో ఉండే రాంపురం, భీమారంపాడు గ్రామాలు పోలీసుల ఆంక్షలతో నిర్మానుష్యంగా మారాయి.

తెలంగాణ వైపు నుంచి కూంబింగ్

ఛత్తీస్‌గఢ్‌లోని పూజారి కాంకేర్ వైపు బలగాలు రహదారులను దిగ్బంధం చేసి, అక్కడ కాల్పులను ప్రారంభించాయి. దాంతో మావోయిస్టులు తెలంగాణలోని ములుగు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలోకి వస్తారని భావిస్తూ.. ఈ ప్రాంతంలో ముమ్మరంగా కూంబింగ్ ప్రారంభించాయి. సుమారు 4 వేల మందికి పైగా సీఆర్‌పీఎఫ్, కోబ్రా, డీఆర్‌జీ, బస్తర్‌ఫైటర్స్ బలగాలతోపాటు.. తెలంగాణ పోలీసులు కూడా కర్రెగుట్టలను చుట్టుముట్టిన వారిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఓ వైపు కూంబింగ్ కొనసాగిస్తూనే.. బాంబ్ డిస్పోజబుల్, డాగ్ స్క్వాడ్‌లు గుట్టల చుట్టూ మావోయిస్టులు అమర్చిన మందుపాతరలను గుర్తించి, నిర్వీర్యం చేస్తున్నాయి. తెలంగాణ వైపు.. వెంకటాపురం మండలంలోని రాచపల్లి కలిపాక, మొట్లగూడెం ప్రాంతాల వరకు కూడా రెండుమూడు నిమిషాలకో బాంబు పేలుడు శబ్దం వినిపిస్తోందని స్థానికులు తెలిపారు. ఈ పేలుళ్ల మావోయిస్టులు అమర్చిన మందుపాతరలను నిర్వీర్యం చేస్తున్న క్రమంలో సంభవిస్తున్నట్లు సమాచారం.

వెంకటాపురంలో బస్తర్ ఐజీ

బస్తర్ రేంజ్ ఐజీ పి.సుందర్‌రాజ్ వెంకటాపురం నుంచే 'బచావో కర్రెగుట్టలు' ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తున్నట్లు తెలిసింది. ఆయన వెంట ఛత్తీస్‌గఢ్ పోలీసు అధికారులు కూడా ఉన్నట్లు సమాచారం. వెంకటాపురం సమీపంలోని హెలిప్యాడ్ నుంచే బలగాలకు హెలికాప్టర్‌లో నిత్యావసరాలను చేరవేస్తున్నట్లు తెలుస్తోంది. కర్రెగుట్టల చుట్టూ కేంద్ర బలగాలకు చెందిన మూడు హెలికాప్టర్లు, పలు డ్రోన్లతో ఏరియల్ సర్వే నిర్వహిస్తూ.. మావోయిస్టుల ఉనికిని గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. కర్రెగుట్టల వైపు వెళ్తున్న బలగాలు కూడా.. తొలుత డ్రోన్లను పంపి.. ఆ తర్వాత ముందుకు సాగుతున్నట్లు సమాచారం.

చర్చలు జరపాలి: పీస్ డైలాగ్ కమిటీ

కేంద్రం, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ ప్రభుత్వాలు వెంటనే కాల్పుల విరమణను పాటించి, మావోయిస్టులతో శాంతి చర్చలకు సానుకూల వాతావరణాన్ని కల్పించాలని పీస్ డైలాగ్ కమిటీ(పీడీసీ) చైర్మన్ జస్టిస్ బి.చంద్రకుమార్ విజ్ఞప్తి చేశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీడీసీ వైస్ చైర్మన్లు జంపన్న, బాలకృష్ణారావు, కందిమల్ల ప్రతాప్ రెడ్డి, ప్రొఫెసర్ వినాయకరెడ్డి, ఎస్.జీవన్‌కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. హింస ద్వారా సాధించేదేమీ లేదని, మావోయిస్టులు ఇప్పటికే మూడు సార్లు శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించినట్లు వారు గుర్తుచేశారు.దీనిపై ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, ముఖ్యమంత్రులు స్పందించాలని కోరారు. "కర్రెగుట్టల చుట్టూ 10 వేల మంది పోలీసులను మోహరించి, కూంబింగ్ చేస్తున్నారు. మావోయిస్టుల పేరుతో అమాయక ఆదివాసీలను కాల్చిచంపుతున్నారు. కర్రెగుట్ట నుంచి పోలీసు బలగాలను వెనక్కి రప్పించడానికి సీఎం రేవంత్‌రెడ్డి చొరవ చూపాలి" అని వారు డిమాండ్ చేశారు.

'హైదరాబాద్' ఎమ్మెల్సీ ఎన్నికలు..

78 శాతం పోలింగ్

- 112 మందికి గాను ఓటేసిన 88 మంది
- ఓటింగ్‌లో పాల్గొనని బీఆర్ఎస్
- బరిలో బీజేపీ, మజ్లిస్ అభ్యర్థులు
- రేపు ఓట్ల లెక్కింపు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని రెండు పోలింగ్ కేంద్రాల్లో ఎక్స్‌అఫీషియో సభ్యులు, కార్పొరేటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 112 మంది ఓటర్లకుగాను 88 మంది ఓటు వేశారు. 78.57 శాతం పోలింగ్ నమోదైనట్లు రిటర్నింగ్ అధికారి (ఆర్‌వో) అనురాగ్ జయంతి తెలిపారు. మజ్లిస్ అభ్యర్థిగా మిర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి, బీజేపీ అభ్యర్థిగా డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు బరిలో నిలిచారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీకి దూరంగా ఉన్నాయి. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఓటు హక్కు వినియోగించుకోగా.. పార్టీ నిర్ణయం మేరకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు 24 మంది పోలింగ్‌లో పాల్గొనలేదు. మజ్లిస్ ప్రజాప్రతినిధులు 50 మంది, బీజేపీ నుంచి 24 మంది, కాంగ్రెస్ నుంచి 14 మంది ఓటు వేశారు. 31 మంది ఎక్స్‌అఫీషియో సభ్యులకుగాను 22 మంది, 81 మంది కార్పొరేటర్లకుగాను 66 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమవగా.. మధ్యాహ్నం 2 గంటలకల్లా 88 మందీ ఓటేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, లక్ష్మణ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ జీహెచ్ఎంసీ ఆఫీసులోని భవన నిర్వహణ విభాగం గదిలో ఉన్న పోలింగ్ కేంద్రంలో, కార్పొరేటర్లు లైబ్రరీ హాల్‌లోని కేంద్రంలో ఓటేశారు. పోలింగ్ ముగిశాక బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూంలో భద్రపర్చారు. 25న ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు జరగనుంది. బీఆర్ఎస్ కార్పొరేటర్లు కొందరు ఓటింగ్‌కు వస్తున్నారని ప్రచారం జరిగినప్పటికీ.. ఎవరూ పోలింగ్‌లో పాల్గొనలేదు. ఎన్నికల నేపథ్యంలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ ఒక్కటేనని, మజ్లిస్‌ను నిలువరించేది బీజేపీ మాత్రమేనని ఆ పార్టీ అభ్యర్థి గౌతమ్‌రావు చెప్పారు.


తల్లిదండ్రులతో శ్రావణ్ కుమార్‌రెడ్డి


రైల్వే ట్రైన్ మేనేజర్ (గార్డు) కుమారుడికి

సివిల్స్‌లో 62వ ర్యాంకు

చిలకలగూడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సివిల్స్ ఫలితాల్లో రైల్వే ట్రైన్ మేనేజర్ (గార్డు) శివశంకర్‌రెడ్డి కుమారుడు శ్రావణ్ కుమార్‌రెడ్డి 62వర్యాంకు సాధించాడు. శివశంకర్‌రెడ్డి దక్షిణ మధ్య రైల్వే (సికింద్రాబాద్)లో ట్రైన్ మేనేజర్. శ్రావణ్ తల్లి గృహిణి. సోదరి ఓ ప్రైవేటు బ్యాంకులో పనిచేస్తున్నారు. శ్రావణ్‌కుమార్‌రెడ్డి బోడుప్పల్‌లో చదువుకున్నారు.ఐఐటీ ముంబైలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ప్రస్తుతం ఢిల్లీలో ఐఆర్ఎంఎస్ శిక్షణ తీసుకుంటున్నారు. ఆరోసారి సివిల్స్ పరీక్ష రాసి శ్రావణ్ 62వ ర్యాంకు సాధించినట్టు శివ శంకర్ రెడ్డి తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో మైనారిటీ గురుకులాల సత్తా

» 994 మార్కులతో టాపర్‌గా ఆటోడ్రైవర్ కుమార్తె ముస్కాన్


ముస్కాన్ బేగం

హైదరాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్ర జ్యోతి): ఇంటర్ ఫలితాల్లో మైనారిటీ గురుకులాల విద్యార్థులు సత్తా చాటారు. బైపీసీ ద్వితీయ సంవత్సరంలో గద్వాల విద్యార్థిని ముస్కాన్ బేగం 994 మార్కులతో టాపర్‌గా నిలిచింది. ముస్కాన్ తండ్రి ఆటో డ్రైవర్. కరీంనగర్, మల్కాజిగిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్ గురుకులాల విద్యార్థులు జి.చరణ్ తేజ, అనామిక, ధానియా బాను, నుస్బా సుల్తానా, సీ వాసవి 993 మార్కులు సాధించారు. బైపీసీ ప్రథమ సంవత్సరంలో రంజాన్ బీ (కొత్తగూడెం), వజీహా తబస్సుమ్ (రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్), సఫూరా సిద్దీఖా (వికారాబాద్), ధరణి (మిర్యాలగూడ), ఆయేషా బేగం (హైదరాబాద్ ఆసిఫ్‌నగర్) 440 మార్కులకు 438 సాధించారు. ఆరుగురు విద్యార్థులు 437 మార్కులు, 12 మంది 436 మార్కులు సాధించారు.

వడదెబ్బకు 11 మంది మృత్యువాత

(మొదటిపేజీ తరువాయి)

ఆయా మండలాల్లో అధికారులు రెడ్ అలెర్ట్ జారీ చేశారు. జగిత్యాల జిల్లా ఎండపల్లి, ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి, మంచిర్యాల జిల్లా నెన్నెల, హాజీపూర్, జన్నారం, లక్సెట్టిపేట మండలాల్లో 44.9 డిగ్రీల చొప్పున నమోదైంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో పలుచోట్ల 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత రికార్డయింది. ఈ నేపథ్యంలోనే గ్రేటర్‌వ్యాప్తంగా విద్యుత్తు డిమాండ్ రికార్డు స్థాయిలో 4,117 మెగావాట్లకు పెరిగింది. ఇక ఖమ్మం జిల్లా కల్లూరు అంబేడ్కర్ కాలనీకి చెందిన మహిళా రైతు నారుమళ్ల చంద్రకళ (46), అదే మండలంలోని చిన్నకోరుకొండిలో వ్యవసాయ కూలీ పి.రామగురు(45), మధిర రామనాథం వీధిలో వజ్రాల శేషాచారి (80) వడదెబ్బకు అస్వస్థతకు గురై ప్రాణాలు విడిచారు. పెద్దపల్లి జిల్లా ఫైటింక్లయిన్‌కాలనీకి చెందిన లారీ డ్రైవర్ పుల్లూరి రమేశ్ (37), ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్‌లోని ఆశ్రమ పాఠశాలలో సీఆర్టీగా విధులు నిర్వహిస్తున్న కస్నక కాశీరాం(42) వడదెబ్బకు మృతి చెందారు. సూర్యాపేట జిల్లా చిలుకూరులో ఉపాధి కూలీ కొడారు కోటయ్య (62), నిర్మల్ జిల్లా ముథోల్ మండలం ఆష్టకు చెందిన మత్స్య కార్మికుడు బెస్త గంగారాం (55), కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన కల్లెం రమేశ్ (55) ఎండల ధాటికి అస్వస్థతకు గురై మరణించారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తిమ్మంపేటలో వ్యవసాయ కూలీ నాంపెల్లి రవళి (35), జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన మధ్యాహ్న భోజన కార్మికురాలు పులి రమ (50), ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం నారాయణగిరిపల్లిలో పశువుల కాపరి తాళ్ల సాంబయ్య (65) వడదెబ్బకు మృతి చెందారు.


ఎండకు తట్టుకోలేక భూపాలపల్లి ఆర్టీసీ బస్సులో కూలర్ పెట్టుకున్న డ్రైవర్

ములుగు జిల్లాలో వర్ష బీభత్సం..

ములుగు జిల్లా వాజేడు, ఏటూరునాగారం మండలాల్లో మంగళవారం అర్ధరాత్రి దాటాక ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు, వడగండ్లతో భారీ వర్షం కురిసింది. దీంతో పలు పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. వాజేడు మండలంలోని చింతూరు పంచాయతీలోని అర్లగూడెంలో కల్లాలో ఆరబెట్టిన మిర్చి పూర్తిగా దెబ్బతింది. సుమారు 20 ఎకరాల్లో మిర్చి పంట నాశనం కావడంతో రైతులు లబోదిబోమన్నారు. ఏటూరునాగారం మండలంలో కోతకు వచ్చిన వరి పైరు నేలకొరిగింది. వివిధ గ్రామాల్లో దాదాపు 350 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలోనే రైతులు ములుగు కలెక్టర్ దివాకరను కలిసి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

రెండ్రోజులు వడగాడ్పులు.. వర్షాలు!

రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో గురు, శుక్రవారాల్లో వడగాడ్పులు వీస్తాయని.. మరికొన్ని జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మెదక్, కామారెడ్డి, మహబూబాబాద్‌నగర్ జిల్లాల్లో వడగాడ్పులు వీస్తాయని.. ఆ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. అలాగే ఈ రెండు రోజులు.. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, నల్లగొండ, గద్వాల, ములుగు, వనపర్తి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో రాత్రి పూట ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలకు పైగా నమోదవుతాయని పేర్కొంది.

జనతా గ్యారేజ్‌లా తెలంగాణ భవన్!

- ప్రజలకు ఏ సమస్య వచ్చినా బీఆర్ఎస్ అండగా నిలుస్తోంది
- వరంగల్ గడ్డపై చరిత్ర సృష్టించేలా బీఆర్ఎస్ సభ: కేటీఆర్



వరంగల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ భవన్ జనతా గ్యారేజ్‌లా మారిందని, ప్రజలకు ఏ సమస్య వచ్చినా బీఆర్ఎస్‌నే ఆశ్రయిస్తున్నారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. హైడ్రా, లగచర్ల, హెచ్‌యూసీ వంటి అనేక సమస్యలపై బీఆర్ఎస్ ముందుండి పోరాడిందని ఆయన తెలిపారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి వద్ద నిర్వహించబోయే బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించి మీడియాతో మాట్లాడారు. 24 ఏళ్లుగా ప్రజలు తమకు ఏ బాధ్యత అప్పగించినా దానిని సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నామని ఆయన అన్నారు. తెలంగాణ కోసం 14 ఏళ్ల ఉద్యమ పార్టీగా, పదేళ్ల అధికార పార్టీగా బీఆర్ఎస్ పనిచేసిందని, ప్రస్తుతం 16 నెలలుగా ప్రతిపక్ష పార్టీగా పని చేస్తోందని చెప్పారు. ఈ నెల 27న వరంగల్ గడ్డపై రజతోత్సవ సభ చరిత్ర సృష్టిస్తుందని కేటీఆర్ తెలిపారు. అందుకోసం భారీగా జనసమీకరణ చేస్తున్నామని తెలిపారు. 1,250 ఎకరాల్లో సభను ఏర్పాటు చేస్తున్నామని, 40వేల వాహనాలు వచ్చినా పార్కింగ్‌కు ఇబ్బంది ఉండదన్నారు. వందకు పైగా వైద్య బృందాలు, 15 అంబులెన్సులు, వందల సంఖ్యలో తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే కొందరు కార్యకర్తలు, రైతులు సూర్యాపేట, వర్ధన్నపేట నుంచి ఎడ్లబండ్లపై జాతరకు వచ్చినట్లుగా తరలి వస్తున్నారని తెలిపారు. సభకోసం రెండువేల మందిని పార్టీ వలంటీర్లుగా నియమించామని చెప్పారు.

మే 22 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

హైదరాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 22 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్టు ఇంటర్ బోర్డు తెలిపింది. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2-30 నుంచి 5-30 వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఉంటాయని ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. మే-22న ద్వితీయ భాష, 23న ఇంగ్లీష్, 24న గణితం పేపర్-ఎ, బాటనీ, పొలిటికల్ సైన్స్, 25న మ్యాథమెటిక్స్ పేపర్-బి, జువాలజీ, హిస్టరీ, 26న ఫిజిక్స్, ఎకనామిక్స్, 27న కెమిస్ట్రీ, కామర్స్, 28న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, బ్రిడ్జి కోర్సు గణితశాస్త్రం, 29న మాడ్రన్ ల్యాంగ్వేజ్, జియాగ్రఫీ పరీక్షలు ఉంటాయని తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 3 నుంచి 6 వరకు నిర్వహించనున్నారు. ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష జూన్-11న ఉదయం 10 నుంచి 1వరకు, ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్ష జూన్ 12న ఉంటుందన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.